

# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

## ఉత్తరాంధ్ర

విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం

బుధవారం 11-6-2025 పేజీలు: 15




# నగరంలో విచ్చలవిడిగా గంజాయి గుప్పు

- మత్తులో తూగుతున్న విశాఖ..!
- గంజాయి ఉచ్చులో బానిసలుగా మారుతున్న యువత
- ఆగని గంజాయి అక్రమ రవాణా..
- వివిధ మార్గాల ద్వారా అక్రమ తరలింపు
- ఎక్కడికక్కడ తనిఖీలు చేసినా షరా మామూలే
- కొనసాగుతున్న అరెస్టులు
- గంజాయి కేసులో ముద్దాయిలు దొరకడం లేదు
- ప్రతి స్టేషన్లో పదుల సంఖ్యలో కేసులు పెండింగ్.!
- పట్టుకోవడంలో పోలీసులు విఫలం!
- ఎక్కడ జాడలేని 100 రోజుల గంజాయి నిర్మూలన

(మేజర్ న్యూస్, క్రైం బ్యూరో)



విశాఖ లో పోలీసులు ఎంత కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినప్పటికీ గంజాయి అక్రమ రవాణా ఆగడం లేదు.ఏజెన్సీ ప్రాంతాల నుంచి వివిధ రవాణా మార్గాల ద్వారా పోలీసుల కళ్లుగప్పి అక్రమంగా విశాఖ లో గంజాయి తిష్ట వేస్తుంది. అక్రమ గంజాయి తరలిస్తూ ముఠాలు సొమ్ము చేసుకుంటున్నారు. గంజాయి అక్రమ తరలింపులో కూడా యువకులను వినియోగిస్తున్నారు. వీరిలో ఎక్కువగా యువత ఉండటం విశేషం! పక్కా సమాచారంతో పోలీసులు ఎప్పటికప్పుడు ఎక్కడి కక్కడ అ తనిఖీలు చేస్తూనే ఉన్నారు.ఈ తనిఖీలలో కొందరు రెడ్ హ్యాండెడ్ గా పోలీసులకు పట్టు బడు తూనే ఉన్నారు. గంజాయి అక్రమ తరలింపు కేసులలో కొందరిని అరెస్టు చేస్తున్నారు.కొందరిని పట్టుకోవడం లో పోలీసులు చేతులెత్తేస్తున్నారు. విశాఖ కమిషనరేట్ పరిధిలో ఉన్న అన్ని స్టేషన్ పరిధి లో 10 నుండి 20 మంది గంజాయి ముద్దాయిలు దొరక్క పెండింగ్ చూపిస్తున్నారు!!ఎన్ని కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్న ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయిని అక్రమంగా తరలిస్తూనే ఉన్నారు.100 రోజుల్లో గంజాయి నిర్మూలన అనే నినాదం ఇప్పుడు గాలికి వదిలేశారు ప్రభుత్వ పెద్దలు. (తరువాయి 7వ పేజీలో)



# 'స్వచ్ఛత' దూరం

- నగరంలో ఎక్కడకక్కడే పేరుకుపోతున్న చెత్త
- స్వచ్ఛసర్వేక్షణ్ ప్రచారార్భాటానికి రూ.కోట్లు ఖర్చు
- పూర్తి స్థాయి కమిషనర్ లేక పారిశుధ్య నిర్వహణపై పర్యవేక్షణ కరువు
- క్షేత్ర స్థాయిలో పట్టించుకోని అధికారులు, సిబ్బంది
- పరిస్థితి ఇలాగే ఉంటే వచ్చే దఫా స్వచ్ఛతలో పడిపోవడం ఖాయం

(మేజర్ న్యూస్, విశాఖ బ్యూరో)



జీవీఎంసీ స్వచ్ఛతకు దూరమవుతోంది. పూర్తి స్థాయి కమిషనర్ లేకపోవడంతో శాపంగా పరిణమించింది. పరిస్థితి ఇలాగే కొనసాగితే.. వచ్చే దఫా స్వచ్ఛ సర్వేక్షణ్‌లో లక్ష్యానికి దూరం కానుంది. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే.. అందరిలో అదే భావన కలుగుతోంది. నగరం చెత్తమయంగా మారిపోయింది. వర్షాకాలం సమీపిస్తున్నప్పటికీ.. ఇప్పటికీ కాలువల్లో పూడిక తీత పనులు పూర్తి కాలేదు. ఎటు చూసినా చెత్త కుప్పలు.. కాలువల్లో పేరుకుపోయిన మురుగునీరే దర్శనమిస్తోంది. సామాజిక మాధ్యమాల్లో రూ.కోట్ల ప్రచార ఆర్భాటమే తప్ప.. పరిశుభ్రతపై జీవీఎంసీ అధికారులు దృష్టి సారించడం లేదు. పారిశుధ్య నిర్వహణ తమకే మాత్రం పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా.. స్వచ్ఛతలో నగరం నీరసిస్తున్నట్లు కనిపిస్తోంది.

### ఈ సారి కష్టమే..

దేశ వ్యాప్తంగా ఆయా నగరాలకు కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు ప్రదానం చేస్తోంది. నగరాల్లో ఉండే మౌలిక సదుపాయాలు, పారిశుధ్య నిర్వహణ, బహిరంగ మలమూత్ర విసర్జన నిర్మూలన, ఇళ్లల్లో మరుగుదొడ్ల నిర్మాణం, రవాణా వ్యవస్థ, చెత్తశుద్ధి నిర్వహణ మొదలైన అంశాలను పరిగణనలోకి తీసుకొని ఈ అవార్డులకు నగరాల్ని ఎంపిక చేస్తోంది. 2018-2019లో 23వ స్థానానికి దిగజారి ఉన్న నగరాన్ని 2019-20 నుంచి (తరువాయి 2వ పేజీలో)

## యోగాడే రికార్డు కోసం ప్రపంచమంతా

# విశాఖవైపు చూస్తోంది!



- రాజకీయాలకు అతీతంగా ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలి
- రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్

**విశాఖపట్నం, జూన్ 10, మేజర్ న్యూస్:** విశాఖపట్నంలో అంత ర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమం అత్యంత కీలకమైంది, ఆరోజున మనం సాధించబోయే రికార్డు కోసం ప్రపంచమంతా విశాఖ మహానగరం (తరువాయి 2వ పేజీలో)

## ఎలక్ట్రిక్ లోకోమోటివ్స్ అందాల పోటీలో

# విశాఖకు రెండో స్థానం



**విశాఖపట్నం, జూన్ 10, మేజర్‌న్యూస్ :** ఇటీవల బనారస్ లోకోమోటివ్ వర్క్సులో జరిగిన ప్రతిష్టాత్మకమైన "ఎలక్ట్రిక్ లోకోమోటివ్స్ కోసం అందాల పోటీ"లో విశాఖపట్నంలోని ఎలక్ట్రికల్ లోకో షెడ్ రెండవ స్థానాన్ని సాధించింది. ఈ విజయం ద్వారా అద్భుతమైన ఘనతను సాధించిందని వాల్తేరు రైల్వే అధికారులు మంగళవారం కొనియాడారు. ఈ పోటీలో భారతదేశంలోని వివిధ జోనల్ రైల్వేల నుండి పదమూడు లోకోమోటివ్‌లు పాల్గొన్నాయి. వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా, సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ బి. షణ్ముఖ రావు మార్గదర్శకత్వంలో ఈఎల్ఎస్ విశాఖ (తరువాయి 2వ పేజీలో)

# పల్లాను పరామర్శించిన లోకేష్



**విశాఖపట్నం జూన్ 10, మేజర్ న్యూస్:** టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనువాసరావు తండ్రి, మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం మృతి చెందిన విషయం విధితమే. మంగళవారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ పల్లా కుటుంబ సభ్యులను వారి స్వగృహంలో పరామర్శించారు. అంతకు ముందు మంత్రి లోకేష్ పల్లా సింహాచలం చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

# 'స్వచ్ఛత' దూరం



(మొదటి పేజీ తరువాయి)

పైపైకి తీసుకొచ్చారు. 2020, 2021లో 9వ స్థానంలో ఉండగా.. 2022, 2023లో 4కు ఎగబాకింది. దేశంలోనే టాప్%-%5 నగరాల సరసన చేరింది. 2024కు సంబంధించి జనవరిలోనే ప్రకటించాల్సి ఉన్నప్పటికీ.. ఇప్పటి వరకు అది జరగలేదు. 2025 సచ్ఛత సర్వేకు సమయం సమీపిస్తోంది. ఈసారి మాత్రం ప్రస్తుత పరిస్థితులు చూస్తే.. టాప్%-%10లో కూడా కష్టంగా కనిపిస్తోంది.

### అస్తవ్యస్తంగా పారిశుధ్య నిర్వహణ

జీవీఎంసీ 695 చదరపు కిలోమీటర్లలో విస్తరించి ఉంది. 22.50 లక్షల మంది జనాభా నివసిస్తున్నారు. రోజూ 1200 మెట్రిక్ టన్నుల వరకు చెత్త ఉత్పన్నమవుతున్నట్లు అంచనా. వివిధ విభాగాల నుంచి 5,838 పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారు. అయితే గత ఐదు నెలలుగా జీవీఎంసీ కమిషనర్ లేకపోవడం.. వార్డుల్లో ఆకస్మిక తనిఖీలు, పర్యవేక్షణ లేకుండా పోయింది. ఇంచార్జ్ కమిషనర్‌గా ఉన్న జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ జిల్లా వ్యవహారాల్లో బిజీగా ఉంటున్నారు. జీవీఎంసీపై దృష్టి పెట్టలేకపోతున్నారు. క్షేత్ర స్థాయిలో పరిస్థితులను ఇతర అధికారులెవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో నగరంలో ఎటు చూసినా.. పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా కనిపిస్తోంది. ప్రతి రోజూ ఇంటింటికీ వెళ్లి చెత్తని సేకరించడంతో పాటు.. డంపర్ బిన్లలోని చెత్తని కూడా తరలించాలి. అయితే.. ప్రధాన జంక్షన్లు మినహా.. మిగిలిన ప్రాంతాలవైపు కనీసం దృష్టి సారించడం లేదు. కాల్వల్లో పేరుకుపోయిన చెత్తని తీయడం లేదు. దీంతో మహా విశాఖ నగరంలో ఎటు చూసినా.. చెత్త కుప్పలే సాక్షాత్కరిస్తున్నాయి.

### ప్రచారంపైనే దృష్టి

నగరాన్ని పరిశుభ్రంగా ఉంచండి.. అంటూ సామాజిక మాధ్యమాల్లో మాత్రం జీవీఎంసీ అధికారులు ఊదరగొడుతున్నారు. ప్రజల వరకూ పరిశుభ్రత పాటిస్తున్నా.. జీవీఎంసీ మాత్రం.. తమకేం పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, వాట్సాప్‌లలో ప్రచారం కోసం రూ.కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఈ తరహా యాడ్స్, కరపత్రాలు, వీడియోల తయారీ.. మొదలైన కాంట్రాక్టుని స్వచ్ఛ సర్వేక్షణ్ మొదలైనప్పటి నుంచి రెండు సంస్థలకే అప్పగిస్తున్నారు. దీని వెనుక ఓ ఉన్నతాధికారితో పాటు జూనియర్ అసిస్టెంట్ హస్తం ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తమకు లాభాలు తీసుకొస్తున్న సంస్థలకు ప్రచారాల వ్యవహారాలు అప్పగించి.. పబ్బం గడిపేసుకుంటున్నారు తప్ప.. క్షేత్రస్థాయిలో స్వచ్ఛ సర్వేక్షణ్ కోసం ఏ విధంగా కృషి చేస్తున్నామన్న కనీస చిత్తశుద్ధి అధికారుల్లో కనిపించడం లేదు. దీంతో.. గత నెల రోజులుగా పారిశుధ్య నిర్వహణ ఎక్కడా సక్రమంగా కనిపించం లేదు.

### 'క్లాప్' కొట్టడం లేదా.?

క్లీన్ ఆంధ్రప్రదేశ్ పేరుతో సుమారు 600 క్లాప్ వాహనాల్ని చెత్త తరలింపునకు వినియోగిస్తున్నారు. ఇటీవల కాలంలో వీటి పనితీరుపై విమర్శలు వినిపిస్తున్నాయి. చాలా ప్రాంతాలకు క్లాప్ వాహనాలు ప్రతి రోజూ రావడం లేదని ఆరోపణలు ఉన్నాయి. 100 శాతం డోర్ టు డోర్ కలెక్షన్ జరగడం లేనట్లు తెలుస్తోంది. తడి పొడి చెత్త వేరు చేయడంలోనూ వెనుకపడిపోయింది. కొన్ని ప్రాంతాల్లో.. ఇళ్ల నుంచి కానీ.. దుకాణాల నుంచి తడి పొడి చెత్త వేరుగా ఇస్తున్నా.. క్లాప్ సిబ్బంది రెండు కలిపేసి వాహనంలో పడేస్తున్నారు. దీంతో.. స్వచ్ఛ సర్వేక్షణ్‌కు తూట్లు పొడుస్తున్నారు. ఇలా.. ప్రతి అంశంలోనూ నగరం స్వచ్ఛతకు రోజు రోజుకూ దూరమైపోతోంది. ఇప్పటికైనా అధికారులు పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. వర్షాలు పడేలోగా కాలువల్లో పూడికతీత పనులు పూర్తి చేయాలని, లేనిపక్షంలో ఏ చిన్న పాటి వర్షం పడినా రహదారులు జలమయమయ్యే పరిస్థితులు తలెత్తుతాయని ఆందోళన చెందుతున్నారు..

(మొదటి పేజీ తరువాయి)

# విశాఖవైపు చూస్తోంది!

వైపు చూస్తోంది, ప్రధాని మోడీజీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులకు విజ్ఞప్తిచేశారు. ఆంధ్రా యూనివర్సిటీలోని సాగరిక కన్వెన్షన్ హాలులో ఈనెల 21న యోగా డే నిర్వహణ ఏర్పాట్లపై ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.... ఒకే ప్రాంతంలో 5లక్షలమందితో నిర్వహించే ఈ ఈవెంట్ ప్రపంచంలోనే అతిపెద్దదిగా చరిత్ర సృష్టించబోతోంది, ప్రధాని మోడీజీ హాజరు కాబోతున్నారు, అధికారులంతా పట్టుదల, క్రమశిక్షణ, కమిట్ మెంట్ తో పకడ్బందీగా కార్యక్రమాన్ని నిర్వహించాలి. ఇది రాష్ట్రప్రజలందరి కార్యక్రమం, రాజకీయాలకు అతీతంగా అన్ని రాజకీయపక్షాలు భాగస్వాములు కావాలి. యోగావల్ల ప్రజల మానసిక, శారీరక ఆరోగ్యం బాగుంటుందని ప్రధాని చెబుతున్నారు. దీనిపై ప్రసార మాధ్యమాల్లో విస్తృత ప్రచారం కల్పించాలి. ఈనెల 21న ఆర్ కె బీచ్ నుంచి భీమిలి వరకు 26 కి.మీ.ల పొడవున 247 కంపార్ట్ మెంట్లలో నిర్వహించే ఈ కార్యక్రమానికి వచ్చే ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలి. ఆరోజు ఉదయం 6.30గంటలకు ప్రధాని ఆర్ కె బీచ్ ఖాళీమాత ఆలయం వద్ద ప్రధాన ప్రాంగణానికి చేరుకుంటారు. అంతకు గంటముందే ప్రజలంతా ఆయా కంపార్ట్ మెంట్లకు చేరేలా రవాణా సౌకర్యం కల్పించండి. సుదూర ప్రాంతాల్లో నిలిపివేసి ఇబ్బందులకు గురిచేయొద్దు. 600 మీటర్లకు మించి ప్రజలను నడిపించకుండా వాహనాలను వదలాలి. ప్రజలను ఇళ్లవద్ద నుంచి ప్రాంగణానికి చేరేదగ్గర నుంచి తిరిగి వారు ఇంటికి చేరేవరకు బాధ్యత తీసుకోవాలి. 19,20,21 తేదీలు కీలకం, అధికారులంతా ప్రణాళికాబద్ధంగా, కలసికట్టుగా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మంత్రి నారా లోకేష్ అధికార యంత్రాంగాన్ని కోరారు. సమావేశానికి ముందు ఎయు గ్రౌండ్స్ లో నిర్వసిస్తున్న యోగా శిక్షణను మంత్రి లోకేష్ తిలకించారు.

### ప్రతి కంపార్ట్ మెంట్ కు ఒక గెజిటెడ్ అధికారి!

విశాఖలో నిర్వహించే 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవానికి రాష్ట్రస్థాయి నోడల్ ఆఫీసర్ గా నియమితులైన ఎంటి కృష్ణబాబు మాట్లాడుతూ... యోగాడే నిర్వహించే 247 కంపార్ట్ మెంట్లలో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రతి కంపార్ట్ మెంట్ కు ఒక గెజిటెడ్ అధికారికి బాధ్యతలు అప్పగించాం, కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలంతా ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. క్యుఆర్ కోడ్ ద్వారా వారిని నిర్ణీత కంపార్ట్ మెంట్లలోకి అనుమతిస్తాం. సుదూర ప్రాంతాల నుంచి వచ్చేవారిని రాత్రి 2గంటలనుంచే అనుమతించేలా చర్యలు చేపట్టాం. జనాన్ని తీసుకొచ్చే వాహనాలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా క్రమబద్ధీకరించేందుకు వీలుగా కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసి, 1200 కెమెరాలను అమర్చాం. ఆర్ కె బీచ్ నుంచి భీమిలివరకు 30 ప్రధాన లొకేషన్లతోపాటు మరో 18అదనపు లొకేషన్లలో కూడా ఏర్పాట్లు చేశాం. కార్యక్రమ నిర్వహణ కోసం 2వేలమంది యోగా ఇన్ స్ట్రక్టర్లకు బాధ్యతలు అప్పగించాం. వారందరినీ ముందురోజు రాత్రే ఎయు గ్రౌండ్స్ కి రప్పిస్తాం. ముందుజాగ్రత్త చర్యగా 116 అంబులెన్స్ లను సిద్ధం చేశాం. హాజరయ్యే వారందరికీ మ్యాట్స్, టీషర్ట్స్ ఆయా కంపార్ట్ మెంట్ల వద్దే అందించేలా ఏర్పాట్లు చేశాం. 1400మంది బయో టాయ్ లెట్లను అందుబాటులో ఉంచుతాం. విశాఖతోపాటు పరిసర జిల్లాల నుంచి వచ్చే ప్రజల కోసం 3,500 ఆర్టీసి బస్సులు, 8వేల ప్రైవేటు, స్కూలు బస్సులను సిద్ధంచేశాం. ప్రజలను సురక్షితంగా రప్పించే తిరిగే తీసుకెళ్లేలా సెక్రటేరియట్ ఉద్యోగులకు బాధ్యతలు అప్పగించామని కృష్ణబాబు తెలిపారు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, జిల్లా ఇన్చార్జి మంత్రి డోలా బాలవీరాంజనేయుస్వామి, రాష్ట్రమంత్రులు వంగలపూడి అనిత, అనగాని సత్యప్రసద్, గుమ్మడి సంధ్యారాణి, కలెక్టర్ హరీంద్రప్రసాద్, రాష్ట్ర, జిల్లాస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# విశాఖకు రెండో స్థానం

బృందం డబ్ల్యుఏపీ 7 లోకోమోటివ్ 37419లో వినూత్నమైన, లోకో సిబ్బందికి అనుకూలమైన ఆధునిక మార్పులను చేపట్టింది. ఈ అప్‌గ్రేడ్‌లు సుదీర్ఘ పని గంటలలో లోకోమోటివ్ సిబ్బందికి సౌకర్యాన్ని పెంచడానికి మరియు అలసటను తగ్గించడానికి రైల్వే బోర్డు ఆదేశానికి అనుగుణంగా ఉన్నాయి. క్యాబ్ వాతావరణం, శబ్ద ఐసోలేషన్, మెరుగైన ఏసీ మరియు థర్మల్ ఇన్సులేషన్, నీటి రహిత మూత్రశాలలు, మెరుగైన సీటింగ్, అప్‌గ్రేడ్ చేసిన ఫ్లోరింగ్, సులభమైన సిగ్నల్ మార్పిడి, సామాను నిల్వ, రాబోయే జాగ్రత్త హెచ్చరిక వ్యవస్థలు, మెరుగైన లుకౌట్ గ్లాస్ క్లీనింగ్ మెకానిజం, సింగిల్-కీ ఆపరేషన్, మెరుగైన స్విచ్ యాక్సెస్ కోసం డెస్క్ మార్పులు, సన్ వైజర్ మెరుగుదలలు మరియు డ్రైవర్ సలహా లక్షణాలతో పాటు క్రూ వాయిస్ మరియు వీడియో రికార్డింగ్ సిస్టమ్ పరిచయం వంటి అధునాతన వసతులున్నాయి. ఈ నూతన లోకోలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగించి అప్‌గ్రేడ్‌లను విజయవంతంగా అమలు చేశారు. గుర్తించదగిన మెరుగుదలలలో రెట్రోఫిటెడ్ క్రూ డెస్క్, మెరుగైన క్యాబ్ ఏసీ డక్టింగ్, వెంటిలేటెడ్ మరియు మెరుగైన సీట్లు, మోటారు-ఆపరేటెడ్ సైడ్ విండో షట్టర్లు, జాగ్రత్త ఆర్డర్ డిస్ప్లే, రియర్-వ్యూ కెమెరా, రేడియం స్టిక్కర్లతో యాంటీ-స్లిప్ ఫ్లోరింగ్, డ్రైవర్ టూల్ బాక్స్ మరియు సర్దుబాటు చేయగల క్యాబ్ స్పాట్‌లైట్‌లు ఉన్నాయి. ఈ సందర్భంగా వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా మాట్లాడుతూ "ఈ విజయం సిబ్బంది సంక్షేమం, కార్యాచరణ నైపుణ్యం పట్ల మా అచంచల నిబద్ధతను ప్రతిబింబిస్తుందన్నారు. ఉద్యోగుల విజయ ప్రయత్నాలకు మొత్తం బృందాన్ని అభినందిస్తున్నానని, భవిష్యత్ విజయాల కోసం ఈ స్ఫూర్తిని కొనసాగించాలని వారిని ప్రోత్సహిస్తున్నానని అభినందించారు.

# డ్వాక్రా సభ్యులు యోగాంధ్రలో పాల్గొనాలి: తేజ్ భరత్

**విశాఖపట్నం జూన్ 10, మేజర్ న్యూస్:** యోగాంధ్ర కార్యక్రమాల జయప్రదమే ధ్యేయంగా విశాఖ వేదికగా ఈనెల 21న నిర్వహిస్తున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాల్లో డ్వాక్రా సభ్యులు, వారి కుటుంబ సభ్యులు, యోగా కార్యక్రమంలో భాగమై విజయవంతం చేయుటకు కృషి చేయాలని మెప్మా మిషన్ డైరెక్టర్ ఎన్. తేజ్ భరత్ తెలిపారు.మంగళవారం ఆయన గురజాడ కళాక్షేత్రం జీవీఎంసీ ప్రాజెక్టు డైరెక్టర్ సత్యవేణి ఆధ్వర్యం లో ఎస్.హెచ్.జి సభ్యులు, ఎస్ఎల్ఎఫ్ రిసోర్స్ పర్సన్స్, కమ్యూనిటి ఆర్గనైజర్లు, సోషల్ వర్కర్లు, అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్లు మరియు ఇతర జిల్లా స్పెషల్ ఆఫీసర్లతో గురజాడ కళాక్షేత్రంలో సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు.. ఈ సమావేశంలో మెప్మా మిషన్ డైరెక్టర్ తేజ్ భరత్ మాట్లాడుతూ,ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఇతర ప్రజా ప్రతినిధులువిశాఖపట్నం ప్రజలు అందరూ ఈనెల 21న విశాఖపట్నం చరిత్రలో మరచిపోలేని రోజుగా ప్రణాళిక రూపొందించారని, మన భారతదేశంలో మానసిక శారీరక, ఆరోగ్యాన్ని కాపాడుటకు మన పూర్వీకుల నుండి వారసత్వంగా వస్తున్న యోగా ప్రక్రియను ప్రపంచానికి పరిచయం చేసి 10 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 11 వ అంతర్జాతీయ యోగా దినోత్సవం మన విశాఖపట్నంలో నిర్వహించడం మనందరికీ గర్వకారణమని తెలిపారన్నారు. ఇంతటి ప్రతిష్టాత్మక కార్యక్రమం చిరకాలం గుర్తుండేలా చేయుటకు గౌరవ ముఖ్యమంత్రి గారు ఒకే చోట 5 లక్షల మంది ప్రజలు ఒకేచోట కూర్చుని యోగా దినోత్సవం నిర్వహించి గిన్నిస్ మరియు ప్రపంచ రికార్డులను నెలకొల్పి ప్రపంచానికి మన ఆంధ్రప్రదేశ్ శక్తిని , విశాఖ కీర్తిని చాటాలని తెలిపారన్నారు. దీనిలో భాగంగా మన స్వయం సహాయక సంఘ సభ్యులు మరియు వారి కుటుంబ సభ్యులు అందరూ ఈ యోగా కార్యక్రమంలో భాగమై విజయవంతం




చేయుటకు కృషి చేయలన్నారన్నారు. అలాగే జీవీఎంసీ సిబ్బంది, మెప్మా సిబ్బంది, స్పెషల్ ఆఫీసర్లు, ఎస్ఎల్ఎఫ్-ఆర్పీలు, సంఘ నాయకులు, హెచ్ఆర్పీలు అందరూ చక్కటి సమన్వయంతో ప్రజలందరినీ వేదిక వద్దకు సమీకరించి వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ, పోలీస్, మునిసిపల్ సిబ్బంది సహకారంతో మన విశాఖ ప్రజలను ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో భాగం చేయాలని మెప్మా డైరెక్టర్ తెలిపారని యు సి డి ప్రాజెక్ట్ డైరెక్టర్ సత్యవేణి తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన సూక్ష్మ ప్రణాళికను పథక సంచాలకులు మెప్మ డైరెక్టర్ కు వివరించడమైందన్నారు. 11 వ అంతర్జాతీయ యోగా దినోత్సవం 2025 కార్యక్రమమును కేటాయించిన లక్ష్యం 3,59,600 మంది హాజరు అయ్యే విధముగా రిసోర్స్ పర్సన్ మరియు సిబ్బంది వారీగా సూక్ష్మ ప్రణాళికా మరియ యోగా వేదికకు చేరుకొనేందుకు రూట్ మ్యాప్ ప్రణాళికను అమలు చేయుటకు ఈ సమీక్ష సమావేశం నిర్వహించడమైనదన్నారు.




## వారం రోజుల్లోగా ఉపాధి బకాయిల చెల్లింపు

**– ద్వామా పిడి ఆర్. పూర్ణిమా దేవి**
**– పలు ప్రాంతాల్లో ఉపాధి పనులు పరిశీలన**



**దేవరాపల్లి, జూన్ 10, మేజర్‌న్యూస్:** వారం రోజుల్లోగా ఉపాధి బకాయిలు చెల్లింపు జరుగుతుందని జిల్లా నీటి యాజమాన్య సంస్థ (ద్వామా) పథక సంచాలకులు ఆర్. పూర్ణిమాదేవి పేర్కొన్నారు. ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు రూ.243 కోట్లు బకాయి ఉందన్నారు. దీనిలో ఉపాధి కూలీలకు వేతనాల రూపంలో రూ.98 కోట్లు, మెటీరియల్ కాంపినెంట్ కింద రూ. 145 కోటు చెల్లించాల్సి ఉందన్నారు. మండలంలోని మారేపల్లి, ఎస్. చేనులపాలెం సమీపంలో జరిగిన ఉపాది పనుల్ని ఆమె మంగళవారం పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. వర్షా కాంల ప్రారంభం కాక ముందే ఉపాధి పని దినాల లక్ష్యాన్ని చేరుకోడానికి చర్యలు తీసుకున్నామన్నారు. ఈ ఏడాది 124 లక్షల పనిదినాలు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 33 లక్షల పనిదినాలు పూర్తి చేశామన్నారు. రుతుపవనాలు ప్రారంభమవుతున్న దృష్ట్యా జిల్లాలోని 24 మండలాల్లో రెండు వేల ఎకరాల్లో రైతులు కోరిన 25 రకాలైన ఉద్యాన పంటల్ని సాగు చేసుందుకు ప్రోత్సహిస్తున్నామన్నారు. గొయ్యి తవివ, మొక్క వేసిన దగ్గర నుంచి మొక్క ఎదిగేంత వరకు మూడేళ్ల పాటు ప్రభుత్వం ఆర్థిక తోడ్పాటు అందిస్తుందన్నారు. ఇప్పటి వరకు 1200 ఎకరాలను గుర్తించగా, మిగతా భూమిని జూలై నెలాఖరులోగా గుర్తిస్తామన్నారు. ఒక్కొక్క పంట సాగుకి సుమారు రూ.56 వేల నుంచి రూ 150 లక్షల వరకు అయ్యే ఖర్చుని మూడేళ్ల పాటు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. భూ గర్భ జలాల అభివృద్ధి, బాసారం పెరుగుదల కోసం 7 వేల ఆరు వందల పంట నీటి గుంతలు తవ్వాలని లక్ష్యం కాగా ఇప్పటి వరకు 5 వేల 200 తవ్వడానికి అనుమతి ఇచ్చామన్నారు. తవ్విన గుంతల గట్లపై 16 మొక్కలు సహా కూరగాయల్ని పండించాలని తద్వారా పంట గుంత తవ్విన భూమి వృధా కాకుండా రైతుకి ఆదాయం వస్తుందని జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) పథక సంచాలకులు ఆర్ పూర్ణిమాదేవి స్పష్టం చేశారు. ఆమె వెంట ఏపీడీ కె.శ్రీనువాసరావు, ఏపీఓ రుక్మిణీదేవి, ఈసీ కె. వెంకటేష్ తదితరులున్నారు.

## ముగిసిన వేసవి శిక్షణ కార్యక్రమాలు



**దేవరాపల్లి, జూన్ 10, మేజర్‌న్యూస్:** కౌమర బాలికలకు పూర్తిస్థాయి అవగాహన కల్పించేందుకు చేపట్టిన కిషోరి వికాసం శిక్షణ కార్యక్రమాలు సోమవారంతో ముగిశాయి. కె. కోటపాడు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని దేవరాపల్లి మండలంలో కిషోరి వికాసం వ శిక్షణ తరగతులు గత కొంత కాలంగా నిర్వహించారు. కౌమర బాలికలు, తల్లిదం డ్రులకు అనేక అంశాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పిఓ పి.మంగతా యారు , అంగన్వాడీ సూపర్వైజర్లు రాములమ్మ, ఆదిలక్ష్మి, కళ్యాణి, మహిళా సంరక్షణ అధికారి సంధ్యారాణి, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# లారస్ కంపెనీ లో యాజమాన్యంతో యోగాంధ్ర కార్యక్రమం



**అచ్యుతాపురం, జూన్ 10, మేజర్‌న్యూస్:** లారస్ కంపెనీ అడ్మిన్ బిల్డింగ్ లో కంపెనీలు యాజమాన్యంతో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆధ్యాత్మిక కేంద్రాల్లో నిర్వహిస్తున్న యోగ సాధన కార్యక్రమాన్ని పాల్గొన్న అనకాపల్లి జిల్లా కలెక్టర్ గారు ఎలమంచిలి నియోజవర్గం ఎమ్మెల్యే.సుందరపు విజయ్ కుమార్ మాట్లాడుతూ ఈనెల 21వ తేదీన అచ్యుతాపురం ఎస్ ఇ జెడ్ లో నిర్వహించే జిల్లాస్థాయి మెగా యోగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, కార్మికులు ఎంప్లాయిస్ పాల్గొనాలని తెలిపారు. జూన్ 21వ తేదీన విశాఖపట్నంలో నిర్వహించే ప్రపంచ యోగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శాసనసభ్యులు పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్ర.ముఖ్యమంత్రి, నారా చంద్రబాబు నాయుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ .యితర మంత్రులు ఎమ్మెల్యేలు నాయకులు పాల్గొంటున్న ఈ కార్యక్రమానికి జిల్లావ్యాప్తంగా ప్రజలందరూ స్వచ్ఛందంగా పాల్గొనాలని తెలిపారు. జిల్లా నుండి కనీసం 60వేల మంది హాజరు కావాలన్నారు. జిల్లాకు సంబంధించిన ప్రజలకు రూట్ మ్యాప్ , కేటాయించిన స్థలం వివరాలు తెలియజేయడం జరుగుతుందని, ప్రజలందరూ అక్కడికి స్వచ్ఛందంగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలియజేశారు.



## సెజు రెండో విడత సహకరించిన భూముల్లో నూతన కంపెనీకి శంకుస్థాపన



**అచ్యుతాపురం, జూన్ 10, మేజర్‌న్యూస్:** అనకాపల్లి జిల్లా.ఎలమంచిలి నియోజకవర్గంలో రాంబిల్లి కృష్ణం పాలెం గ్రామంలో సెజ్ రెండో విడతగా సేకరించిన భూముల్లో 105 ఎకరాలు యాక్షన్ తేసా కంపెనీకి కేటాయించిన స్థలంలో ఈరోజు జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, మరియు ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. 200 కోట్లు రూపాయల పెట్టుబడితో నిర్మిస్తున్న ఈ కంపెనీలో ప్రత్యక్షంగా పరోక్షంగా 3,000 మంది నుంచి 4,000 మంది వరకు ఉపాధి కలుగుతుంది. సకాలంలో నిర్మాణం పూర్తి చేసి సేజ్ నిర్వాసితులకు ఉపాధి కల్పిస్తామని కంపెనీ ప్రతినిధులు ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ యాజమాన్యం అధికారులు జనసేన టిడిపి బిజెపి నాయకులు తదిరులు పాల్గొన్నారు.

## ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపివోగా మంగతాయారు



**రావికమతం, జూన్ 10, మెజర్‌న్యూస్:** రావికమతం ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ గా బి మంగతాయారు మంగళవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. కే కోటపాడు ప్రాజెక్టు నుంచి ఆమె బదిలీపై ఇక్కడికి వచ్చారు. గత ఆరు నెలలుగా సిడిపిఓ పోస్టు ఖాళీగా ఉంది. ఇక్కడ పనిచేస్తున్న సిడిపిఓ ఉషారాణి పదవి విరమణ గావించడంతో పోస్ట్ ఖాళీగా ఉంది ఈ స్థానంలో మంగతాయారు జాయిన్ అయ్యారు. ప్రాజెక్టు పరిధిలో చోడవరం రావికమతం బుచ్చయ్యపేట రోలుగుంట, మండలంలో ఉన్న అంగన్వాడి కేంద్రాల్లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ అమలు కు, గర్భిణీలు బాలింతలు కిషోర్ బాలికలకు బాల బాలికలకు ప్రభుత్వం మంజూరు చేస్తున్న పోషక పదార్థాలు నూరు శాతం అందేందుకు కృషి చేస్తానని ఆమె తెలిపారు.

## కృష్ణంరాజు కాలువ జంగిల్ క్లీనింగ్



**మునగపాక, జూన్ 10, మేజర్‌న్యూస్:** మండల కేంద్రమైన మునగపాక కృష్ణంరాజు కాలువ గత 15 సంవత్సరాల నుంచి పూడికతీత తీయక , నీరు పారక రైతులు అనేక ఇబ్బందులు కష్టాలు పడ్డారు, కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే స్థానిక శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ నిధులు మంజూరు చేయించి కృష్ణంరాజు కాలువను జంగిల్ క్లీనింగ్ కాలువ సంగం సభ్యులతో దగ్గరుండి క్లీనింగ్ చేస్తున్నారు, కాలవ సంఘం అధ్యక్షుడు పెంటకోట రాము, వైస్ చైర్మన్ పెంట కోట శ్రీరామ్ మూర్తి, మాజీ కాలవ సంఘం అధ్యక్షులు భీమిశెట్టి గణేష్ నాయుడు, డైరెక్టర్స్ వేగి పరదేశి నాయుడు, పచ్చికూర నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా సమ్మెదలో పోతురాజు తండ్రి తీర్థ మహోత్సవం



**దేవరాపల్లి, జూన్ 10, మేజర్‌న్యూస్:** చింతలపూడి పంచాయతీ సమ్మెద గ్రామంలో శ్రీ పోతురాజు తండ్రి అమ్మవారి తీర్థ మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఉదయం 5 గంటల నుంచి అమ్మవారికి ధూప దీప నైవేద్యాలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రైవాడ జలాశయం చైర్మన్ పోతల పాత్రునాయుడు, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కర రావు, మండల టిడిపి అధ్యక్ష కార్యదర్శులు పెద్దాడ వెంకటరమణ, దొగ్గ దేవుడు నాయుడు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసుకున్నారు. ముందుగా వీరిని గ్రామస్తులు స్వాగతం పలుకుతూ సాలువలతో సత్కరించారు. ఈ సందర్భంగా గిరిజన ప్రాంతానికి చెందిన టిడిపి నాయకులు మాట్లాడుతూ గిరిజన గ్రామాల అభివృద్ధి కొరకు ఎంతో కృషి చేసిన కూటమి ప్రభుత్వానికి గిరిజన ప్రజల రుణపడి ఉంటారని అన్నారు. మీ ఆశీస్సులు ఎల్లవేళలా మా గిరిజన గ్రామా ప్రజలపై ఉండాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సాహు జగన్నాథం, దాసు రమణ, దొమ్మంగి చంద్రమౌళి, గుంట శంకర్రావు, దాయిరి శ్రీను, కొమ్ము వెంకటేష్, శెట్టి మంగరాజు, అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.

## పీయూసీ సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే బేబీనాయన



**బొబ్బిలి,జూన్ 10, మేజర్ న్యూస్:** తిరుపతిలో మంగళవారం ఏపిఎస్ పిడిసిఎల్ టూరిజమ్ మరియు శ్రీసిటీ పై పియుసి చైర్మన్ కూన రవికుమార్ అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం లో మొదటగా ఎమ్మెల్యేలు మరియు ఎమ్మెల్సీలు కలిసి కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకుని అనంతరం ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా కలెక్టర్,ఎమ్మెల్యే ఆర్.వీ.ఎస్.కే.కే.రంగారావు (బేబీ నాయన), ఎమ్మెల్యే గౌతు శిరీష తదితర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

## అమరావతి మహిళలపై అసభ్యకరంగా మాట్లాడిన వారిపై చర్యలు తీసుకోవాలి



**బొబ్బిలి జూన్ 10: మేజర్ న్యూస్:** సాక్షి చానల్లో కొమ్మినేని శ్రీనివాసరావు డిబేట్ లో కృష్ణంరాజు అనే జర్నలిస్టు అమరావతి మహిళల గురించి అవమానకరంగా చేసిన వ్యాఖ్యలను మహిళలు తీవ్రం గా ఖండించారు. వారిపై కూటమి ప్రభుత్వం తరుపున చట్టపరమైన చర్యలను తీసుకునేలా చూడాలని డిమాండ్ చేస్తూ బొబ్బిలి డీఎస్పీ శ్రీమతి భవ్యా రెడ్డి కి కంప్లైంట్ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా వేదిక మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## నగరపంచాయతీ మేనేజర్‌గా జయరాం

**నెల్లిమర్ల, జూన్ 10, మేజర్ న్యూస్:**



నగర పంచాయతీ మేనేజర్ గా తుమ్మి జయరాం బదిలీపై విచ్చేస్తున్నారు. ప్రస్తుతం ఆయన పాలకొండ మున్సిపాలిటీలో మేనేజర్ గా విధులు నిర్వహిస్తున్నారు. నెల్లిమర్ల నగర పంచాయతీ మేనేజర్ గా విధులు నిర్వహిస్తున్న నాగరాజుకు నర్సీపట్నం మున్సిపాలిటీకి బదిలీ అయ్యింది. జయరాం గతంలో నెల్లిమర్ల నగర పంచాయతీ మేనేజర్ గా, కమిషనర్ గా కొంతకాలం విధులు నిర్వహించారు.

## 13న మండల సర్వసభ్య సమావేశం: ఎంపీడీవో



**బాడంగి, జూన్ 10, మేజర్ న్యూస్:** బాడంగి మండల పరిషత్ కార్యా లయ ప్రాంగణంలో ఈ నెల 13వ తేదీ శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ భోగి గౌరీ ఆధ్వ ర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వ హించడం జరుగుతుందని ఎంపీడీవో ఎస్ రామకృష్ణ అన్నారు మంగళవారం ఓ సందర్భంలో ఆయన మాట్లాడుతూ ఈ సమావేశంలో మండల ప్రాదేశిక సంస్థల సభ్యులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ, గ్రామ సర్పంచులు తదితర స్థానిక నాయకులు పాల్గొని పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించనున్నారు అని మండల స్థాయిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల సమీక్షతో పాటు గ్రామీణ సమస్యలపై నిర్ణయాత్మక చర్చలు నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి తెలియజేశారు ఈసమావేశానికి సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాల్సిందిగా కోరారు




## కిషోరీ వికాసంపై అవగాహన కార్యక్రమం



**కొత్తవలస, జూన్ 10, మేజర్ న్యూస్:** మండలంలోని వియ్యంపేట ఐ. సి. డి. ఎస్. ప్రాజెక్ట్ పరిధిలో గల తుమ్మికాపల్లి లో మంగళవారం స్త్రీ శిశు సంక్షేమసిబ్బంది, వైద్య ఆరోగ్య సిబ్బంది,సచివాలయసిబ్బంది సంయుక్తంగా పంచాయతీ సర్పంచ్ విరోతి కొండలరావు అధ్యక్షతన బాలికల కి కిషోరీ వికాసం పై అవగాహనా కల్పించినట్లు ఐ. సి. డి. ఎస్. సూపెర్వైజర్ రమణమ్మ తెలిపారు. ముఖ్య అతిధి గా ఐ. సి. డి. ఎస్. పి. ఓ. ఆర్. ఉమాదేవి పాల్గొన్నారు. పి. ఓ. మాట్లాడుతూ కిషోరీ వికాసం కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మే 2 తేదీ నుండి జూన్ 10 తేదీ వరకు యుక్త వయస్సు బాలికల కి 12 అంశాలు పై బాలికలకి ఎదురయ్యే సమస్యలు పై అవగాహనా మరియు శిక్షణ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. బాలికల వ్యక్తిగత పరిశుభ్రత, బాల్య వివాహాలుతో కలిగే అనర్ధాలు పై అవగాహనా, సైబర్ మోసాలు, ఆన్లైన్ భద్రత, సమస్యలు, వృత్తి నైపుణ్యం, ఆత్మ రక్షణ, లింగ అసమానతలు, కౌమార దశలో ఐరన్ లోపం వల్ల రక్త హీనత ఎలా వస్తుంది, బాలలు హక్కులు, పొక్షో చట్టం, ఋతు క్రమ పరిశుభ్రతలు పై అవగాహనా కల్పించినట్లు తెలిపారు. సర్పంచ్ మాట్లాడుతూ ఆడపిల్లల్ని ఎదగనిద్దాం, ఆడపిల్లల్ని చదవనిద్దాం అని పిలుపునిచ్చారు. ఎమ్. ఎల్. హెచ్. పి. కామేశ్వరి మాట్లాడుతూ రక్త హీనత, టీనేజ్ ప్రగ్నన్సీలు, బాల్య వివాహాలు అరికట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఏ. సి. డి. పి. ఓ. బి. లక్ష్మి భాయ్, సూపర్ వైజర్ కె. రమణమ్మ,,పంచాయతీ సెక్రటరీ రాజ్ కుమార్,ఆప్తాలమిక్ఆఫీసర్ ఈశ్వరరావు,ఎమ్. ఎల్. హెచ్. పి. కామేశ్వరి,హెల్త్ అసిస్టెంట్ సత్యారావు, ఏ. ఎన్. ఎమ్. జ్యోతి, మహిళా పోలీస్ చిన్నమ్మలు, అంగన్వాడీ, ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు ప్రోత్సహిస్తే కఠిన చర్యలు



**రామభద్రపురం, జూన్ 10 (మేజర్ న్యూస్):** గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలు చేసినవారిపై, ప్రోత్సహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఐసీడీఎస్ సూపర్వైజర్ సూర్యకుమారి హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఆరవ అంగన్వాడీ కేంద్రంలో తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ బాల్య వివాహాలు చేయడం వల్ల కలిగే నష్టాలను విడియో చూపించి అవగాహన కల్పించారు. కిశోర వికాశం వేసవి కార్యక్రమంలో భాగంగా ఆరోగ్యం, పోషకాహారం అవగాహనా, సమతుల్య పోషకాహారం, పరిశుభ్రత, ఆరోగ్య పరీక్షలు, రక్తహీనత వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కిశోర బాలికలు కూడా పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎంఎస్కే సత్యవతి, అంగన్వాడీ టీచర్ జి. లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి లోకేష్‌తో గౌరీ నాయుడు మర్యాదపూర్వక భేటీ

### అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని వినతి



**లక్కవరపుకోట, జూన్ 10, మేజర్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్ విద్య మరియు ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ని కిత్తన్నపేట గ్రామానికి చెందిన యువ సాహితీవేత్త, రాచకొండ నరసింహ శర్మ సాహితీ సంస్థ వైస్ ప్రెసిడెంట్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిగ్రీ గెస్ట్ ఫ్యాకల్టీ అసోసియేషన్ లీడర్ డాక్టర్ కిలారి గౌరీ నాయుడు విశాఖ పట్టణంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న అతిథి అధ్యాపకుల సమస్యలపై లోకేష్ తో చర్చించారు. డిగ్రీ కళాశాలలో విద్యను బోధిస్తున్న అతిథి అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని గౌరీ నాయుడు నారా లోకేష్ ను కోరారు. రెగ్యులర్ అధ్యాపకులతో సమానంగా పనిచేస్తున్నప్పటికీ వేతనాలు విషయంలో అతిథి అధ్యాపకులు చాలా తక్కువ స్థాయిలో వేతనాలు పొందుతున్నారని తెలిపారు. గంటలు చొప్పున కాకుండా నెలవారిగా ప్రభుత్వం కన్సాలిడేటెడ్ జీతం ఇచ్చే విధంగా, రెగ్యులర్ అధ్యాపకుల బదిలీలు జరిగినప్పుడు పోస్ట్ ఖాళీగా ఉన్న డిగ్రీ కళాశాలకు అతిథి అధ్యాపకులను బదిలీ చేసేలా కూటమి ప్రభుత్వం తరపున సహకారాన్ని అందించాలని తెలియజేస్తూ గౌరినాయుడు వినతి పత్రం అందజేశారు. గత సంవత్సరం ఏప్రిల్ 22 శృంగవరపుకోట సిరికి రిసార్ట్ లో శృంగవరపుకోట నియోజకవర్గ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, టూరిజం డిపార్ట్మెంట్ డైరెక్టర్ ఇందుకూరి సుధారాణి సమక్షంలో అసోసియేషన్ నాయకులు కలిసినప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మీ సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తానని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా గౌరీ నాయుడు గుర్తు చేశారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్న అధ్యాపకుల సమస్యల పరిష్కారం కోసం తన వంతు సహకారాన్ని అందిస్తానని, విద్యాశాఖ అధికారులతో మాట్లాడుతానని హామీ ఇచ్చినట్లు గౌరీ నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ డాక్టర్ వేపాడ చిరంజీవి రావు, ఎంపీ శ్రీభరత్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ వీర బాలాంజనేయ స్వామి ,విశాఖ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్యే గణబాబు, గెస్ట్ ఫ్యాకల్టీ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఉచిత నృత్య శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం



**నెల్లిమర్ల, జూన్ 10, మేజర్ న్యూస్:** నెల్లిమర్ల మిమ్స్ సమీపంలోని శ్రీ వివేకానంద ధ్యాన మందిరంలో మంగళవారం విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం చేశారు. శ్రీ రామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో వేసవిలో ఇక్కడ నిర్వహించిన ఉచిత నృత్య శిక్షణకు హాజరైన వంద మంది చిన్నారులకు ఎంపీడీఓ రామకృష్ణ రాజు, సేవాసమితి కార్యదర్శి జగన్నాథరాజు సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు ఆటపాటలు కూడా అవసరమని చెప్పారు. ఉచిత శిక్షణ అందించిన సూర్యతేజ డాన్స్ అకాడమీ ప్రతినిధి సౌభాగ్యాలక్ష్మికి సమితి తరపున ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ శంకర్ జగన్నాథం, సేవాసమితి సహ కార్యదర్శి సారిపల్లి త్రినాథరావు పాల్గొన్నారు.




## బాలకృష్ణ అభిమానులు సేవా తత్పురుషులు

### - ఎమ్మెల్యే గొండు.శంకర్



**శ్రీకాకుళం, జూన్ 10, మేజర్‌న్యూస్:** బాలకృష్ణ అభిమానులు సేవా తత్పురుషులని ఎమ్మెల్యే గొండు.శంకర్ అన్నారు. స్థానిక విశాఖ కోలనీ టీడీపీ కార్యాలయంలో నందమూరి.బాలకృష్ణ జన్మదినం సందర్భంగా నిర్వహించిన జన్మదిన వేడుకల సేవా కార్యక్రమంలో సంచలనాత్మక ఎమ్మెల్యే గొండు. శంకర్ ముఖ్య అతిధిగా పాల్గొని కేక్ కట్ చేసిన అనంతరం మాట్లాడుతూ టీడీపీ వ్యవస్థాపకులు అన్న ఎన్టీఆర్ ముద్దు బిడ్డ, నటకిరీటి, పద్మభూషణ్ అవార్డు గ్రహీత, హిందూపురం హేట్రిక్ శాసన సభ్యులు, బసవతారకం హాస్పిటల్ కు కారకులు నందమూరి. బాలకృష్ణ జన్మదినవేడుకలు సేవా కార్యక్రమంతో చెయ్యటం బావోద్వేగంగా ఉందని, ఎన్టీఆర్ ఎం.ఎస్.ఎస్ టీం డేవిడ్ మాదారపు, తండ్రి మాదారపు. వెంకటేష్ అడుగుజాడల్లో నిలుస్తూ, వారి ఆధ్వర్యంలో టెక్కలి చెందిన ఆరునెలల చిన్నారికి అండగా నిలిచారని, చిన్నారి లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతుందని, ఎన్టీఆర్ ఎం.ఎస్.ఎస్ టీం సభ్యుల సహకారంతో ఆ చిన్నారికి 25 వేల రూపాయలను చిన్నారి తల్లితండ్రులకు నా చేతుల మీదుగా అందించటం మాటలకందని సంతోశాన్నిచ్చిందన్నారు. అన్న సీనియర్ ఎన్టీఆర్ అభిమానులు, బాలకృష్ణ, మోక్షజ్ఞ అభిమానులు, జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు , ఎన్టీఆర్ ఎం.ఎస్.ఎస్ టీం సభ్యులు నిరంతరం సేవా కార్యక్రమాలు కొనసాగించటం ఆనందదాయకమన్నారు. అనంతరం మాదారపు వెంకటేష్ మాట్లాడుతూ సంచలనాత్మక ఎమ్మెల్యే గొండు. శంకర్ అని, శ్రీకాకుళం చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచారని, ఊహకందని అత్యధిక ఓట్లతో గెలుపొంది, శ్రీకాకుళాన్ని అభివృద్ధి, ప్రగతిపథంలో నడిపిస్తున్న ఎమ్మెల్యే గొండు. శంకర్ అన్నారు. కార్యకర్తలకు, ప్రజలకు అందుబాటులో ఉంది, ప్రతీ సమస్యకు తత్వర పరిస్కారమే ధ్యేయంగా పనిచేస్తూ అందరి అభిమానాలు పొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అన్న ఎన్టీఆర్ అభిమానులు, బాలకృష్ణ అభిమానులు, ఎన్టీఆర్ ఎం.ఎస్.ఎస్ టీం సభ్యుల బృందం, కళ్యాణ్ రామ్, మోక్షజ్ఞ అభిమాన బృందం, టీడీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైభవంగా మర్రిపోలేరమ్మ ఉత్సవాలు

**మెలియాపుట్టి, జూన్ 10, మేజర్‌న్యూస్:** మెళియాపుట్టి మండల కేంద్రంలో శ్రీ మర్రి పోలేరమ్మ అమ్మ తల్లి ఉత్సవాలు మూడు రోజులు పాటు వైభవంగా నిర్వహించారు. మొదటి రోజు ఆదివారం నాడు అమ్మవారి ఆలయము నుండి మరి పోలేరమ్మ తల్లిని రాజా వీధిలోని గాంధీ ఇంటికి భాజా భజంత్రీలతో ఊరేగింపుగా తీసుకువచ్చారు. అంతకు ముందు మహిళలు పసుపు నీళ్ల తలపై పెట్టుకుని అమ్మవారి ఉపాలయాల వద్ద మురాటలు సమర్పించి చల్లదనం చేశారు. రాజా వీధి విడిది ఇంటి వద్ద మహిళలు భక్తి శ్రద్ధలతో కుంకుమ పూజలు చేశారు.మంగళవారం డప్పు వాయిద్యాలతో, ఆటపా టలు, వేషధారణలు, నృత్యాలతో అమ్మవారి ఘటాలను గ్రామ పుర వీధుల్లో ఊరేగించారు. విడిది ఇంటి నుండి శ్రీ మర్రి పోలేరమ్మ అమ్మవారి దేవాలయానికి యథాస్థానానికి ఊరేగింపుగా ఆలయ వద్దకు తీసుకువెళారు. మహిళలు ఘట్టాలతో పాటు, పసుపు నీళ్ల మురాటాలను సమర్పించారు. గ్రామంలోని ప్రజలు అందరూ ఆరోగ్యంగా సుఖసంతోషాలతో ఉండాలని, వర్షాలు బాగా పడి పంటలు చక్కగా పండాలని శ్రీమర్రిపోలేరమ్మ అమ్మ తల్లిని కోరుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఘటాలు ఊరేగింపు తో మూడు రోజులు పాటు నిర్వహించిన అమ్మవారి సంబరాలు మంగళవారం రాత్రి తో ముగిసాయి.అమ్మవారి సంబరాలు ఘనంగా నిర్వహించిన యువతకు,కమిటీ సభ్యులకు గ్రామస్తులు అభినందించారు. ఇదే స్ఫూర్తితో శ్రీ మర్రి పోలేరమ్మ అమ్మవారి పండుగలు నిర్వహించేందుకు సన్నాహాలు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# బాబు పాలనలో మహిళలకు భద్రత కరువు..

### మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణ దాస్

### వైఎస్ఆర్సిపి ఆధ్వర్యంలో అంబేద్కర్ జంక్షన్ వద్ద నిరసన

### శ్రీకాకుళంలో మహిళా విభాగం ఆధ్వర్యంలో మౌన ప్రదర్శన



**శ్రీకాకుళం, జూన్ 10, మేజర్‌న్యూస్:** రాష్ట్రంలో మహిళలపై నిరంతరంగా జరుగుతున్న దాడులు, అత్యాచారాలు, అఘాయిత్యాలపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ప్రశ్నిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ప్రతీకాత్మక మౌన ప్రదర్శన నిర్వహించింది.ఆర్ టి సి బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మహిళలు ప్లకార్డులు పట్టుకుని ఆందోళన వ్యక్తం చేశారు. పాలకులు పోలీసు వ్యవస్థను నియంత్రించడంలో విఫలమయ్యారని, బాధితులకు న్యాయం లభించకపోవడం బాధాకరమని పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ విమర్శించారు. మహిళలపై జరిగే నేరాల విషయంలో ప్రభుత్వం కనీస స్పందన చూపడం లేదని ఆయన ఆరోపించారు. "ఈ మౌన ప్రదర్శన ద్వారా మహిళల మనోవేదనను, ఆవేదనను పాలకుల దృష్టికి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నాం" అని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని అందజేసారు. కార్యక్రమంలో ఆమదాలవలస సమన్వయకర్త చింతాడ రవికుమార్, జిల్లా ఉప అధ్యక్షులు మెంటాడ పద్మావతి , ఎంపీపీ అంబటి నిర్మల శ్రీనివాస్, జిల్లా గ్రీవెన్స్ అధ్యక్షులు రౌతు శంకరరావు, జడ్పీటీసీ ప్రతినిధి ఎచ్చెర్ల శ్రీధర్ , మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్ , రాష్ట్ర మహిళా కార్యదర్శి టి. కామేశ్వరి , నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు మూకళ్ళ సుగుణ, మాజీ చైర్మన్ మూకళ్ళ తాత బాబు, ఎంపీపీ అంబటి శ్రీనివాస్, బొడ్డేపల్లి అజంతా,సుగుణ రెడ్డి,మహిళ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




# మీడియాపై దాడులు అక్రమం

### టెక్కలి ఏపీయూడబ్ల్యూజే ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిరసన



**టెక్కలి, జూన్ 10, మేజర్‌న్యూస్:** మీడియాపై దాడులు అక్రమమని ఏపీయూడబ్ల్యూజే టెక్కలి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మరియు ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బెండీ నర్సింగరావు ఖండించారు. సాక్షి కార్యాలయాల పైన, కొమ్మినేని అక్రమ అరెస్టు పైన, టెక్కలి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక అంబేద్కర్ జంక్షన్ వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మరియు ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నర్సింగరావు మాట్లాడుతూ ఫోర్త్ ఎస్టేట్ అయినా మీడియాపై జరుగుతున్న దాడులు పట్ల తీవ్రంగా ఖండించారు. మీడియా ను సంరక్షించాల్సిన ప్రభుత్వాలే మీడియాపై దాడులను ప్రోత్సహించడం తగదని అన్నారు. సాక్షి కార్యాలయాల పైన, కొమ్మినేని అక్రమ అరెస్టు పైన ఆయన తీవ్రంగా స్పందిస్తూ కొమ్మినేని బేషరతుగా విడుదల చేయాలని టెక్కలి ప్రెస్ క్లబ్ డిమాండ్ చేసింది. కొమ్మినేని చేపట్టిన సాక్షి డిబేట్ కార్యక్రమంలో నిజా నిజాలు ఆలోచించకుండా చర్యలు తీసుకోవడం అక్రమమని అన్నారు. అంబేద్కర్ విగ్రహానికి మీడియాను కాపాడాలని మెమోరాడంను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు కార్యదర్శి నర్సిపురం శేఖర్, రమణ, అభి, ప్రవీణ్, భాను, దుప్పల శ్రీనివాసరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘోర రోడ్డు ప్రమాధం..

# ఆగి ఉన్న కారును ఢీకొన్న లగేజ్ వ్యాన్

### - ముగ్గురు మృతి
### - మృతుల్లో తండ్రి కుమార్తె
### - దైవదర్శనానికి వెళ్తూ మృత్యు ఒడిలోకి



**కోటబొమ్మాళి, జూన్ 10, మేజర్‌న్యూస్:** మండలంలోగల జాతీయ రహదారి ఎత్తురాళ్ళపాడు గ్రామ సమీపంలో మంగళవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాధంలో ఒడిస్సా రాష్ట్రం, బ్రహ్మపురం రాధాకృష్ణ వీధికి చెందిన గోకుల్ పండా (33)తో పాటు మిసినిపూర్‌కు చెందిన సుశాంత్ కుమార్ శబత్ (42), అతని కుమార్తె సంతోషి శబత్ (3)లు మృతి చెందారు. వివరాల్లోకి వెళితే సింహాచలం దైవదర్శినం కోసం ఒడిస్సా నుంచి బొలేరో కారులో వెలుతుండగా, మార్గమధ్యలో ఎత్తురాళ్ళపాడు గ్రామ సమీపంలోకి వచ్చే సరికి టాయిలెట్స్ కోసం రోడ్డు పక్కన ఆపీ కూడిచేయివైపు ఉన్న డోర్‌తీసే సమయంలో ఆదే రహదారి గుండా అతివేగంగా వస్తున్న బొలెరో లగేజ్ మిని వ్యాన్ కారును బలంగా ఢీ కొనడంతో అందులో ఉన్న డ్రైవర్, తండ్రికుమార్తెలు తీవ్రంగా గాయపడ్డారు వీరికి శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా అక్కడ మృతి చెందారు.

ఈ మేరకు స్థానిక ఎస్ఐ వి. సత్యన్నారాయణ కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నారు. కాగా వ్యాన్ డ్రైవర్ ప్రమాధం జరిగిన తరువాత అక్కడ నుంచి పారిపోయాడని పోలీసులు తెలిపారు.

## ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించాలి



**టెక్కలి, జూన్ 10, మేజర్‌న్యూస్:** పర్యావరణ పరిరక్షణ లో భాగంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం లో మొక్కలు నాటిన సిద్ధి వినాయక సీనియర్ సిటీజన్స్ వాకర్స్ గ్రూప్ ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు గంగారపు మల్లేశ్వర రావు మాట్లాడుతూ భవితరాల శ్రేయస్సు దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించాలి అని అన్నారు ఈ కార్యక్రమం లోసంఘ సభ్యులు ఎర్నా గుల సింహాద్రి, కర్ణిక గాంధీ దవల కృష్ణరావు, సిర్ల సూర్యనారాయణ, టిఎస్ఎన్ రమణ,మన్మధరావ,ప్రధాన హరిచంద్ర రావు, మాస్టారు గణపతి రావు, తదితరులు పాల్గున్నారు.

## మానసిక ప్రశాంతతకు యోగా అవసరం



**విశాఖపట్నం, జూన్ 10, మేజర్‌న్యూస్:** మానసిక ప్రశాంతతకు యోగ ఎంతగానో దోహదపడుతుందని ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ బీసీ సాధికారత తెలుగుదేశం పార్టీ కన్వీనర్, 38వ వార్డు టిడిపి అధ్యక్షులు గోడి నరసింహాచారి అన్నారు. వన్ టౌన్ టౌన్ హాల్లో మంగళవారం ఉదయం జరిగిన యోగ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. నిర్వాహకులతో కలిసి ఆయన యోగ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా చేయడం వలన అనేక మానసిక శారీరక రుగ్మతల నుండి దూరంకావచ్చు అన్నారు. నేటి విద్యా వ్యవస్థలో కూడా విద్యార్థులు ఎంతో మానసిక ఒత్తిడికి లోనవుతున్నారని, వాటి నుండి ఉపశమనానికి బాల్యం నుంచే యోగాను దినచర్యగా అలవర్చుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరు ప్రతిరోజు తప్పనిసరిగా యోగ కు కొంత సమయం కేటాయించాలని ఈ సందర్భంగా గోడి నరసింహాచారి పిలుపునిచ్చారు . ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## సాక్షి మీడియాను నిషేధించాలి



**భీమునిపట్నం, జూన్ 10, మేజర్‌న్యూస్:** మహిళలను కించపరిచేలా చేసిన వ్యాఖ్యానాలకు వేదికగా నిలిచిన సాక్షి మీడియాను నిషేధించాలని వివిధ వర్గాలకు చెందిన మహిళలు మంగళవారం భీమిలి పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ప్రతినిధులు మాట్లాడుతూ డిబేట్ పేరుతో సాక్షి యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావు, గెస్ట్ ప్యానెల్ కృష్ణంరాజులు మనోభావాలు దెబ్బ తీసేలా మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేశారని అన్నారు. అమరావతి రాజధానిపై అక్కసుతో సాక్షి మీడియా కుట్రకు తెరతీసిందని వారు ఆరోపించారు. దీని వెనుక మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, ఆయన సతీమణి భారతిరెడ్డి ఉన్నారన్నారు. బాధ్యులైన వారిని అరెస్ట్ చేసి తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతకుముందు ఆర్టీసీ బస్టాండ్ నుంచి జూనియర్ కాలేజీ మీదుగా గంట స్తంభం వరకూ ర్యాలీ చేశారు. సాక్షి మీడియాను నిషేధించాలి. జగన్మోహన్ రెడ్డి డౌన్ డౌన్ అంటూ ర్యాలీలో పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

## వర్షాల నేపథ్యంలో ఈపీడీసీఎల్ అప్రమత్తం

**- ఉద్యోగులకు సెలవులు బంద్**

**- ఆదేశాలిచ్చిన సీఎండీ పృథ్వీతేజ్**

**విశాఖపట్నం, జూన్ 10, మేజర్‌న్యూస్:** ఉత్తరాంధ్ర ఉభయగోదావరి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ హెచ్చరికల నేపథ్యంలో ఎటువంటి పరిస్థితులన్నైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి అధికారులను మంంగళవారం అప్రమత్తం చేసారు. సీఎండీ ఆదేశాల మేరకు వినియోగదారులకు 24 ఇంటూ 7 సేవలందించేందుకు కార్పొరేట్ కార్యాలయంతో పాటు సంస్థ పరిధిలోని 11 జిల్లాలలో ఇప్పటికే కంట్రోల్ రూములు ఏర్పాటు చేశారు. వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయాలు లేకుండా సేవలందించేందుకు అవసరమైన యంత్రాంగాన్ని, పరికరాలను, సిబ్బందిని అందుబాటులో ఉంచుకోవాలని సూపరెంటెండీరింగ్ ఇంజనీర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లను సీఎండీ ఆదేశించారు. అధికారులందరూ వినియోగదారులకు అందుబాటులో ఉండాలని, సిబ్బందికి ఎలాంటి సెలవులు మంజూరు చేయవద్దని సూపరెంటెండీరింగ్ ఇంజనీర్లకు ఆదేశాలిచ్చారు. విద్యుత్ అంతరాయాలకు సంబంధించిన సమాచారాన్ని వినియోగదారులు కంట్రోల్ రూమ్ నెంబర్లకు తెలియచేసి పరిష్కారం పొందవచ్చని సూచించారు.

కంట్రోల్ రూమ్ నంబర్లు: కార్పొరేట్ ఆఫీస్:1912, శ్రీకాకుళం 9490612633, విజయనగరం 9490610102, పార్వతీపురం మన్యం 8331983217, విశాఖపట్నం 7382299975, అనకాపల్లి 9490610022, అల్లూరి సీతారామరాజు జిల్లా 9490610027, రాజమహేంద్రవరం 7382299960, కాకినాడ 9493178718, డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ 9440904477, ఏలూరు 9440902926, పశ్చిమ గోదావరి 9490610152.

## "దువ్వాడ రైల్వే స్టేషన్ సమస్యలపై ఎంపీకి వినతి"



**గాజువాక, జూన్ 10, మేజర్‌న్యూస్:** విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు శ్రీ భరత్ విశాఖపట్నం అభివృద్ధికి రైల్వే స్టేషన్ లో 14 ప్లాట్ ఫారాల విస్తరణకు ఆయన చేస్తున్న కృషిని, ప్రత్యేక జోన్ ఏర్పాటులో జీఎం నియమకానికి ఆయన చేసిన కృషి మరువలేనిదని పేర్కొన్నారు. దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కలిసి అభినందించారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దువ్వాడ రైల్వే స్టేషన్ లో వందే భారత్ రైలు హాల్టుకు, కోచ్ మెయిన్ టెనెన్స్ వరకు రాక్స్ రిపేరు కొరకు కృషి చేయాలని, ఎన్టిపిసి క్వార్టర్స్ నుండి ఆర్టీసీ కాంప్లెక్స్ కు వయా అగనంపూడి దువ్వాడ రైల్వే స్టేషన్ ప్లాట్ఫారం వన్ నుంచి ఒక బస్సు,అదే విధంగా సబ్బవరం నుంచి దువ్వాడ ఎస్ టి బి ఎల్ షీలా నగర్ మీదుగా విశాఖపట్నం ఒక బస్సు సౌకర్యాన్ని కల్పించాలని, దువ్వాడ స్టేషన్ ప్లాట్ ఫామ్ నాలుగు వైపుల తక్కువ ధరల దుకాణాలు ఏర్పాటు చేయాలని, దువ్వాడ స్టేషన్ లో విశాఖపట్నం నుంచి వచ్చే రైళ్లకు రెండు నిమిషాల బదులు ఐదు నిమిషాల హాల్టు చేయాలని విజ్ఞప్తి చేశారు ఈ మేరకు వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఇటీవల దువ్వాడ స్టేషన్ లో రైల్వే ప్రయాణికులకు ఉచితంగా నీళ్ల సీసాలు అందజేసిన రైల్వే యూజర్స్ అసోసియేషన్ సభ్యులను ఎంపీ శ్రీ భరత్, డి ఆర్ యు సి సి సభ్యులు చలసాని గాంధీ అభినందించారు కార్యక్రమంలో జడ్ ఆర్ యు సి సి సభ్యులు కంచు మూర్తి ఈశ్వర్, రైల్వే యూజర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వి జాషువా, ఎగ్జిక్యూటివ్ సభ్యులు ఎం ఎస్ ఎన్ మూర్తి, బి కామేశ్వరరావు పాల్గొన్నారు.

## ఘనంగా పోర్టు వెంకటేశ్వర స్వామి తెప్పోత్సవం




**విశాఖపట్నం, జూన్ 10, మేజర్‌న్యూస్ :** పోర్టు వెంకటేశ్వర స్వామి వారి కల్యాణోత్సవంలో భాగంగా మంగళవారం తెప్పోత్సవం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్ ఉత్సవాలను ప్రారంభించారు.విశాఖపట్నం పోర్ట్ ట్రస్ట్ సమాకూర్చిన లాంచీలో శ్రీదేవి భూదేవి శ్రీ స్వామివారిని వెంచేయించి సముద్రంలో ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని మేళ తాళాలు మంగళ వాయిద్యాలతో కొండపై నుండి కిందకు దించి పల్లకీలో సముద్ర తీరం వరకు ఊరేగించారు ఆ తర్వాత స్వామి వారు పైలెట్ లాంచీలో ఆశీనులు కాగా, మరి కొన్ని లాంచీలు దాన్ని అనుసరించాయి లాంచిని పూలతో అలంకరించారు ఆలయ ఎగ్జిక్యూట్ ఆఫీసర్ ఎస్. శ్రీనివాసరావు పర్యవేక్షణలో శ్రీ స్వామి వారి తెప్పోత్సవం నేత్ర పరంగా జరిగింది ఈ కార్యక్రమంలో కార్పొరేటరసాధిక్, జనసేన పార్టీ మహిళా నాయకురాలు కొల్లి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

## ఎలక్ట్రిక్ బస్ సర్వీసు ప్రారంభం



**ఆరిలోవ, జూన్ 10, మేజర్‌న్యూస్:** భారతదేశంలో ఎలక్ట్రిక్ ఇంటర్ సిటీ బస్సు సర్వీసులలో ప్రముఖ సంస్థ ఫ్రెష్ బస్ విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు నగరాల మధ్యన తమ కొత్త ఎలక్ట్రిక్ బస్సును ప్రారంభించారు. ఈ బస్సు సర్వీసు అత్యాధునిక అన్ని హంగులు, ప్రయాణికులకు అవసరమైన అన్ని సదుపాయాలను కలిగి ఉన్నది. పర్యావరణ పరిరక్షణ దిశగా ఇంధన కాలుష్యం నివారించే లక్ష్యంతో ఈ ఎలక్ట్రిక్ బస్సు ప్రవేశ పెట్టినట్లు ఫ్రెష్ బస్ వారు చెప్పారు. ఈ బస్సు విశాఖపట్నం నుంచి గుంటూరు వరకు వెళుతుందని మిడ్ పాయింట్ రాజమండ్రి వద్ద ఆగుతుందని చెప్పారు. ఈ బస్సు ప్రయాణం టికెట్ ఆన్ లైన్ బుకింగ్ దగ్గర నుంచి వారు తమ గమ్యస్థానం చేరే వరకు ఒక గొప్ప ప్రయాణ అనుభూతిని కలిగిస్తుంది. ఈ సందర్భంగా ఫ్రెష్ బస్ వ్యవస్థాపకులు, ముఖ్య కార్య నిర్వాహణాధికారి సుధాకర్ చిర్రా మాట్లాడుతూ భారత దేశంలోని నగరాల మధ్యన ప్రయాణాల పరిస్థితులను మధురానుభూతిగా మార్చే లక్ష్యంతో అత్యంత శక్తివంతంగా ఫ్రెష్ బస్ సంస్థ పనిచేస్తుంది అన్నారు. కార్య నిర్వాహణాధికారి సందీప్ గంభీర్ మాట్లాడుతూ బస్ ప్రారంభించడం సంతోషంగా ఉందని తెలిపారు.

## నేడు భీమిలి లో పలు చోట్ల విద్యుత్ నిలిపివేత

**భీమునిపట్నం, జూన్ 10, మేజర్‌న్యూస్:** ఎ.పి.ఈ.పి.డి.సి.ఎల్ కు చెందిన జోన్-3 ఆపరేషన్ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పోలాకి శ్రీనివాసరావు సూచనల మేరకు, మరమ్మతుల పనుల నిమిత్తం బుధవారం నాడు ఉదయం 08.00 గంటల నుంచి మధ్యాహ్నం 03.00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారని భీమిలి ఎ. ఈ. సకరయ్య తెలిపారు. ఈ సందర్భంగా 33/11 కె.వి. కాపులుప్పడ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న 11 కె.వి. గ్రే హౌండ్స్, 11 కె.వి. ఉప్పాడ ఫీడర్లు, అలాగే 33/11 కె.వి. భీమిలి సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కె.వి. పాలిటెక్నిక్ ఫీడర్ లైన్లను తాకుతున్న చెట్ల కొమ్మలను తొలగించడం, ఇతర మౌలిక మరమ్మతులు చేయనున్నట్లు తెలిపారు. ఈ చర్యల నేపథ్యంలో రామాద్రి, మంగమారిపేట, తిమ్మాపురం, కాపులదిబ్బడిపాలెం, కె.నగరపాలెం, రెడ్డిలపాలెం, సోమన్నపాలెం, కల్రగామం, గ్రే హౌండ్స్, నేరెళ్లవలస, జగనన్న కాలనీ, వాంబే కాలనీ, మార్లిన్ కె తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుంది. ప్రజలందరూ సహకరించాలని కోరారు.

## విలువలతో కూడిన పాలనకు ఏడాది పూర్తి



**భీమునిపట్నం, జూన్ 10, మేజర్‌న్యూస్:** విలువలు, రాజకీయ సమతుల్యతతో కూడిన పాలనపట్ల రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. విశాఖపట్నం జిల్లా పర్యటనకు విచ్చేసిన తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తో గంటా నూకరాజు బేటి అయి ఏడాది కాలంలో రాష్ట్రంలో సుపరిపాలన అందించినదుకు శుభాకాంక్షలు తెలియజేసారు. రాష్ట్రంలో పేదరికపై రామరాజ్యం అధికారంలోకి వచ్చిందని అన్నారు. కూటమి పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని అన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళు చేసుకొని రాత్రింబవళ్ళు కష్టపడి పనిచేస్తున్న కూటమి సర్కార్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి, మానవవనరుల శాఖమంత్రివర్యులు నారా లోకేష్ బాబుకి, విశాఖ పార్లమెంట్ సభ్యులు శ్రీభరత్ మరియు భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావుకి నా హృదయపూర్వక ధన్యవాదములు అని గంటా నూకరాజు అన్నారు.

## యోగా నిర్వహణపై ప్రభుత్వంతో రెండు సాంకేతిక సంస్థలు ఒప్పందం






**విశాఖపట్నం, జూన్ 10, మేజర్ న్యూస్:**యోగాంధ్ర కార్యక్రమాలు, జూన్ 21న విశాఖపట్టణం వేదికగా జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల నిర్వహణలో భాగంగా విస్తృత అవగాహన, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఆధారంగా యోగా శిక్షణలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో రెండు సాంకేతిక సంస్థలు అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ మేరకు ఏయూ కన్వెన్షన్ హాలు సమీపంలోని సాగరిక హాలులో మంగళవారం జరిగిన సమీక్షా సమావేశం అనంతరం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, ఇతర మంత్రులు డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, అనగాని సత్యప్రసాద్, వంగలపూడి అనిత, గుమ్మడి సంధ్యారాణి తదితరుల సమక్షంలో సంబంధిత సంస్థలకు చెందిన అధికారులు, ఆయూష్ విభాగం రాష్ట్ర స్థాయి అధికారులు ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. ఏవాటిలో కర్నూలులోని ట్రిపిల్ ఐటీ డీఎం (ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, డిజైన్, మాన్యుఫాక్చరింగ్) సాంకేతిక విద్యా సంస్థ, మహారాష్ట్రకు చెందిన సాంకేతిక సంస్థ హాబిల్డు హెల్త్ టెక్ ప్రయివేటు లిమిటెడ్ సంస్థలు ఉన్నాయి. మంత్రుల సమక్షంలో ఐఐఐటీ డీఎం–కర్నూలుకు చెందిన ఆచార్యులు కృష్ణనాయక్, ఎం. నరేశ్ బాబు, హాబిల్డ్ సాంకేతిక సంస్థ ప్రతినిధి అన్సుల్ అగర్వాల్, ఆంధ్రప్రదేశ్ ఆయూష్ విభాగం డైరెక్టర్ దినేశ్ కుమార్ పాల్గొని ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. అనంతరం ఎంవోయూలు కుదుర్చుకున్న పత్రాలను మార్చుకున్నారు.

## 25వ తేదీన 5వ జోన్ పరిధిలో బహిరంగ వేలం

**విశాఖపట్నం, జూన్ 10, మేజర్ న్యూస్:** మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ 5వ జోన్ పరిధిలోని పలు దుకాణాలు, కళ్యాణ మండపాలు, రోడ్ సైడ్ మార్కెట్లకు జూన్ 25, బుధవారం ఉదయం 11 గంటలకు 5వ జోన్ (జ్ఞానాపురం) జోనల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించబడునని జోనల్ కమిషనర్ బి.రాము మంగళవారం పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు. మహా విశాఖ నగర పాలక సంస్థ, జ్ఞానాపురం, జోన్–5, పరిధిలో గల కొత్త వార్డు నెం 40 నుండి 63 వరకు సంబంధించిన ఖాళీగా ఉన్న దుకాణాలు, కళ్యాణ మండపములు, రోడ్డు సైడ్ మార్కెట్ల కు తేది.25.06.2025, ఉదయం 11.00 లకు 5వ జోనల్ కార్యాలయము, జ్ఞానాపురం నందు దిగువ తెలిపిన వివరాలు వారిగా బహిరంగ వేలము నిర్వహించబడును. వార్డు నెం.60 గుల్లల పాలెం షాపింగ్ కాంప్లెక్స్ లో దుకాణము నెం.8, 22, 23, 24, 47, 48, 52, 55, 56, 57 మరియు 58, అశోక్ నగర్ షాపింగ్ కాంప్లెక్స్ లో దుకాణము నెం.01, 02 %ు% 03, నరోనా రోడ్డు షాపింగ్ కాంప్లెక్స్ లో దుకాణము నెం.02 మరియు ములగాడ షాపింగ్ కాంప్లెక్స్ లో దుకాణము నెం.03 షాప్ లకు మూడు సంవత్సరాల కాల పరిమితి వరకు మరియు కళ్యాణ మండపాలు వార్డు నెం 51 (కొత్త వార్డు) లోని మాధవ స్వామి కళ్యాణ మండపం మూడు సంవత్సరాల కాల పరిమితి వరకు మరియు మార్కెట్స్ లలో గుల్లలపాలెం దుకాణము రోడ్ పక్కన మార్కెట్స్ (హాకర్ మండలం), అక్కయ్యపాలెం రోడ్ సైడ్ మార్కెట్ లకు ఒక సంవత్సరం కాల పరిమితి వరకు వేలం పాట జరుగునని 5వ జోన్ జోనల్ కమిషనర్ తెలిపారు. కావున ఆసక్తి గల వారు వేలం పాటలో పాల్గొనేటప్పుడు వేలంపాటకు సంబంధించి ధరావత్తు మొత్తం డి.డి రూపంలో తీసుకురావాలని, ఎస్.సి రిజర్వుడు కేటగిరి వారు సంబంధిత కుల ధృవీకరణ పత్రం సమర్పించవలసి ఉంటుందని, వేలం పాటలో పాల్గొనే ప్రతి ఒక్కరు ఆధార్, పాన్ కార్డు కలిగి ఉండాలని, తదుపరి పూర్తి వివరణ కొరకు జోన్–5, జ్ఞానాపురం కార్యాలయము పని దినములలో పర్యవేక్షకులను సంప్రదించగలరని జోనల్ కమిషనర్ తెలియజేశారు.

# నగరంలో విచ్చలవిడిగా గంజాయి గుప్పు..!

(మొదటి పేజీ తరువాయి)



### పోలీసులకు గంజాయి కేసుల సవాల్ ...

కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినప్పటికి పోలీసుల కళ్లుగప్పి గంజాయిని అక్రమంగా తరలిస్తూ వారికే సవాల్ విసురుతున్నారు. గంజాయి మాఫియా పై ఉక్కుపాదం మోపేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నప్పటికీ అంతగా దాని ప్రభావం కనిపించడం లేదని చెప్పొచ్చు. ఏక్కడికక్కడ పూర్తిస్థాయిలో పోలీసులు నిఘా పెట్టిన ఫలితం శూన్యంగా కనిపిస్తుంది. పోలీసుల కళ్ళు కప్పి, వారిని ఏమార్చి గంజాయిని అక్రమంగా తరలించడం లో గంజాయి మాఫియా రూటే సపరేటు గా ఉంది. ఈ వ్యవహారంలో పోలీసులు చాలా దూకుడుగా వ్యవహరిస్తున్నారు. అటు గంజాయి మాఫియా కూడా ఏ మాత్రం తగ్గకుండా తమ కార్యకలాపాల ద్వారా పోలీసులకు సవాల్ విసురుతున్నారు. ఎఫ్ఐఆర్ లో ముద్దాయిలు గా చూపించి ఇప్పుడు పట్టుకోవడం లో విశాఖ పోలీసులు మీన మెషాలు లెక్కిస్తున్నారు.

### ఎక్కడికక్కడ తనిఖీలు..

ప్రతి మార్గంలోనూ పోలీసులు నిఘా కట్టుదిట్టం చేశారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేయడమే కాకుండా అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తూనే ఉన్నారు. ఏమాత్రం వెనక్కి తగ్గకుండా తన విధులను నిక్కచ్చిగా నిర్వహిస్తూనే ఉన్నారు. కానీ గంజాయి మాఫియా పోలీసులు కంటే ఒకడుగు ముందుకు వేసి వారికి ఉన్న ఇతర మార్గాలు,అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ యథేచ్ఛగా గంజాయిని అక్రమంగా తరలిస్తున్నారు. నిత్యం ఏదో స్టేషన్ పరిధిలో గంజాయి స్మగ్లర్లను పట్టుకుంటున్న అక్రమ వ్యాపారం ఆగడం లేదు.

### కొనసాగుతున్న అరెస్టులు..

మరోపక్క ఈ వ్యవహారానికి సంబంధించి పలువురుని పోలీసులు అరెస్ట్ చేస్తూనే ఉన్నారు. ఈ కేసులకు సంబంధించిన వ్యవహారంలో ఉన్న ప్రతి ఒక్కరిని కూడా అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తూనే ఉన్నారు. విచారణలో వీరు ఇచ్చిన వివరాలు ద్వారా మరికొందరి పై ఆకస్మిక తనిఖీలు చేపట్టి అరెస్టులు చేస్తూ వారి నుంచి పెద్ద మొత్తంలో గంజాయిని స్వాధీనం చేసుకుంటున్నారు.

### అసాంఘిక శక్తులుగా..

మత్తులో ఉన్న విద్యార్థులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ ప్రజలను భయపెడుతున్నారు. ఒక గ్రూపు మొత్తం గంజాయిని కొనుగోలు చేసి ఇష్టానుసారంగా ఎక్కువ మోతాదులో తీసుకుంటూ మత్తులో తూలుతూ పలు నేరాలకు పాల్పడుతున్నారు. దొంగతనాలకు దారి దోపిడీలకు పాల్పడుతున్నారు. దౌర్జన్యాలు చేస్తూ చివరకు హత్యలు,హత్యాయత్నాలు చేయడానికి కూడా వెనకాడటం లేదు.

### నగరంలో శివారు ప్రాంతాల్లో విచ్చలవిడిగా గంజాయి..!!

నగరంలో ఎక్కడ చూసినా విచ్చలవిడిగా రోజుకొక్క గంజాయి కేసులు బయటపడుతున్నాయి. పోలీసులు ఎంత కఠినమైన చర్యలు చేపడుతున్న ప్రయోజనం లేకుండా పోతుంది. విశాఖ నగరంలో నెలల్లో పదుల సంఖ్యలో గంజాయి కేసులు బయటపడుతూనే ఉన్నాయి. పోలీసులు మాత్రం ఈ వ్యవహారంలో చాలా దూకుడుగా వ్యవహరిస్తూ గంజాయి మాఫియా ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రయత్నిస్తూనే ఉన్నారు. కానీ నేడు గ్రాముల నుంచి టన్నుల కొద్దీ గంజాయి బయట పడుతూనే ఉంది అంటే గంజాయి మాఫియా ఏ స్థాయిలో తన నెట్వర్క్ వినియోగిస్తుందో అవగతమవుతుంది.

### ఇతర రాష్ట్రాలకు గంజాయి అక్రమ రవాణా

విశాఖ ఏజెన్సీ ప్రాంతంలో విస్తృతంగా గంజాయిని సాగు చేస్తున్న వ్యక్తులు గంజాయి స్మగ్లర్ల తో చేతులు కలిపి ఇతర రాష్ట్రాలకు రవాణా మార్గాల ద్వారా గంజాయిని అక్రమంగా తరలిస్తున్నారు. రాష్ట్రంలో గంజాయి సాగు లేకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నామని ఒక పక్క రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నప్పటికీ వాస్తవంగా అయితే ప్రభుత్వ ప్రకటనలకు విరుద్ధంగా భారీ స్థాయిలో వేలాది ఎకరాల లో గంజాయి సాగు కొనసాగుతుంది. ఏజెన్సీ ప్రాంతాలలో ఎంతమేరకు గంజాయి సాగు అవుతున్నది అనే విషయాలు పోలీసుల వద్ద పూర్తి సమాచారం ఉన్నప్పటికీ ఇప్పటికిప్పుడే గంజాయి సాగును పూర్తిస్థాయిలో ధ్వంసం చేయలేని పరిస్థితులు నెలకొన్నాయి.

వేరే రాష్ట్రాలలో పట్టుబడిన గంజాయికి విశాఖ ఏజెన్సీ తో లింక్ ఉందనే విషయాన్ని ఆ రాష్ట్ర పోలీసు అధికారులే స్వయంగా చెబుతున్నారు. తాజాగా తెలంగాణ రాష్ట్రంలో అనకాపల్లి జిల్లా కు చెందిన ఇద్దరు వ్యక్తులు హాయిష్ ఆయిల్ అక్రమంగా తరలిస్తుండగా హైదరాబాద్ పోలీసులు కు చిక్కారు. వీరిపై అరా తీయడం తో ఏపీ లో అనకాపల్లి కి చెందిన వారిగా గుర్తించారు. 100 రోజుల్లో గంజాయి నిర్మూలన చెప్పిన నేతలు ఇప్పటికీ గంజాయి విచ్చలవిడిగా నగరంలోకి వస్తూనే ఉందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

## 26న వీఎంఆర్డీఏ షాపులు, ఆఫీసులకు బహిరంగ వేలం

**విశాఖపట్నం, జూన్ 10, మేజర్న్యూస్ :** వీ.యం.ఆర్.డి.ఏ కు చెందిన షాపులు, ఆఫీసులు, ఖాళీ స్థలములు నెలసరి అద్దె చెల్లింపు ప్రాతిపదికపై ఇచ్చుటకు నిర్ణయించారు. షాపులు, ఆఫీసులు, ఖాళీ స్థలములు "బహిరంగ వేలం" పాట ద్వారా నిర్ణయింపబడు ధరకు అద్దెకు ఇస్తామని వీఎంఆర్డీఏ కార్య దర్శి మంగళవారం ప్రకటించారు. ఖాళీ దుకాణాలు, కార్యాలయాల యొక్క పూర్తి వివరములు అనగా విస్తీర్ణము,అద్దె, వి.యం.ఆర్.డి.ఏ అప్సెట్ ధర మొదలగునవి వి.యం.ఆర్.డి.ఏ వెబ్ సైట్ నందు పొందుపరిచినట్టు ప్రకటించారు. ఈ షాపులు, ఆఫీసులు మరియు ఖాళీ స్థలములు యదాతథంగా 3 సంవత్సరముల కాల పరిమితి కొరకు నెలసరి అద్దె ప్రాతిపదికపై వేలం వేయబడును. ఆసక్తి గల వారు ధరఖాస్తులను వి.యం.ఆర్.డి.ఏ వెబ్ సైట్ నందు గాని లేదా వి.యం.ఆర్.డి. ఏ కార్యాలయము (8వ అంతస్తు) రెవిన్యూ విభాగం నందు గాని పొందవచ్చునని తెలిపారు. ధరఖాస్తుతో పాటుగా ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు (ఐఓబీ బ్రాంచ్) సిరిపురం లో ధరఖాస్తు రుసుము ఒక్కింటికి రూ. 2 వేలు చలానా రూపములో చెల్లించి, ధరావత్తు సొమ్ము ఒక్కింటికి రూ. 50 వేలు, ది మెట్రోపాలిటన్ కమీషనర్, వి.యం.ఆర్.డి.ఏ, విశాఖపట్నం వారి పేరున డి.డి. తీసుకొని, పూరించిన ధరఖాస్తు, చలానా, డి.డి.లు విశాఖపట్నం మహానగర ప్రాంత అభివృద్ధి సంస్థ కార్యాలయములో (8వ అంతస్తు) నందు ఈ నెల 9వ తేదీ నుంచి 24వ తేదీ సాయంత్రము 5 గంటలలోపు అందజేయాలని కోరారు. ఎస్సీ ఎస్టీ దివ్యాంగులు అయినట్లయితే వారి కులము మరియు సంబంధిత ధృవపత్రమును జతపరచవలెనని కోరారు. బహిరంగ వేలము ఈ నెల 26 వ తేదీ ఉదయం 11 గంటలకు వి.యం.ఆర్.డి.ఏ. చిల్డ్రన్స్ థియేటర్లో నిర్వహించనున్నట్టు వివరించారు.

## నేడు వరహా నృసింహస్వామికి మూడో విడత చందనం



**విశాఖపట్నం, జూన్ 10, మేజర్న్యూస్ :** సింహాచలం శ్రీ వరాహ నృసింహస్వామి వారికి మూడో విడత చందనం బుధవారం సమర్పించనున్నారు. జేష్ఠ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ వేడుకను శాస్త్రవేత్తంగా నిర్వహించనున్నారు. మూడో విడతకు అవసరమైన చందనాన్ని ఇప్పటికే వేద పండితులు నియమనిష్ఠలతో అరగదీసి సిద్ధం చేశారు. వాస్తవానికి స్వామి వారు ఏడాది పొడుగునా చందనముతో కప్పబడి ఉంటారు. చందనోత్సవం పర్వదినం ఒక్కరోజు మాత్రమే స్వామి వారు నిజరూపంలో భక్తులకు దర్శనమిస్తారు. ఏడాది పొడుగునా ఉన్న చందనాన్ని చందనోత్సవం రోజున తీసివేసి మరల మరచుట రోజు చందనం తో స్వామి వారిని కప్పివేస్తారు. అయితే మూడు విడతల్లో మొత్తం 8 మనుగుల చందనాన్ని స్వామివారికి సమర్పిస్తారు.

## యోగాతో ఆరోగ్యంగా ఉండండి: ఎమ్మెల్యే జగదీశ్వరి




**కురుపాం జూన్ 10, మేజర్ న్యూస్:** కురుపాం ఎంపీడీఓ జే ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల నుంచి శోభలతా దేవి కాలనీ వరకు ఆల్ డిపార్ట్మెంట్స్ ఉద్యోగులు ర్యాలీలో పాల్గొని యోగ చేయండి ఆరోగ్యవంతులుగా ఉండండి అని ఎమ్మెల్యే జగదీశ్వరి అన్నారు. స్లొగన్స్ చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ తేజస్వరావు, ఎంపీడీవో ఉమామహేశ్వరి, తహసిల్దార్ రవణమ్మ, ఎంఈఓ సత్యనారాయణ, ఆర్డబ్ల్యూఎస్ వేణు, పలు శాకాల అధికారులు ఉద్యోగులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి




**పాలకొండ, జూన్ 10, మేజర్ న్యూస్:** మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్,,,( సిఐటియు) పాలకొండ కమిటీ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ విభాగం కార్మికులు నిరసన ర్యాలీ నిర్వహించారు వివిధ మున్సిపాలిటీలో , సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాలా రమణారావు ఇంజనీరింగ్ విభాగం పాలకొండ నగర పంచాయతీ కన్వీనర్ వై హరిబాబు డిమాండ్ చేశారు. పాలకొండ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు తాము చేస్తున్న పనికి తగిన వేతనం పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు,గత అనేక సంవత్సరాలుగా వివిధ రంగాల కార్మికులకు జీతాలు పెరుగుతున్నప్పటికీ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న వాటర్ వర్క్స్, ఎలక్ట్రీషియన్స్ వంటి నైపుణ్యం కలిగిన కార్మికులకు జీతాలు పెంచక పోవడం దుర్మార్గమని విమర్శించారు. 5 సంవత్సరాల సర్వీస్ పూర్తిచేసిన కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని, ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుల కుటుంబాలకు 10 లక్షల ఎక్స్గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు, రెగ్యులర్ చేసేంతవరకు హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు..తక్షణమే మున్సిపల్ అధికారులు ఆందోళనలు, సమ్మె నిర్వహిస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మిక నాయకులతో చర్చలు జరిపి సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనియెడల వివిధ రంగాల కార్మికులందరిని ఐక్యం చేసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు లి యజ్జలసురేష్,బలివడా సురేష్, పడాల సాయి, శాసపు బాబురావు, టి.వెంకట్ సిఐటియు మండల కార్యదర్శి కాదరాము తదితరులు పాల్గొన్నారు.

## రావుపల్లిలో అంగన్వాడీ పిలుస్తోంది కార్యక్రమం



**గరుగుబిల్లి, జూన్ 10, మేజర్ న్యూస్:** అంగన్వాడీ కేంద్రాల్లో చదువుతున్న పిల్లలకు ఆటపాటల ద్వారా విద్యను నేర్పించడం జరుగు తుందని కొమరాడ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని గరుగుబిల్లి , పెదగుడబ ,సెక్టార్ల సూపర్వైజర్ రౌతు లక్ష్మి అన్నారు. మండల పరిధిలోని రావుపల్లి గ్రామంలో మన అంగన్వాడి పిలుస్తోంది కార్యక్రమం లో భాగంగా మంగళవారం అంగ న్వాడీ వర్కర్లు గ్రామంలోని ఆయా వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఐసిడిఎస్ సూపర్వై జర్ రౌతు లక్ష్మి మాట్లాడుతూ గ్రామాల్లో మూడు సంవత్సరాలు దాటిన పిల్లలను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని పేర్కొన్నారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలతో పాటు పిల్లలకు పౌష్టికాహారమును అంద జేయడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో అంగన్వాడి వర్కర్లు ఎం సావిత్రి, చింతల అరుణ కుమారి, తదితరులు పాల్గొన్నారు.




## సంగమేశ్వర ఆలయ భూముల కౌలు వేలం పాట నిర్వహణ



**మక్కువ, జూన్ 10, (మేజర్ న్యూస్):** పార్వతీపురం మన్యం జిల్లా , మక్కువ మండలం డి శిర్లాం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ సంగమేశ్వర స్వామి వారి ఆలయానికి చెందిన భూములు కౌలుకు ఇచ్చేందుకు టెండర్ కం బహిరంగ వేలంపాట నిర్వహించడం జరిగిందని ఆలయ కార్య నిర్వహణ అధికారి వివి సూర్యనారాయణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఉదయం ఆలయ ప్రాంగణంలో దేవాదాయ శాఖ అధికారులు , గ్రామ పెద్ద సమక్షంలో టెండర్ కం , బహిరంగ వేలం పాట నిర్వహించడం జరిగిందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ వేలం పాటలో సర్వే నంబరు 230/6 లో 2.66 ఎకరాల భూమితో పాటు సర్వే నెంబరు 388/1లో ఐదు ఎకరముల మెట్టు భూములను మూడు సంవత్సరములు కౌలు హక్కులు పొందేందుకు టెండర్ కం బహిరంగ వేలం పాట నిర్వహించడం జరిగినట్టు ఆయన పేర్కొన్నారు. ఈ వేలంపాటలో 2.66 ఎకరాలకు చెందిన మెట్టు భూమికి ఏడాది ఒక్కంటికి 11వేల 500 రూపాయలు కౌవులు చెల్లించేందుకు , అలాగే ఐదు ఎకరాల మెట్టు భూమికి ఏడాది ఒక్కంటికి 24 వేల 100 రూపాయలు కౌలు చెల్లించుకునేందుకు వేలం పాట దారులు పాడుకోవడం జరిగిందని ఈవో వివి సూర్యనారాయణ తెలిపారు. పార్వతీపురం గ్రూపు దేవాలయాల కార్యనిర్వహణ అధికారి మండల ప్రసాదరావు , గ్రామ సర్పంచ్ తో పాటు గ్రామ పెద్దల సమక్షంలో వేలం పాటల నిర్వహించడం జరిగిందని ఆలయ కార్య నిర్వహణ అధికారి వివి సూర్యనారాయణ తెలిపారు.

## దోమల నివారణకు చర్యలు



**పాలకొండ జూన్,10, మేజర్ న్యూస్:** దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ కిల్లి విజయ పార్వతి తెలిపారు. మంగళవారం స్థానిక ఇందిరా నగర్ కాలనీలో గల ప్రభుత్వ గిరిజన హాస్టల్ లో దోమల నివారణకు ద్రావణంతో పిచికారీ చేయించారు. వర్షకాలానికి ముందే అన్ని గ్రామాలు, ప్రభుత్వ భవనాల్లో ఈ విధంగా ద్రావణంతో పిచికారీ చేయిస్తామని పేర్కొన్నారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వ్యాధుల బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టర్ కొక్కిరపాటి తేజ్ రతన్ రాజ్, సబ్ యూనిట్ అధికారి మోహన రావు, హెచ్.వి.రమణమ్మ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## విపత్తుల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలి

### పార్వతీపురం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్




**పార్వతీపురం, జూన్ 10, మేజర్ న్యూస్ :** విపత్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. నైరుతి రుతుపవనాల రాక నేపథ్యంలో భారీ వర్షాలు, వరదలు సంభవిస్తే తక్షణమే రక్షణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ విషయంలో అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని, రెడ్ క్రాస్, పంచాయతీ కార్యదర్శులు, విఆర్వోలు, విఏఓలు అందరు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నైరుతి రుతుపవనాల సంసిద్ధతపై జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో చెరువులు, కాలువలు, రిజర్వాయర్లు ఎక్కువగా ఉన్నాయని, వర్షాకాలంలో వీటివలన ప్రజలకు, పశు సంపదకు, పంటలకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా అప్రమత్తం చేయాల్సి ఉందన్నారు. ముఖ్యంగా అధిక ఉష్ణోగ్రతలు, భారీ వర్షాలు, పిడుగులు, ఉరుముల సమయంలో ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలపై వాతావరణ శాఖ హెచ్చరికలు జారీచేస్తుందని, వాటిని మైకుల ద్వారా ప్రజలకు సమాచారాన్ని చేరవేయాలని పేర్కొన్నారు. పిడుగులు పడే సమయంలో ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఉండేలా అధికారులు టామ్ టామ్ చేయించాలని తెలిపారు. భారీ వర్షాలు, వరదల సమయంలో కాలువలు ఉన్న ప్రదేశాల వద్ద హెచ్చరిక బోర్డులను ఉంచాలని, రహదారికి అడ్డుగా విరిగి పడిన చెట్లను తక్షణమే తొలగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వరదల వలన రిజర్వాయిర్ గేట్లు ఎత్తివేసే సమయంలో ముందు రోజే ప్రజలను, రైతులను అప్రమత్తం చేయాలని పేర్కొన్నారు. ఇందుకు తగిన విధంగా అధికారులు సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటుచేసుకొని విపత్తుల పట్ల ముందస్తు ప్రణాళికలు, వనరుల లభ్యత, ఆకస్మిక ఏర్పాట్లను సమర్థవంతంగా ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. రెస్క్యూ ఆపరేషన్ల సమయంలో అవసరమైన వాటిని అధికారుల సమన్వయంతో ముందుగా సమకూర్చుకోవాలని అన్నారు. వరదలు, వర్షాల వలన అధికంగా దోమలు వ్యాప్తి చెందే అవకాశం ఉందని, వాటి నివారణ చర్యలతో పాటు పారిశుధ్య లోపం లేకుండా చూడాలని చెప్పారు. గిరిజన కొండవాలు ప్రాంతాల్లో ఉన్న గృహ నిర్మాణాలపై ప్రజలకు అవగాహన కల్పించి, సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అన్నారు. ఫారంపాండ్లు, తవ్వి వదిలి వేసిన బోరుబావి ప్రాంతాల వద్దకు పిల్లలు ఆటలు ఆడుకునేందుకు వెళ్లకుండా గ్రామస్తుల ద్వారా అప్రమత్తం చేయించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జేసీ ఎస్.ఎస్.శోబిక, డీఆర్ఓ కె.హేమలత, డ్వామా, డిఆర్డిఏ, ఐసిడిఎస్ పీడీలు కె.రామచంద్రరావు, ఎం.సుధారాణి, డా. టి.కనకదుర్గ, పశు సంవర్ధక, ఉద్యానవన, మత్స్య శాఖ అధికారులు డా. ఎస్.మన్మధరావు, బి.శ్యామల, టి.సంతోష్ కుమార్, డిఎంహెచ్ఓ, డీసీహెచ్ఎస్ డా. ఎస్. భాస్కరరావు, డా. వై.ఎన్.ఎస్.జ్యోతి, డీఎఫ్ఓ, ఎంవీఐ కె.శ్రీనుబాబు, ఎం.శశి కుమార్, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కిషోరి వికాసం...బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది



**గరుగుబిల్లి, జూన్ 10,మేజర్ న్యూస్:** మండల కేంద్రంలోని అంగ న్వాడి కేంద్రాల వర్కర్ల ఆధ్వర్యంలో మంగళవారం కిషోర్ వికాసం కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించడం తో పాటు,కార్యక్రమం యొక్క ఆవశ్యకతను తెలియజేసేందుకు సమావేశం నిర్వహించారు.కిశోరి వికాసం బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది వేస్తుందని ఈసందర్భంగా మండల కేంద్రంలోని ప్రధాని వీధితో పాటు,ఆయా వీధులలో ర్యాలీ నిర్వహిస్తూ కార్యక్రమం యొక్క ఆవశ్యకతను తెలియజేశారు. ఈసందర్భంగా అంగన్వాడి సూప ర్వైజర్ రౌతు లక్ష్మి మాట్లాడుతూ 11 సంవత్సరాల నుంచి 18 సంవత్స రాలు బాలికలకు విద్య ఆరోగ్యం భద్రత ఆర్థిక స్వావలంబనను మెరుగు పరచడమే ఈకార్యక్రమము యొక్క ముఖ్య ఉద్దేశం అని పేర్కొన్నారు.కిషోరి వికాసం కార్యక్రమం బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది వేస్తుందని, అదేవిధంగా ఉజ్వల ఆరోగ్యకరమైన సాధికార దిశగా వేసే అడుగులకు చేయూతను ఇద్దామని పేర్కొన్నారు. రక్తహీనత నివారణే ధ్యేయంగా గర్భిణీలు బాలింతలకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారమును పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.ఈకార్యక్రమంలో గరుగుబిల్లి సచివాలయం మహిళా సంరక్షణ అధికారి గొర్లి భవాని, ఏ ఎన్ ఎం బోను శ్రీదేవి ,అంగన్వాడి వర్కర్లు పల్ల కృష్ణవేణి, మహంతి పద్మావతి, మూడడ్ల స్వాతి, తదితరులు పాల్గొ న్నారు.

జనం కోసమే
సూర్య
www.suryaa.com
మీ అభిప్రాయాలే మా కథనాలు,
నేటి దినపత్రిక సూర్యకు పాఠకులే మార్గదర్శకులు.
ప్రచురితమయ్యే ప్రతి కథనం, రోజువారి వార్తలపై
మీ అభిప్రాయాలను మా దృష్టికి తీసుకువస్తే
మరింత శ్రద్ధగా మీ అందరి ఆదరణ పొందేలా కృషి
చేస్తామని ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాం
మరింత సమాచారం అందించాల్సిన వారు
ఎప్పుడైనా మీ అభిప్రాయాలను క్లుప్తంగా
తెలియజేయాలని, ఎల్లవేళా అందుబాటులో
ఉంటామని తెలియజేస్తున్నాం..
బి. శ్రీనివాసరావు
ఉత్తరాంధ్ర ఇన్‌చార్జ్
9110383594

## వరి, పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేసిన ప్రభుత్వ విప్ జగదీశ్వరి



**గుమ్మలక్ష్మీపురం, జూన్ 10 (మేజర్ న్యూస్):** వరి, పచ్చిరొట్ట విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వర అన్నారు. మంగళవారం కురుపాం మండల కేంద్రంలో, రైతు సేవా కేంద్రం వద్ద రైతులకు ఖరీఫ్-2025- వ్యవసాయ శాఖ ద్వారా రాయితీ పై వరి మరియు పచ్చిరోట్ట విత్తనాలును పంపిణీ చేశారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి పి.శంకర్ రావు, మండల పార్టీ అధ్యక్షులు కొండయ్య, నాయకులు మరడన తవిటినాయుడు, పద్మావతి, నరేష్, అప్పలకొండ, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## బాబు పాలనలో మహిళలు, బాలికలకు భద్రత కరువు

### జిల్లా వైసీపీ మహిళా విభాగం అధ్యక్షులు రెడ్డి పద్మావతి




**పార్వతీపురం, జూన్ 10, మేజర్ న్యూస్** :పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో వైసిపి మహిళా విభాగం అధ్యక్షురాలు రెడ్డి పద్మావతి అధ్యక్షతన మహిళా ప్రజా ప్రతినిదులు, నాయకులు నిరసన ర్యాలీ నిర్వహణ, అంబేద్కర్ విగ్రహం కు వినతి పత్రం సమర్పణపార్వతీపురం అర్బన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచింది. ఈ సంవత్సర కాలంలో మహిళలపై అఘాయిత్యాలు, అత్యాచారాలు, హత్యాలను అరికట్టడంలో ఈ కూటమి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని అందుకు నిరసనగా రాష్ట్ర వైసిపి పార్టీ మహిళా విభాగం ఇచ్చిన పిలుపునందుకుని మంగళవారం జిల్లా వైసిపి మహిళా విభాగం ఆధ్వర్యంలో పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారి ఇందిరా కాలనీ ఏదరంగా గల బాబా సాహెబ్ అంబేద్కర్ సర్కిల్ వరకు మహిళలు అంతా కలిసి నిరసన ర్యాలీ నిర్వహించారు, అనంతరం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో మహిళలు, చిన్నపిల్లలు పై హత్యలు, అఘాయిత్యాలు రోజురోజుకి పెచ్చరిల్లిపోతున్నాయి తప్ప వాటిని అరికట్టడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని నిరసిస్తూ రాష్ట్రంలో మహిళలపై దాడులు ఆపాలని కోరుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహనికి పూలు మాలలు వేసి ఆయనకు వినతి పత్రాన్ని అందజేయడం జరిగింది.అనంతరం ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు రెడ్డి పద్మావతి మీడియాతో మాట్లాడుతూ గత ఏడాది కాలంగా కూటమి ప్రభుత్వం పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయింది అని, రాష్ట్రంలో ఎక్కడ చూసినా మహిళలు, చిన్నపిల్లల పై దాడులు, అఘాయిత్యాలు రోజురోజుకి పెచ్చరిల్లిపోతున్నాయి అని వాటిని అరికట్టడంలో బాబు ప్రభుత్వం, పొలిష్ అధికారులు ఘోరంగా విఫలమయ్యారు అని, రాష్ట్రంలో శాంతి భద్రతలు గాలికి వదిలేశారు అని తెలిపారు. ఇప్పటికీ ఐనా రాష్ట్ర ప్రభుత్వం, హెూమ్ మంత్రి అనిత మహిళలపై అఘాయిత్యాలు అరికట్టాలి అని, చిన్నపిల్లలకు, మహిళలకు రక్షణ కల్పించాలని ఈ సందర్భంగా మహిళలు అంతా కలిసి డిమాండ్ చేస్తున్నామని, పరిస్థితులు ఇలాగే కొనసాగితే భవిష్యత్లో మహిళా ఉద్యమాలు, నిరసన కార్యక్రమాలు తీవ్రతరం చేయడం జరుగుతుంది అని హెచ్చరించారు.ఈ ర్యాలీలో జిల్లా మహిళా అధ్యక్షురాలు రెడ్డి పద్మావతి తో పాటు పార్వతీపురం ఛైర్పపర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్మన్ కొండపల్లి రుక్మిణి, పార్వతీపురం ఎంపీపీ మజ్జి శోభారాణి, పార్వతీపురం నియోజకవర్గం మహిళా విభాగం అధ్యక్షురాలు దాసరి నాగరత్నం, కురపం ఎంపీపీ శెట్టి పద్మావతి, జడ్పీటీసీ గొర్ల సుజాత, జియమ్మవలస జడ్పీటీసీ శశికళ, వీరఘట్టం వైస్ ఎంపీపీ విజయకుమారి, నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షురాలు - జడ్పీటీసీ జంపు కన్నతల్లి, స్టేట్ ఎస్సీ సెల్ కార్యదర్శి గండి భాగ్యవతి, పార్వతీపురం కౌన్సిలర్ సభ్యులు లావణ్య, అనురాధ, లక్ష్మి పార్వతి, ఇతర మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రేషనుకు నగదు బదిలీ వద్దు



**సీతానగరం జూన్ 10 మేజర్ న్యూస్:** ప్రజలకు నిత్యావసరాల పంపిణీలో యం.డి.యు వ్యవస్థ రద్దు చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సిపిఎం పార్టీ నాయకులు డిమాండ్ చేశారు ఈ మేరకు జిల్లా కమిటీ నాయకులు రెడ్డి వేణు, మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు మాట్లాడుతూ యం.డి.యు.వాహనదారులతోపాటు రేషన్ షాపుల వద్ద కూడా రేషన్ సరఫరా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని సిపిఐ (యం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తుండని నిర్వహణ లోపాలు సరిదిద్ధి, యం.డి.యు వ్యవస్థను మరింత మెరుగుపర్చాలని, అవినీతికి తావు లేకుండా ఆధునిక సాంకేతికతో అనుసంధానం చేయాలని . యం.డి.యు వ్యవస్థ ద్వారా ప్రజలకు ఇంటి వద్ద బియ్యంఅందించటం ఎంతో సౌకర్యంగా ఉంది. యం.డి.యు. వాహనం వచ్చే సమయానికి కూలీ పనులకు వెళ్లిన పేదలకు తరువాత రేషన్ డిపో వద్ద సరుకులు తీసుకునేట్లుగా ఏర్పాటు ఉండాలి. తప్ప మొత్తం వ్యవస్థనే రద్దు చేయడం ప్రజలను ఇక్కట్లుపాలు చేయడం. ఈ వాహనాల ద్వారా అక్రమ రవాణా జరుగుతుందనే నెపంతో ప్రజలకు ఇంటి వద్ద బియ్యం అందించకుండా డిపోలవద్దనే తెచ్చుకోమనటం సరైంది కాదని. యం.డి.యు. వాహనాల ద్వారా అక్రమ రవాణా జరగకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. నాణ్యమైన సన్నబియ్యం ప్రజ లకు అందించాలి.ఇవి ప్రజలందరూ వినియోగించడం వల్ల అక్రమ రవాణా కూడా అరికట్టవచ్చు. యం.డి.యు వ్యవస్థ రద్దు వలన వాహనాల డ్రైవర్లకు ఉపాధి లేకుండా పోతుంది.డీలర్లు వ్యాపారం చేసుకునేందుకు వీలుగా రేషన్ షాపులను కిరాణా దుకాణాలుగా మారుస్తామని, కేంద్రం అందించే భారత్ ఉత్పత్తులు తక్కువ ధరకు అందిస్తామని, దీనికి కేంద్రం అనుమతిచ్చిందని ప్రభుత్వం ప్రకటించింది. ఇదే అమలు చేయాలి. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం యం.డి.యు. వ్యవస్థ రద్దు నిర్ణయంఉపసంహరించుకోవాలని, కూటమి ప్రభుత్వం వాగ్దానం చేసినట్లుగా బియ్యంతోపాటు కందిపప్పు, నూనె, చింతపండు పంచదార, 14రకాల నిత్యవసర సరుకులు రేషన్ డిపోల ద్వారా పంపిణీ చేయాలని సిపిఐ(యం) కోరుతుంది.రేషన్ ద్వారా తీసుకుంటున్న బియ్యం అమ్ముకుంటున్నారనే పేరుతో దొడ్డిదోవన నగదు బదిలీ పథకాన్ని ప్రవేశపెట్టడాన్ని సిపిఐ(యం) వ్యతిరేకిస్తున్నది.నగదు బదిలీప్రవేశపెట ్టడమంటే ప్రజా పంపిణీ (రేషన్)వ్యవస్థను ప్రజల నుండి దూరం చేయడమే. మార్కెట్లో బియ్యం ధరలు పెరిగినా ప్రభుత్వం ఇచ్చే నగదు మాత్రం పెరగదు. అంతిమంగా పేద ప్రజలు నష్టపోతారు. కాబట్టి రేషన్ సరుకులు బదులు నగదు ఇచ్చే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సిపిఐ(యం) కోరుతున్నది. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు గవర వెంకటరమణ బి,అప్పారావు ఆర్,రాము ఎండియు వాహనదారులు మూడడ్ల సింహాచలం, తేలు రాఘువ, పెదిరెడ్ల తిరుపతిరావు,పోలిరాజు పాల్గొన్నారు.

## మహిళలపై అనుచిత వ్యాఖ్యలు తగవు




నెల్లిమర్ల, జూన్ 10, మేజర్ న్యూస్: సాక్షి మీడియాలో మహిళలపై ప్రసారమైన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా నియోజకవర్గ కేంద్రం నెల్లిమర్లలో మహిళలు మంగళవారం పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. రామతీర్థం జంక్షన్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం ప్రధాన రహదారిలో మానవహారంగా ఏర్పడి సాక్షి యాజమాన్యంపై నిరసన వ్యక్తం చేశారు. సాక్షిని బ్యాన్ చెయాలని, సాక్షి ఎండి వైఎస్ భారతి రెడ్డి మౌనం విడనాడాలని మహిళలు నినాదాలు చేశారు. అమరావతిపై వైకాపా నేతలు మొదటి నుంచి విషం చిమ్ము తున్నారని, వారి ఉద్దేశాలను చర్చల పేరుతో వారి తొత్తుల ద్వారా బహిర్గతం చేశారని ర్యాలీలో పాల్గొన్న మహిళలు ధ్వజమెత్తారు. నగర పంచాయతీ కౌన్సిలర్లు లెంక హైమావతి, కింతాడ కళావతి, మజ్జి అన్నపూర్ణ, ముడిమంచి లక్ష్మీ, మహిళా నాయకులు చిల్లా పద్మ, చీకటి సుహాసిని పాల్గొన్నారు.

## వనకాబడి చేసుకున్న పాపమేంటి?



**గుమ్మలక్ష్మీపురం, జూన్ 10 (మేజర్ న్యూస్):** గుమ్మలక్ష్మీపురం మండలం, లోవముతా పరిధిలో ఉన్న వనకాబడికి ఇంత వరకు రోడ్డు లేకపోవడానికి వనకాబడి చేసుకున్న పాపమేమిటని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు ప్రశ్నించారు. పార్టీ నాయుకులు కిళ్ళక శంకర్రావు 4 వ వర్ధంతి సందర్భంగా వనకాబడి వెల్లి దేరువాడ నుండి వనకా బడికి వెళ్ళిన రోడ్డును మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2006 లో వనకాబడి గ్రామంలో కొండ చరియలు విరిగిపడి ఇల్లు నేలమట్టం అయి 11 మంది అమాయక గిరిజనులు మృత్యువాత పడ్డారని, ఆ తరువాత గిరిజనులు కొండ దిగువన కొత్తగా గ్రామం నిర్మించుకున్నారన్నారు. అయినా ఇంత వరకు ఆ గ్రామానికి రోడ్డు వేయలేదని అన్నారు. ఇటీవల వనకాబడి గ్రామానికి తారు రోడ్డు నిర్మాణం కోసం 2.70 లక్షల రూపాయలు నిధులు మంజూరు అయ్యాయని, పని ప్రారంభించిన తర్వాత పారెస్ట్ వారు అభ్యంతరం తెలిపారని, దానితో రోడ్డు పనులు నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఫారెస్ట్ క్లియరెన్స్ ఇప్పించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలని డిమాండు చేశారు. వనకాబడికి రోడ్డు లేకపోవడం వలన అటవీ ఉత్పత్తులు అయినాడికి అమ్ముకుంటున్నారని అన్నారు. నిండు గర్భిణీ స్త్రీలు ఆసుపత్రికి వెళ్లాలంటే సుమారు 2 వైపులా 5 కిలోమీటర్లు కొండ ఎక్కి దిగాలని అన్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్ ఎల్ ఏ జగదేశ్వరి చొరవ చూపి ఫారెస్ట్ క్లీయరన్స్ ఇప్పించాలని అని అన్నారు. ఈ కార్యక్రమం లో సీపీఎం నాయకులు ఎం. శ్రీనివాసరావు, పీ.తిరుపతి రావు తదితరులు పాల్గొన్నారు.

## వానొస్తే... మెయిన్ రోడ్డులో పడవలు వేయాల్సిందే ...!



**పార్వతీపురం, జూన్ 10, మేజర్ న్యూస్ :** వానొస్తే పార్వతీపురం పట్టణ మెయిన్ రోడ్డులో పడవలు వేయాల్సిందేనని భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎద్దేవా చేశారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఓబిసి పార్వతీపురం మన్యం జిల్లా చైర్మన్ వంగల దాలి నాయుడు, నియోజకవర్గ చైర్మన్ సిరిసుపల్లి సాయి శ్రీనివాస్ తదితరులు ముంపుకు గురైన పార్వతీపురం పట్టణ మెయిన్ రోడ్డు ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కురిసిన కొద్దిపాటి వర్షానికి పార్వతీపురం పట్టణ మెయిన్ రోడ్డు చెరువును తలపించేలా నీట మునిగిందన్నారు. సారికి వీధి జంక్షన్ నుండి దేవాంగుల వీధి వరకు, ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్ తదితర ప్రాంతాలు ఏమాత్రం వర్షం పడినా మోకాలు లోతు నీటితో నిండి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. వైసీపీ పాలనలో మెయిన్ రోడ్డు నీట మునుగుతోందంటూ... నీటిలో తిరుగుతూ ఆరోపణలు చేసిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చాక చర్యలు చేపట్టడం లేదని ఆరోపించారు. గత నెలలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వర్షాకాలం వస్తే మెయిన్ రోడ్డు ముంపుకు గురవుతోందని, సౌందర్య రోడ్డుతో పాటు ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్ నీట మునుగుతోందని దానిపై తగు చర్యలు చేపట్టాలని కోరడం జరిగిందన్నారు. అయినా అధికారుల్లో చలనం లేదన్నారు. ఇక వైసిపి, కూటమి పాలకులు మున్సిపాలిటీలో ముంపు ప్రాంతాలు ముంపకు గురికాకుండా చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని ఆరోపించారు. పార్వతీపురం పట్టణ మెయిన్ రోడ్డులో మొరుగు కాలువల్లో మురుగు తీర్థ పనులు చేపట్టకపోవడం వల్ల వర్షపు నీరు కాలువల్లో ప్రవహించక మెయిన్ రోడ్డు మీదకి వస్తుంది అన్నారు. దీనివల్ల రోడ్డు ముంపుకు గురై చెరువును తలపిస్తోందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి ఏమాత్రం వర్షం పడిన ముంపుకు గురవుతున్న పార్వతీపురం పట్టణ మెయిన్ రోడ్డు తో పాటు ఆయా ముంపు ప్రాంతాలలో ముంపుకు గురి కాకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

## అసభ్యకర పోస్టింగులు పెట్టి వాటిని కప్పిపుచ్చుకునేందుకే

# తప్పుడు ఫిర్యాదులు

### జనసేన నాయకుడు కోట్ల రఘు



**పూసపాటిరేగ, జూన్ 10, మేజర్ న్యూస్:** ఓవైపు కొవ్వాడ పంచాయతీని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తుంటే మరోవైపు జనసేన నియోజకవర్గ ప్రజాప్రతినిధిపై అసభ్యకర పోస్టింగ్‌లు పెట్టి కించపరిచే విధంగా తెదేపా గ్రామస్థాయి నాయకులు తప్పుడు ఫిర్యాదులు చేయడం విడ్డూరంగా ఉందని జనసేన నాయకుడు, కొవ్వాడ సర్పంచ్ కోట్ల రఘు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. మండలంలోని కొవ్వాడ గ్రామంలో రఘు తన స్వగృహంలో మాజీ సర్పంచ్ తో పాటు వార్డు సభ్యులు, పలు పార్టీలకు చెందిన నాయకులతో కలిసి విలేకరుల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోట్ల రఘు మాట్లాడుతూ కొవ్వాడ పంచాయతీలో అందుబాటులో లేని ముఖం చాటేస్తున్న తెదేపా గ్రామ స్థాయి నాయకులను చెప్పుకుంటున్న హరిబాబు, సోంబాబులు తప్పుడు ఫిర్యాదులు చేయడం విడ్డూరంగా ఉందంటూ ఘాటుగా విమర్శించారు. స్మశాన వాటికలో వాస్తు విరుద్ధంగా, మౌలిక సదుపాయాలకు అడ్డంకిగా ఉన్న ఓ చిన్న షెల్టర్ ను రెండు నెలల కిందట పంచాయతీ తీర్మానం ద్వారా ప్రజలు గ్రామపంచాయతీ తీర్మానం చేసి తొలగిస్తే తెదేపా నాయకులు సోంబాబు, హరిబాబులకు ఉన్న అభ్యంతరం ఏమిటంటే ప్రశ్నించారు. రుద్ర భూమిని అభివృద్ధి చేసి రహదారులు వేసి, తాగునీటి సౌకర్యంతో పాటు స్నానపు గదులు ఇతరత్రా మౌలిక సదుపాయాలు కల్పించడం చూసి ఓర్వలేక తప్పుడు ఫిర్యాదులు చేయడం హేయమైన చర్యగా అభివర్ణించారు. తెదేప నాయకుడని చెప్పుకునే హరిబాబు అనే వ్యక్తి కాకినాడలో జీవనోపాధి పొందుతూ వాట్సఅప్ గ్రూప్ ద్వారా ఓ గ్రూపును తయారు చేసి అడ్మిన్ గా ఉన్న హరిబాబు జనసేన నేత, ఎమ్మెల్యేగా ఉన్న లోకం మాధవ పై అసంపేట పోస్టింగులు పెట్టడం వాటిని ప్రశ్నించడం అందుకు భయపడిన హరిబాబు ఆ విషయాన్ని పక్కన పెట్టేందుకు తప్పుడు ఫిర్యాదు చేశారంటూ రఘు ఆరోపించారు. గతంలో స్మశాన స్థలాన్ని ఆనుకొని ఉన్న శివాలయం కు అభివృద్ధి చేసేందుకు పంచాయతీ పెద్దలు అంతా సమావేశం పెట్టుకుంటే అందుకు సోంబాబు అనే వ్యక్తి శివాలయ అభివృద్ధికి తను వంతు సహాయంగా రూ లక్ష ఇస్తానంటూ ప్రగల్భాలు పలికాడని, ఆ వ్యక్తి తర్వాత పంచాయతీలోనే అందుబాటులో లేకుండా ముఖం చాటేసారు అంటూ ఘాటుగా విమర్శించారు. తర్వాత తానే అటు స్మశానంకెళ్లే రహదారితో పాటు శివాలి అభివృద్ధికి సొంత నిధులను వెచ్చిస్తూ తన పంచాయతీని అభివృద్ధి పదంలో నడిపించాలన్న లక్ష్యంతో పని చేసుకుంటూ పోతే అభివృద్ధిని అడ్డుకట్ట వేసేందుకే ఇటువంటి తప్పుడు ఫిర్యాదులు ఇస్తూ అభివృద్ధికి బ్రేకులు వేయడం ఎంతవరకు సమంజసం అంటూ తన అసహనాన్ని విలేకరుల ముందు వ్యక్తం చేశారు. ఎస్సీలకు చెందిన డి పట్టా భూములను కూడా హరిజనులు ప్రభుత్వ నిధుల ద్వారా క్రాంతి పథకం ద్వారా వచ్చిన నూతులను పూడ్చి ఆ భూములను ఇతరులకు అమ్ముకున్న సోంబాబు పై అట్రాసిటీ కేసు పెట్టేందుకు హరిజనులు సిద్ధంగా ఉన్నారంటూ ఈ సందర్భంగా రఘు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ప్రస్తుత ఉపసర్పంచ్ అయిన బడి నరసయ్య, వైకాపా ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు అప్పారావు, తెదేపా నాయకుడు జమ్మూ అప్పలనాయుడు, వార్డు సభ్యులు లంక లక్ష్మి, పతివాడ మంగమ్మ పాల్గొన్నారు.

## మంత్రి లోకేష్ ను మర్యాద పూర్వకంగా కలిసిన ఎంపీపీ రామారావు




**గరుగుబిల్లి, జూన్ 10, మేజర్ న్యూస్:** రాష్ట్ర విద్య మరియు ఐటి ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రివర్యులు నారా లోకేష్ పార్వతీపురంలో విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డ్స్ ప్రధానోత్సవం కార్యక్రమంకు వచ్చిన నేపథ్యంలో మండల పరిషత్ అధ్య క్షులు ఉరిటి రామారావు తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర విద్యా మరియు ఐటి ఎలక్ట్రా నిక్స్ శాఖ మంత్రివర్యులు నారా లోకేష్ ను మర్యాద పూర్వకంగా కలిసిన మండల పరిషత్తు అధ్య క్షులు ఉరిటి రామారావుతో పాటు పలువురు ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో త్వరలోనే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీ కండువాలు వేసుకోనున్నారు. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీకి ఉన్న నిబంధనల ప్రక్రియ పూర్తి అయిన అనంతరం రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనువాసరావు సమక్షంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరనున్నారు. ఈమేరకు మండల పరిషత్ అధ్యక్షులు ఉరిటి రామా రావుతోపాటు, మండల ఉప ఎంపీపీ బత్తల లక్ష్మి, మరుపెంట గ్రామ పంచాయతీ సర్పంచ్ ఉరిటి నిర్మల, రావుపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ బొంతాడ మహేశ్వరరావు(మహేష్), బురదవెంకటాపురం గ్రామపంచాయ తీ సర్పంచ్ బొత్స లక్ష్మి, పెదగుడబ సర్పంచ్ జాగాన సరస్వతి ,ఉల్లిభద్ర ఎంపీటీసీ సభ్యులు బొంగు గౌరమ్మ, కొత్తూరు ఎంపిటిసి సభ్యులు గుంట్రె డ్డి అన్నపూర్ణమ్మ, బురదవెంకటాపు రం ఎంపీటీసీ సభ్యులు చింతల రూపవతి, రావుపల్లి ఎంపీటీసీ యందవ సదానందం,కొత్తపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ గొట్టాపు శ్రీవేణి, రాయిందొరవలస సర్పంచ్ బేత వెంకటనాయుడు,వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గొట్టాపు తేజేశ్వరరావు,బొంగు కోటేశ్వర రావు, పట్టా లక్ష్మణరావు, మూడడ్ల అప్పారావు, బోను చంద్రశేఖర రావు,చింతల మల్లినాయుడు, గుంట్రెడ్డి శంకరరావు,నల్ల రవి కుమార్ , ఓలేటి జనార్ధననాయుడు, జగాన మురళి, మువ్వల సింహా చలంనాయుడు,పెదిరెడ్డి శ్రీనువాసు నాయుడు, బోను సురేష్, పప్పల సత్యన్నారాయణ, తదితరులు త్వరలోనే రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనువాసరావు సమక్షంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరనున్నారు.

## రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేసిన రామకృష్ణ



**రామభద్రపురం, జూన్ 10, మేజర్ న్యూస్:** మండల కేంద్రంలో కోపరేటివ్ సొసైటీ లో రైతులకు వరి విత్తనాలు మంగళవారం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నిర్వాహకార్యదర్శి చింతల రామకృష్ణ పంపిణీ చేశారు ఈ ఏడాది వర్షాలుపుష్కలంగా పడడంతో రైతన్నకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కూటమి ప్రభుత్వం ముందుగానే వరి విత్తనాలు సొసైటీల ద్వారా పంపిణీచేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ముందంజో లో ఉంటుందని అన్నారు రైతన్నల కోసం రాయితీపై యంత్రాలు పరికరాలు అందిస్తుందని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో రైతులు సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు

## గ్లోబల్ వ్యూస్కూల్ విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డులు



**రామభద్రపురం, జూన్ 10 (మేజర్ న్యూస్):** మండల కేంద్రంలోని గ్లోబల్ వ్యూస్కూల్కు చెందిన ఇద్దరు విద్యార్థులకు 2024-25 సంవత్సరానికి ఎస్ఎస్సీ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించి జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచినందుకు ఓసీ, ఎస్సీ విభాగంలో షైనింగ్ స్టార్ అవార్డులతో రాష్ట్ర ప్రభుత్వం సత్కరించింది. ఈ మేరకు హెూంశాఖా మంత్రి వంగలపూడి అనితా, విజయనగరం ఎమ్మెల్యే అధితి విజయలక్ష్మీ, కలెక్టర్ అంబేడ్కర్ చేతులమీదుగా ఎస్. కన్వెన్షన్లో అవార్డులతో సత్కరించారు. ఈ అవార్డుకు ఎంపికైన విద్యార్థులు గిరి, సాత్విక్ ను పాఠశాల చైర్మన్ పోల వెంకటరమణ, కరస్పాండెంట్ పోల చంద్రమోహన్, పాఠశాల ప్రిన్సిపాల్ పి. సంధ్యాలు అభినందించారు.

## రాష్ట్రంలో అదుపు తప్పిన లా అండ్ ఆర్డర్: జెడ్పీటీసీ శిరీష



**చీపురుపల్లి జూన్ 10 మేజర్ న్యూస్:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం హయంలో లా అండ్ ఆర్డర్ అదుపు తప్పిందని జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష ఆరోపించారు. మహిళలకి, చిన్నారులకి రక్షణ లేదని శిరీష విమర్శించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రం ఒకనాటి బీహార్ రాష్ట్రం కన్నా ఘోరంగా లా అండ్ ఆర్డర్ ఉందని ఆమె అన్నారు. రాష్ట్రంలో మహిళలు, చిన్నారులు మీద జరుగుతున్న హత్యాచారాలు, హత్యలు చూస్తుంటే ఈ రాష్ట్రంలో పట్టపగలు మహిళలు బైటకు రావడానికి భయపడుతున్నారన్నారు. రాష్ట్రంలో ఆడపిల్లలు కాలేజీకి, స్కూల్ కి పంపించడానికి చిన్నారులని ఆడుకోవడానికి పంపేందుకు తల్లి తండ్రులు భయపడే పరిస్థితితులు ప్రస్తుతం వున్నాయన్నారు. రాష్ట్రంలో ఒక మహిళ హెూమ్ మంత్రిగా ఉండి కూడా మహిళలు మీద ఈ విదంగా అకృత్యాలు, హత్యలు, దాడులు జరుగుతుంటే హెూమ్ మంత్రి , ముఖ్యమంత్రి , డిప్యూటీ ముఖ్యమంత్రి కానీ కనీసం ఒక్కసారి అయినా లా అండ్ ఆర్డర్ మీద పోలీస్ డిపార్ట్మెంట్ తో కనీసం సమీక్ష పెట్టిన పరిస్థితి లేదని, కనీసం అంటువంటి సంఘటనలు మీద గట్టిగా స్పందించరన్నారు. అందుకే వైస్సార్ పార్టీ అధినేత జగన్మోహనరెడ్డి ఆదేశాలతో రాష్ట్రంలో మహిళలతో ప్రతి జిల్లా కేంద్రంలో కూడా బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాలకి వినతిపత్రం సమర్పించడం జరిగిందన్నారు. భారత దేశంలో సుమారు 29 రాష్ట్రాల్లో అంబేద్కర్ రాజ్యాంగం అమలు జరుగుతుంటే కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో మాత్రమే రెడ్ బుక్ రాజ్యాంగం అమలు జరుగుతుందని అందుకే ఎవరు ఎటువంటి దుచ్చర్యలకి పాల్పడిన మహిళలు మీద దాడులు హత్యాచారాలు చేసిన వారు తెలుగుదేశం పార్టీ కి చెందినవారు అయితే వారి మీద కేసు లు వుండవనే ధైర్యం తోనే ఎక్కువగా మహిళలు, చిన్నారులు మీద ఇటువంటి దాడులు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక ఎక్కువగా జరుగుతున్నాయన్నారు, రాష్ట్రంలో అధికారం లో కి వచ్చి ఏడాది అవుతున్న అభివృద్ధి, మీదకాని ఎన్నికల్లో ఇచ్చిన హామీలు మీద కానీ దృష్టి పెట్టలేదు, రాష్ట్రంలో వున్న పోలీస్ డిపార్ట్మెంట్ అంతా కూడా ప్రతిపక్ష నాయకులు మీద కక్షసాధింపు కేసు లతో బిజీ గా వున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో అసలు లా అండ్ ఆర్డర్ అనేది అమలు జరగడం లేదు అని అన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారు అని తగిన సమయం లో కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా వున్నారన్నారు, రాష్ట్రంలో చేతకాని హెూమ్ మంత్రిగా మిగిలి పోతారో ఇకనైనా ప్రతిపక్ష నాయకుల మీద కక్ష సాధింపులకు పోలీస్ శాఖని ఉపయోగించుకోవడం ఆపేసి లా అండ్ ఆర్డర్ ని కఠినంగా అమలు చెయ్యాలని హితవు పలికారు.

## ఘనంగా పోలమాంబ ఒడ్డు పండగ



దేవరాపల్లి, జూన్ 10, మేజర్‌న్యూస్: మండల కేంద్రంలోని రెల్లి పేటలో సోమవారం పోలమాంబ ఒడ్డు పండగను ఘనంగా జరిపారు. ఉదయం నుంచి అమ్మవారికి ధూప దీప నైవేద్యాలతో పసుపు కుంకుమలతో భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. పండగ సందర్భంగా మండల కేంద్రంలో భారీగా అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. దేవరాపల్లి మాజీ ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి భాస్కరరావు గ్రామ సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ , ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు అర్జున రావు, వార్డు మెంబర్లు దీవిశంకర్రావు , కొల్లి ఈశ్వరరావు, అల్లు అబద్దం, గవిరెడ్డి సింహా, కొల్లి బాలకృష్ణ, సబ్బవరపు మాలిబాబు, కిలాడి జ్వాలా, రెల్లివీధి పెద్దలు, యూత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన కిషోర్ వికాసం కార్యక్రమం



రావికమతం, జూన్ 10, మేజర్‌న్యూస్: కిషోర్ బాలికల వికాసానికి 40 రోజుల పాటు నిర్వహించిన కిషోర్ వికాసం కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. యవ్వనంలోకి అడుగుడుతున్న కిషోర్ బాలికలకు ఆరోగ్యపరమైన విషయాల పైన, చట్టాల పైన అవగాహనకు జూన్ రెండున దేశవ్యాప్తంగా కిషోర్ వికాసం కార్యక్రమం ప్రారంభించిన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో రుతుక్రమం, బాలల హక్కులు, రక్తహీనత, లింగ అసమానత, సైబర్ మోసాలు, బాల్యవివాహాల నిరోధం పై అంగన్వాడి కేంద్రాలలో కిషోర్ బాలికలకు అవగాహన సదస్సులు నిర్వహించారు. బాల్య వివాహాల వలన ఎదురయ్యే అనర్థాలు గురించి సదస్సులో వివరించారు వీటి నిరోధానికి ప్రతి ఒక్కరూ సహకారాలు అందించాలని పిలుపునిచ్చారు. ఆండ్రాయిడ్ ఫోన్ వాడుతున్న వారిని వివిధ రకాల ఆశలు చూపి బ్యాంకు ఖాతాల నుంచి సైబర్ నేరగాళ్లు నగదు మాయం చేస్తున్నారని వీటి పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ మంగతాయారు ఎండిఓ వెంకన్న బాబు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి



దుంబ్రిగుడ, జూన్ 10, మేజర్‌న్యూస్: విద్యార్థుల పట్ల తల్లితండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని మానవ హక్కుల నేర నిరోధక సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కృష్ణకుమారి అన్నారు. ఈ సందర్భంగా మంగళవారంఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సెలవుల్లో చదువుతున్న విద్యార్థులు గ్రామాల్లో ఉన్నప్పుడు తల్లితండ్రులు అప్రమత్తంగా ఉండి ఎటు పంపకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. గ్రామాల్లో విద్యార్థులు ఉన్నప్పుడు అనేక రకాల ప్రదేశాలలో తిరుగుతుంటారని, దీంతో ఏ సమయంలో ఏం జరుగుతుందో ఊహించలేమని అభిప్రాయం వ్యక్తం చేశారు. విద్యార్థులు గ్రామాల్లో ఉన్నప్పుడు తల్లితండ్రులు విద్యార్థులకు ప్రమాదకర ప్రదేశాలకు పంపనివ్వకుండా తగు చర్యలు తీసుకున్నట్లయితే ప్రమాద సంఘటనలకు దూరంగా ఉంటారని చెప్పారు. గంగవలస గ్రామంలో అభం శుభం తెలియని విద్యార్థులు సరదాగా స్నానానికి దిగి మృతి చెందడం చాలా బాధాకరమని చెప్పారు. కళ్ళముందే ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయని దీన్ని దృష్టి పెట్టుకొని ప్రతి ఒక్క విద్యార్థుల తల్లిదండ్రులు అప్రమత్తమై పిల్లల పట్ల పలు జాగ్రత్తలు తీసుకున్నట్లయితే మరల ఇటువంటి విషాద సంఘటనలు జరగకుండా ఉంటాయని ఆమె అభిప్రాయం వ్యక్తం చేశారు.

## పల్లె పల్లెల్లో పల్లెనిద్ర కార్యక్రమం...



కశింకోట, జూన్ 10, మేజర్‌న్యూస్: పల్లె సమస్యల పరిష్కారానికే పల్లెనిద్రని అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు పల్లెనిద్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. కశింకోట మండలంలోని పల్లపు సోమవారం గ్రామంలో తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన పల్లెనిద్ర కార్యక్రమాన్ని ఆయన మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ తో కలిసి సోమవారం రాత్రి నిర్వహించారు. రాత్రి గ్రామస్తులతో పాటు కూర్చుని వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ముందుగా గ్రామం అంతా విస్తృతంగా పర్యటించారు. ఈనెల 21న జరగబోవు ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ఉదయాన్నే గ్రామస్తులు నాయకులు అందరూ కలిసి మేలుకొలుపు సంకీర్తన తో పాటు యోగాభ్యాసాన్ని నిర్వహించారు. అందరూ వయోభేదం లేకుండా చురుకుగా పాల్గొన్నారు. యోగాభ్యాస గురువుల ద్వారా యోగా విశిష్టత గురించి తెలుసుకున్నారు. రోగానికి పరిష్కారమే యోగా అన్నారు. తరువాత 8 గంటల నుండి ప్రకృతి వైద్యం గురించి,అనంతరం వ్యవసాయం, ఉద్యానవన పంటల కోసం రైతులకు సంబంధిత అధికారులు అవగాహన కల్పించారు. పశు వ్యాధుల గురించి వాటి నివారణ గురించి పశు వైద్యులు తెలిపారు. అటవీ మొక్కల పెంపకం ఎన్ ఆర్ ఈ జి ఎస్ గురించి ఫారెస్ట్ అధికారులు తెలిపారు. వీటిపై బ్యాంకులో రుణాలు గురించి బ్యాంక్ అధికారులు గ్రామస్తులకు అవగాహన కల్పించారు. మధ్యాహ్నం నుండి 6 గంటల వరకు వీటిపై పూర్తి గా సంబంధిత అధికారులు తెలియజేస్తారు. అనంతరం సంస్కృతి కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచ్ గొంతిన నాగరత్నం, కూటమి నాయకులు, ప్రభుత్వ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గార్నియర్ ఆధ్వర్యంలో బీచ్ క్లీన్ అప్ కార్యక్రమం

విశాఖపట్నం, జూన్ 10, మేజర్‌న్యూస్: ప్రముఖ గ్లోబల్ బ్యూటీ బ్రాండ్ గార్నియర్, దాని సుస్థిరత కట్టుబాట్లను బలోపేతం చేయడానికి, ప్లాస్టిక్ వ్యర్థాలను తగ్గించడం, తిరిగి ఉపయోగించడం మరియు రీసైక్లింగ్ చేయడంపై దృష్టి సారించి, దాని సుస్థిరత కట్టుబాట్లను బలోపేతం చేయడానికి స్వచ్ఛ భారత్ మిషన్ పట్టణంలో చేరినట్లు గార్నియర్ ప్రాంతీయ ప్రతినిధి చెప్పారు. ఈ సహకారం మిషన్ యొక్క "తగ్గించండి, పునర్వినియోగం, రీసైకిల్" కేంద్రాలకు మద్దతు ఇస్తుందని, ఇవి పునర్వినియోగపరచదగిన పదార్థాలకు కేంద్ర సేకరణ పాయింట్లుగా పనిచేస్తాయన్నారు. ఈ భాగస్వామ్యం వైజాగ్ ప్రాంతంలోని నాలుగు ప్రదేశాలలో బీచ్ క్లీన్ అప్ డ్రైవ్‌తో ప్రారంభమైందని, వీటిలో తెన్నేటి పార్క్, అప్పుఘర్, వైఎంసిఎ బీచ్ మరియు ఆర్కె బీచ్‌తో పాటు భారతదేశం అంతటా ఇరవై ఒక్క ఇతర బీచ్‌లు ఉన్నాయన్నారు. ముంబై, చెన్నై, పాండిచేరి, పూరి, గోవా, మంగళూరు మరియు కసర్గోడ్‌తో సహా పలు నగరాల్లో వేలాది మంది విద్యార్థి వాలంటీర్లు పాల్గొన్నారన్నారు. ఇది గార్నియర్ యొక్క గ్రీన్ బ్యూటీ జర్నీలో ఒక మైలురాయిని సూచిస్తుందని, ఇందులో ప్లాస్టిక్స్ ఫర్ చేంజ్ భాగస్వామ్యంతో భారతదేశం అంతటా ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ ఉంటుందన్నారు. గ్రీన్ బ్యూటీ ప్రోగ్రామ్‌లో భాగంగా, గార్నియర్ స్థిరమైన పరిష్కారాలను రూపొందించడానికి కట్టుబడి ఉందని, వినియోగదారులను పచ్చటి భవిష్యత్తు వైపు ఒక ఆకుపచ్చ అడుగు వేయమని ప్రోత్సహిస్తుందని చెప్పారు.

## ప్రాణవాయువునిచ్చే మొక్కలు నాటండి



దేవరాపల్లి, జూన్ 10, మేజర్‌న్యూస్: మండలంలోని నాగయ్యపేట సన్యాసి చెరువు వద్ద దుర్గాలమ్మ గుడి చెరువు గట్టుపై ఆదర్శ వినియోగదారుల సంఘం అధ్యక్షుడు బి.త్రినాధరాజు, డ్వాక్రా మహిళలు మంగళవారం మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ వారోత్సవాల్లో బాగంగా వనం- మనం కార్యక్రమం చేపట్టారు. దుర్గామ్మ గుడి నుంచి ఆర్సీకె కేంద్రం వరకు అశోక, బాదం, తురాయి, రావి, వేప, రైన్ ట్రీ వంటి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా త్రినాధ రాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పుట్టినరోజు, పెళ్లిరోజు కేకులు కట్ చేసి ఆర్భాటాలు చేసే కన్నా కొంత మంది ప్రాణాలు కాపాడే ప్రాణ వాయువును ఇచ్చే మొక్కలు నాటాలన్నారు.ఈ కార్యక్రమంలో జామి ఉమ, శేషు, రాజులమ్మ, రాము, బొడ్డు సత్యవతమ్మ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## ఏషియన్ పెయింట్ సహకారంతో కాలువ రెగ్యులేటర్లు ఏర్పాటు



మునగపాక, జూన్ 10, మేజర్‌న్యూస్: మండలంలో మునగపాక, మూలపేట, తోటాడ, మంగళవరపుపేట, పాటపల్లి, గవర్ల అనకాపల్లి గ్రామాల మీదుగా వెళ్తున్న పంట కాలవ నాకు ఆనుకొని ఉన్న పిల్ల కాలువలకు పోయిన రెగ్యులేటర్లను స్థానంలో కొత్త రెగ్యులేటర్లు వేయుటకు స్థానిక శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ ఆదేశాలతో, ఏషియన్ పెయింట్స్ వారి సహకారంతో కొత్త రెగ్యులేటర్లు వేయుటకు కంపెనీ ప్రతినిధులు మూలపేట ఆవకాలవ సంఘం చైర్మన్ ఆడారి ఆనంద సన్యాసినాయుడు అధ్యక్షతన రైతులతో సమావేశం అయ్యారు, వేసిన రెగ్యులేటర్లను మెయింటెనెన్స్ చేసే బాధ్యత రైతులతో ఒక కమిటీని ఏర్పాటు చేసి వారికి బాధ్యతలు అప్పగించే విధంగా, సమావేశంలో తీర్మానించారు, ఆడారి ఆనంద సన్యాసినాయుడు, ఆడారి రామకోటి అప్పారావు, సరగడం నాగేశ్వరరావు, ఆడారు చిన్న కాశీ రావు, కాండ్రేగుల ఈశ్వర అప్పారావు, కాండ్రేగుల రాము, సరగడం శ్రీనివాసరావు, బీసెట్టి నారాయణమూర్తి, కోయిలాడ చిన్నప్పల నాయుడు, బీసెట్టి వెంకట అప్పారావు, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు

## కిశోర వికాసం - బాల్యవివాహాలు అరికట్టాలి



మునగపాక, జూన్ 10, మేజర్‌న్యూస్: మండల కేంద్రమైన మునగపాక సచివాలయంలో కిశోర వికాసం, వేసవి సెలవులు కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాల వలన కలిగే నష్టాలు, ఐసిడిసిఎస్ వారు తెలియజేశారు, ఈ కార్యక్రమానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని డాక్టర్ విమలగిరి, డాక్టర్ ఎం నాగలక్ష్మి, ఎంపీపీ మల్లా జయలక్ష్మి అతిథులుగా పాల్గొని పలు విషయాలను తెలియజేశారు, పిల్లలకు చదువుపై ప్రాముఖ్యత, ఆహారం పోషక ఆహారం,వ్యక్తిగత పరిశుభ్రత,ఆరోగ్య సమస్యలు,బాలల హక్కుల రక్షణ, ఫోక్సో చట్టం గురించి తెలియజేయుట, చెడు స్పర్శ, మంచి స్పర్శ,గురించి అవగాహన,రక్తహీనత,దీని నివారణ,బాల్య వివాహాల వలన కలిగే నష్టాలు, దీని వలన వచ్చే ఆరోగ్య సమస్యలు, బాలికలలో నాయకత్వం మరియు సాధికారత అంశాల గురించి కిషోర్ బాలికలకు తెలియజేశారు, సిడిపిఓ ఇందిరా దేవి, సూపర్వైజర్స్ అన్నపూర్ణ, సిహెచ్ఓ దేవకాంత, మండల కూటమి నాయకులు టెక్కలి పరశురాం, దాడి శివ, ఏఎన్ఎం దేవకి, రేవతి, అంగన్వాడీ టీచర్స్, ఆశా కార్యకర్తలు, కిషోర్ బాలికలు తదితరులు పాల్గొన్నారు.

## రేపు దుర్గ మాంబ పండుగ



పరవాడ, జూన్ 10, మేజర్‌న్యూస్: గ్రామ ఇలవేల్పు ,కోరిన కోరికలని తీర్చే కల్పవల్లి దుర్గమాంబ అమ్మవారి పండుగ 12వ తేది గురువారం నాడు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త పైల పోతి నాయుడు తెలిపారు. గురువారం తెల్లవారు జామున ఉదయం 5 గంటల నుండి అమ్మవారికి ప్రత్యేక పూజలు మరియు దర్శనాలు నిర్వహిస్తున్నట్లు వచ్చిన భక్తులకు తగిన ఏర్పట్లు చేస్తున్నట్టు ఆలయ ధర్మకర్త పైల పోతునాయుడు(పెద్దింటి) తెలిపారు. కావున గ్రామ ప్రజలు ,మహిళలు , భక్తులు ఈ యొక్క అమ్మవారి ఉత్సవంలో పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించవలసిందిగా కోరుతున్నామని అన్నారు.

## తెలుగుదేశం పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేయాలి



ఆమదాలవలస, జూన్ 10, మేజర్‌న్యూస్: విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు ,ఎచ్చెర్ల నియోజకవర్గం, రణస్థలం మండలం, రణస్థలం హెడ్ క్వార్టర్, నందు జరిగిన రణస్థలం మండల తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలుతో కలసి విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్నారు, ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రణస్థలం మండలంలో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు పై ప్రస్తావించారు, తదుపరి మండల పార్టీ కార్యాచరణ పై విశ్లేషణ జరిపారు, మండలం పరిధిలో పలు సమస్యలు పరిష్కరానికి కృషి చేస్తానని తెలియజేసారు, రణస్థలం మండల పార్టీ ముఖ్య నాయకులును, కార్యకర్తలును ఉద్దేశించి ప్రస్థావిస్తూ,మండల,గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరు కృషి చేయాలని,ప్రజా సమస్యలును పరిష్కార దిశగా నాయకులు పని చేయాలని, పార్టీ కోసం సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు, నాయకులు, కార్యకర్తలు సమన్వయ లోపం లేకుండా కలసి పని చేయాలని తెలియజేసారు, ఎచ్చెర్ల నియోజకవర్గం అభివృద్ధి నా బాధ్యత అని, నియోజకవర్గం మరియు రణస్థలం మండలం అభివృద్ధికి పార్టీ బలోపేతానికి అనునిత్యం కృషి చేస్తానని తెలియజేసారు, ఈ సందర్భంగా రణస్థలం మండలం అభివృద్ధి కోసం నాయకులు ఇచ్చిన పలు రకాల సూచనలు, సలహాలను పరిశీలనలోకి తీసుకుంటానని తెలిపారు,జరగబోయే మండల, గ్రామ స్థాయి ఎన్నికలకు సంసిద్ధంగా ఉండాలని సూచించారు, పార్టీ కోసం కష్టపడ్డ ప్రతీ కార్యకర్తకు, నాయకుడుకు పార్టీ తగిన గుర్తింపు ఇచ్చి అండగా ఉంటుందని భరోసా కల్పించారు,తాను పార్టీ కార్యకర్త నుండి ఈరోజు ఎంపీ స్థాయిలో ఉన్నందుకు గర్వపడుతున్నానని, పార్టీ తనకి అవకాశం ఇచ్చినట్లే, పార్టీ కోసం పని చేసిన ప్రతీ కార్యకర్తకు, నాయకుడికి మంచి అవకాశాలు కల్పిస్తుందని భరోసా కల్పించారు,స్థానిక యువకులకు ఉద్యోగాలు కల్పన తదితర అంశాలు ప్రస్తావించారు,కార్యకర్త స్థాయి నుండి పార్టీ ఆదేశించిన ప్రతీ కార్యక్రమంను నిబద్ధతో చేసేవారని చెప్పుకొచ్చారు,అనంతరం ఎంపీ ఆధ్వర్యంలో రణస్థలం మండల పార్టీ కమిటీ అధ్యక్షులు,కార్యదర్శి అభ్యర్థి ఎన్నిక పై మండల నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను స్వీకరించి, గౌరవ ఎంపీ గారి అధ్యక్షతన రణస్థలం నూతన మండల పార్టీ కమిటీ అధ్యక్షులుగా లెంక శ్యామలరావు ,మండల పార్టీ కమిటీ నూతన కార్యదర్శిగా మండపాక కనకరావు సభా వేదికగా ఏకగ్రీవంగా ఎన్నిక కాబడ్డారు, ఈ కార్యక్రమంలో రణస్థలం మండల పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఖరీఫ్ సాగు పై రైతులకు అవగాహన

### - వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం




సరుబుజ్జిలి, జూన్ 10, మేజర్‌న్యూస్: వరి పంటలో అధిక దిగుబడులను ఇచ్చే విత్తనాలను ఎంపిక చేసుకోవాలని రాగోలు వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ మధు కుమార్ తెలిపారు. సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురం గ్రామంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ కు అనుకూల విత్తనాల ఎంపిక, పరిశోధన స్థానాలు తయారు చేసిన రకాలు వాటి లక్షణాలు వివరించారు. నేల సారాన్ని అనుసరించి రకాలను ఎన్నుకున్నట్లయితే అధిక దిగుబడులు సాధించవచ్చునని తెలిపారు. నత్రజని ఎరువులతో పాటు పాస్పరస్ పొటాషియమను వాడడం ద్వారా వరి దిగుబడి బాగుంటుందని తెలిపారు. ధీర్ఘకాలిక రకాలు మంచి దిగుబడిని ఇస్తాయని, రాగోలు పరిశోధన స్థానం లో రూపొందించిన నూతన రకాల మినికిట్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త తమ్మినేని రాజశేఖర్ మాట్లాడుతూ ఎరువులు యాజమాన్యం, పచ్చిరొట్ట ఎరువుల ప్రాధాన్యాన్ని వివరించారు. నేల ఆరోగ్యంపై దృష్టి సారిస్తే పంటలు దిగుబడి అధికంగా ఉంటుందని, సమతుల ఎరువుల వాడకం ద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. ఉద్యాన పంటల వైపు రైతులు మొగ్గ చూపాలని కోరారు. అరటి, పామ్ ఆయిల్ వంటి ఉద్యాన పంటల సాగు చేయవచ్చని తెలిపారు. భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి శాస్త్రవేత్త శైలజ మాట్లాడుతూ వరిలో చీడపీడల యాజమాన్యం, లింగాకర్షణ బుట్టల ప్రాధాన్యాన్ని తెలిపారు. డ్రోన్ సాంకేతిక పద్ధతిలో పురుగు మందుల పిచ్చికారి చేసుకునే విధానం, అప్ ద్వారా తెగుల్ల గుర్తింపు తెలిపారు. కేవికే శాస్త్రవేత్త డాక్టర్ సి హెచ్ బాలకృష్ణ మాట్లాడుతూ వ్యవసాయంతో పాటు అనుబంధంగాలైన పెరటి కోళ్ళ పెంపకం, పాడిపశువుల పెంపకం, పుట్టగొడుగుల పెంపకం, పశుగ్రాసాల సాగు, చేపల పెంపకం చేపట్టడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చు అని తెలిపారు. కేవికే ద్వారా అందిచబడుతున్న సాంకేతిక సేవలను వినియోగించుకుని రైతులు లబ్ధి పొందవచ్చని తెలిపారు. కిసాన్ సారధి టోల్ ఫ్రీ నెంబర్ 14426 లేదా 1800-123-2175 ద్వారా రైతులు శాస్త్రవేత్తలతో నేరుగా మాట్లాడవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కిల్లి సిద్ధార్థ, కిల్లి లక్ష్మణ రావు, గన్ను నర్సింమూర్తి, కిల్లి లక్ష్మీ గోవిందరావు, వ్యవసాయ సహాయకులు యమున, సచివాలయ సిబ్బంది, రైతులు అధికారులు పాల్గొన్నారు.

## ఆరు సంవత్సరాలు ఇబ్బందులకు మోక్షం

### - నివగాం వద్ద ఆక్రమణలు తొలగించిన అధికార్లు
### - ఎట్టకేలకు రోడ్డుపనులు ప్రారంభం
### - కాలువ నిర్మాణానికి శ్రీకారం



కొత్తూరు, జూన్ 10, మేజర్‌న్యూస్: హడ్డుబంగి-పాలకొండ ఆర్ అండ్ బి ప్రధాన రహదారి కి నివగాం యస్ వి వీధి దగ్గర ఏర్పడిన భారీ గుంతలకు ఎట్టకేలకు మోక్షం కలిగింది.యస్ సి వీధికి మురుగు కాలువలు లేకపోవడం వల్ల మురుగు నీరు రోడ్డు మీదకు విడిచిపెట్టడంతో సుమారు నలపై మీటర్లు వరకు పెద్ద పెద్ద గోతులు ఏర్పడడం తో గత ఆరు సంవత్సరాల నుండి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీటికి తోడు ఇరు వైపుల రోడ్డు అక్రమణలకు గురైంది. ఆక్రమణలు తొలగించేందుకు యస్ సి వాసులు అంగీకరించక పోవడంతో కాలువలు నిర్మాణానికి బ్రేక్ పడింది. దీనివలన సమస్య పరిష్కారానికి సంవత్సరాలు పట్టిన మోక్షం కలగలేదు. ఎమ్మెల్యే మామిడి గోవిందరావు చొరవతో సమస్య పరిష్కారానికి శ్రీకారం చుట్టి, యస్ ఆర్ జి ఇ యస్ నిధుల నుండి సిసి రోడ్డు, ఇరువైపుల కాలువలు నిర్మాణానికి 39లక్షల రూపాయలు మంజూరు చేశారు. తహసీల్దార్ బాలకృష్ణ,ఇ ఓ పి ఆర్ డి వసంతకుమారి, ఆర్ అండ్ బి అధికారులు ఆధ్వర్యంలో ఆక్రమణలు తొలగించి, కాలువలు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. తహసీల్దార్ బాలకృష్ణ ఆక్రమణల పనులు స్వయంగా పర్యవేక్షించారు.గత ఆరు సంవత్సరాలనుండి నుండి పడుతున్న ఇబ్బందులు తొలగి పోవడానికి చర్యలు ముమ్మరం చేశారు.

## తైక్వాండ్ క్రీడాకారులను అభినందించిన ఎమ్మెల్యే



నరసన్నపేట, జూన్ 10, మేజర్‌న్యూస్: నరసన్నపేట పట్టణానికి చెందిన టైక్వాండ్ క్రీడాకారులు, ఇటీవల ఒరిస్సా లో జరిగిన జాతీయస్థాయి టైక్వాండ్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఆరు పతకాలు సాధించడం పట్ల ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మంగళవారం క్రీడాకారులను అభినందించారు. ఒరిస్సా లోని కటక్ వేదికగా 9వ జాతీయ ఓపన్ టైక్వాండ్ ఛాంపియన్షిప్ 2025 పోటీలలో పాల్గొన్న సబ్ జూనియర్ విభాగంలో (27 కేజీలు) డి సందీప్ రెడ్డి, గోల్డ్ మెడల్. (23 కేజీలు) వాన ధనుంజయ్ కృష్ణ, 42 కేజీల విభాగంలో కారి చందు (సిల్వర్ మెడల్స్ ). 33 కేజీల విభాగంలో దత్తి మనస్విని, 32 కేజీలు విభాగంలో రావాడ నయన వర్షిత్, 49 కేజీల విభాగంలో వల్ల అభిరామ్ బ్రాంచ్ మెడల్స్ సాధించారు. వీరిని ఎమ్మెల్యే తో పాటు వైఎంసిఏ సెక్రటరీ గొద్దు చిట్టిబాబు అభినందించారు. ఈ సందర్భంగా చిట్టిబాబు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో క్రీడాకారులకు నెలవారి స్టైఫండ్ మంజూరు అయ్యేందుకు కృషి చేయాలని, క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను గుర్తించే విధంగా అనేక పోటీలతో పాటు శిక్షణ కార్యక్రమాల నిర్వహణ కూడా ఏర్పాటు చేయాలని, క్రీడాకారులకు ఉద్యోగాల్లో రిజర్వేషన్ కల్పించడం ద్వారా క్రీడలను ప్రోత్సహించేందుకు అవకాశం ఏర్పడుతుందని, ప్రభుత్వం దృష్టికి పై విషయాలు తీసుకెళ్లి క్రీడాకారులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే కు విజ్ఞప్తి చేశారు. ప్రతిభ ఉన్న క్రీడాకారులు పేదరికం కారణంగా రాణించలేకపోతున్నారని రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కృషి చేయాలని వై ఎం సి ఏ సెక్రటరీ గొద్దు చిట్టిబాబు విజ్ఞప్తి చేశారు. కోచ్ తో పాటు, టిడిపి నాయకులు చిరంజీవి రావు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్‌లో ఆడబిడ్డలకు రక్షణ కరువైంది...

పాతపట్నం, జూన్ 10, మేజర్‌న్యూస్: ఆంధ్రప్రదేశ్‌లో ఆడబిడ్డలకు రక్షణ కరువైందని, గత ఏడాది కాలంగా ఇది స్పష్టంగా రుజువవుతూనే ఉందని వైఎస్సార్సీపీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే శ్రీమతి రెడ్డి శాంతి గారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనంతగా ఏపీలో ఆడబిడ్డలపై అత్యాచారాలు జరుగుతున్నాయని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ ఒక్క సంవత్సరంలోనే ఏకంగా 188 మందికి పైగా ఆడబిడ్డలపై అఘాయిత్యాలు జరిగాయన్నారు. ఈ దారుణ సంఘటనలు రాష్ట్రంలో మహిళల భద్రతకు ఏపాటి ప్రాధాన్యత ఇవ్వబడుతుందో స్పష్టం చేస్తున్నాయని అన్నారు. ఓ వైపు రాష్ట్రంలో అసాంఘిక శక్తులు.. మహిళలు, బాలికలపై విచ్చలవిడిగా అత్యాచారాలకు పాల్పడుతున్నా, నిమ్మకు నీరెత్తినట్టు టీడీపీ కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తుదన్నారు. మహిళలు, బాలికలపై యథేచ్ఛగా అఘాయిత్యాలతో ఆంధ్రప్రదేశ్ అంతటా భయభ్రాంతులకు గురయ్యే పరిస్థితులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు మహిళా భద్రతకు పెద్దపీట వేసిందని, దిశ చట్టం వంటి విప్లవాత్మక చర్యలు తీసుకుందని గుర్తు చేశారు. అయితే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం మహిళల భద్రతను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, దీనివల్ల రాష్ట్రంలో అరాచకం పెరిగిపోయిందని విమర్శించారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో మహిళల భద్రత కోసం తీసుకువచ్చిన "దిశ చట్టం" మరియు "దిశ యాప్" లను ప్రస్తుత కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, దాని ఫలితంగా నేరాలు పెరిగాయన్నారు. రోజు రోజుకూ దిగజారుతున్న మహిళల భద్రత తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం ఆడబిడ్డల భద్రతకు తక్షణమే కఠిన చర్యలు



తీసుకోవాలని, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో, మహిళా సంఘాలతో కలిసి వైఎస్సార్సీపీ పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడుతుందని హెచ్చరించారు.

## కరెంటు కోతల సమస్యలపై వినతి పత్రం



**కూర్మన్నపాలెం, జూన్ 10, మేజర్‌న్యూస్:** జీవీఎంసీ 87వ వార్డు పరిధిలో వైయస్ఆర్సీపీ సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో గలవడ్లపూడి ఆర్ హెచ్ కాలనీ, 87 వార్డు పరిధిలోని పలు గ్రామాల్లో కరెంటు కోతలు, లో వోల్టేజ్ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని వడ్లపూడి సబ్‌స్టేషన్ ఏఈ కి వినపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ సబ్ స్టేషన్ లో పవర్ జనరేటర్ రిపేర్ అవ్వడం వల్ల ఈ సమస్య తలెత్తుందని త్వరలోనే పవర్ జనరేటర్ అందుబాటులోకి తెస్తామని పవర్ కోతలు తగ్గుతాయని ఆయన అన్నారు . ప్రగడ వేణుబాబు, ఇల్లపు రాము, దుగ్గపు దానప్పలు, బోండా గోవిందరాజులు, ప్రగడ శంకర్రావు, మార్పు గోవిందా, సబ్బవరపు అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు

## కండక్టర్ కుమార్తెకు ఆర్టీసీ ఈడీ అభినందన



**విశాఖపట్నం, జూన్ 10, మేజర్‌న్యూస్:** ఇటీవల 10వ తరగతి స్టేట్ బోర్డు ఫలితాలు లో ఉత్తమ ప్రతిభ చూపించిన బస్ కండక్టర్ కుమార్తెను జోన్ 2 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.విజయారత్నం అభినందించారు. నూజివీడు డిపో కండక్టర్ బి.రమాదేవి కుమార్తె కు ఇటీవల వెలువడిన 10 వ తరగతి ఫలితాల్లో ప్రథమ శ్రేణి సాధించినందుకు ఈడి సత్కరించారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయారత్నం మాట్లాడుతూ బస్ కండక్టర్ గా విధులు నిర్వహిస్తు, పిల్లల సంరక్షణ చూసుకోవడం సాధారణ విషయం కాదని, కుమార్తె ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేసిన కండక్టర్ రామదేవిని అభినందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసరావు, జోన్ అధ్యక్షుడు జి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## చీపురుపల్లి అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉండాలి: నీలకంఠం



**చీపురుపల్లి జూన్ 10 మేజర్ న్యూస్:** చీపురుపల్లి నియోజకవర్గం అభివృద్ధి పై చిత్తశుద్ధి ఉండాలని బీజేపీ మండల అధ్యక్షుడు ఇప్పిలి నీలకంఠం సూచించారు. గరివిడి, చీపురుపల్లి, మెరకముడిదాం, గుర్ల మండలాలు జిల్లాలో బాగా వెనుకబడి ఉన్నాయని, ఇందులో గరివిడి, చీపురుపల్లి పట్టణాల్ని కలిపి ఒక మున్సిపాలిటీగా చేయగలిగితే మంచి అభివృద్ధి చెంది మున్సిపల్ నిధులు వచ్చి పట్టణాలుగా అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉందన్నారు. అలాగే రెస్కో సంగతి ఏదో ఒకటి తేల్చుకుండా మధ్యలో ఉంచారని, తోటపల్లి కాలువ పూడిక తీత, పిల్ల కాలువ నిర్మాణాలు ఇంతవరకు జరగలేదన్నారు. చీపురుపల్లిలో భూగర్భ డ్రైనేజీ పనులు చేస్తామని ఇదివరకు టీడీపీ ప్రభుత్వ హయంలో సర్వే పనులు జరిపి ఆపేశారని ఇప్పటికీ ఆ పని ప్రారంభం కాలేదన్నారు. దేవాలయ భూములను దేవుడికి చెందినట్లు చేయాలి కానీ ఆ భూములు వ్యక్తుల చేతిలో ఉన్నాయని, అనేక రెవెన్యూ సమస్యలు పరిష్కారం కాలేదని చెప్పారు. ప్లాస్టిక్ వాడకం, రసాయనలతో పండ్లను మగ్గించడం వంటి ఆహార పదార్థాల కల్తీ నియంత్రణపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. మత్తు పదార్థాలను నిర్మూలించాలి, అలాగే ఆసుపత్రి స్థాయిని కూడా పెంచి అభివృద్ధి చేయాలి, రైల్వేస్టేషన్లో దూర ప్రాంతాలకు వెళ్లే రైల్లు కూడా నిలుపుదల చెయ్యాలని, పాలకొండ విజయనగరం రోడ్డు నాలుగు లైన్లుగా విస్తరింప చేయడంతో పాటు మూతపడిన మాంగనీస్ పరిశ్రమలన్నీ తెరిపించి యువతకు ఉపాధి అవకాశం కల్పించాలని కోరారు.

## ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా డి.టి. చేతన్ కుమార్



**ఆనందపురం, జూన్ 10, మేజర్‌న్యూస్:** ఆనందపురం మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా డిప్యూటీ తహసీల్దార్ డి.టి. చేతన్ కుమార్ నియమితులయ్యారు. సోమవారం జిల్లా కలెక్టర్ విడుదల చేసిన బదిలీల్లో భాగంగా ఈ మార్పులు చేశారు. ప్రస్తుత తహసీల్దార్ పేర్లి శ్యాంప్రసాద్‌ను విశాఖపట్నం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి బదిలీ చేశారు. వారి స్థానంలో డిప్యూటీ తహసీల్దార్ ఎల్. చేతన్ కుమార్‌ను తాత్కాలిక తాసిల్దార్ గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన కొద్దికాలం పాటు ఈ పదవిలో విధులు నిర్వర్తించనున్నారు. ఈ బదిలీల్లో భాగంగా రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) రీటా ఆఫీసు నుంచి భీమిలి ఆర్డీఓ కార్యాలయానికి బదిలీ అయ్యారు.

## పలు గ్రామాలలో దోమల మందు పిచికారి పనులు..



**చింతపల్లి, జూన్ 10, మేజర్‌న్యూస్:** ఏజెన్సీ లోని రింతాడ సచివాలయం పరిధిలోని నూతి బంద, ఇందిరా నగర్ గ్రామాలలో దోమల మందు పిచికారి పనులు (స్ప్రేయింగ్) నిర్వ హించినట్లు సబ్ యూనిట్ అధికారి ఆర్ కన్నబాబు తెలిపారు. ఈ సంద ర్భం గా ఆయన మాట్లాడారు.వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల ఆదే శాలు మేరకు మొదటి విడత ఏ సి ఎం 5% దోమల మందు పిచికారి పనులు జరుగుతున్నాయని, ఈ మేరకు సోమ మంగళ వారాలలో గూడెం కొత్త వీధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని , రింతాడ సచి వాలయం -1 లో గల నూతి బంధ, ఇందిర నగర్,అలాగే అసరాడ గ్రామా లలో. దోమల మందు పిచికారి పను లు (స్ప్రేయింగ్) నిర్వహించడం జరిగిందని కన్నబాబు తెలిపారు. మలేరియా,డెంగ్యూ, చికెన్ గున్యా, వంటి వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు గాను ముందస్తు చర్యలలో భాగంగా స్ప్రేయింగ్ పనులు చేపట్టడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ, పరిసరాల పరిశుభ్రత పాటించడం, మురుగు కాలువలలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాల న్నారు. తప్పనిసరిగా దోమ తెరలు వాడాలనీ సూచించారు. అలాగే ప్రతి శు క్రవారం డ్రై డే పాటించాలన్నా రు. ముందు జాగ్రత్త చర్యలలో భాగం గా ఆరోగ్య సూత్రాలు పాటించినట్ల యితే, కొంతవరకు దోమ కారక వ్యాధులను అదుపు చేసే అవకాశం ఉంటుందన్నారు ఇలా ఉండగా దోమల మం దు పిచికారి పనులు జరిగిన నేపద్యం లో ప్రతి గృహం లోపల, బయట, పిచికారి చేసిన గోడలను అలక రాదని, స్ప్రే చేసిన దోమల మందు 45 రోజుల వరకు దోమల పై ప్రభావం చూపిస్తుందన్నా రు. ఈ సందర్భం గా స్ప్రేయింగ్ పనులు నిర్వహించు తున్న సిబ్బందికి పూర్తి స్థాయిలో ప్రజలు సహకరించాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో, రింతాడ వైద్య సిబ్బంది సత్యనారాయణ, అచ్యుత్ ,భాగ్యలక్ష్మి, తో పాటు ఆశా కార్యకర్తలు, శ్రీదేవి, తలుపులమ్మ, దీన కుమారి, రాజేశ్వరి ,డ్వాక్రా గ్రూప్ సభ్యురాలు కుసుమ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారని ఆయన తెలిపారు.

## బాలికల భవిష్యత్తుకు పునాదులు ఏర్పరచుదాం



**దుంబ్రిగుడ, జూన్ 10, మేజర్‌న్యూస్:** సమాజంలో బాలికలు ఉన్నత స్థాయిలో ఎదిగేలా పునాదులు ఏర్పరచుదామని ఇన్చార్జి తహసీల్దార్ ముజీబ్, ఎంపీడీఓ ప్రేమ్ సాగర్ అన్నారు. ఐసీడీఎస్ సీడీపీవో నీలిమ ఆధ్వర్యాన కిశోరి వికాసం ముగింపు కార్యక్రమం మంగళవారం జరిగింది. ఐసీడీఎస్ కార్యాలయంలో సమావేశం అనంతరం ర్యాలీ చేసి జాతీయ రహదారిలో మానవహారాన్ని చేపట్టి కొవ్వొత్తుల ప్రదర్శనతోపాటు బెలూన్లను ఎగుర వేశారు. బాలికల పట్ల అసమానతలు వదిలి వారి బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు, అంగన్వాడీ బాలికలు తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎస్ఎంఈ ల కోసం ఫ్లిప్‌కార్ట్ సమర్థ్ కార్యక్రమం

**విశాఖపట్నం, జూన్ 10, మేజర్‌న్యూస్:** భారతదేశ స్వదేశీ ఈ కామర్స్ మార్కెట్‌ప్లేస్ అయిన ఫ్లిప్‌కార్ట్ నేడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాగస్వామ్యంతో ఎంఎస్ఎంఈ ఆన్‌బోర్డింగ్ వర్క్‌షాప్‌ను నిర్వహించింది. స్థానిక చేతివృత్తుల కళాకారులు, నేత కార్మికులు, మహిళా వ్యవస్థాపకులు మరియు స్వయం సహాయక బృందాలకు భారతదేశంలో అభివృద్ధి చెందుతున్న డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో భాగం కావడానికి వీలు కల్పించడం ద్వారా వారిని శక్తివంతం చేయడం ఈ కార్యక్రమ లక్ష్యం. ఫ్లిప్‌కార్ట్ మార్కెట్‌ప్లేస్‌లోకి ప్రవేశించడానికి మరియు తమ వ్యాపారాలను ఆన్‌లైన్‌లో పెంచుకోవడానికి అవసరమైన పరిజ్ఞానం , సాధనాలను ఎంఎస్ఎంఈ ఆన్‌బోర్డింగ్ వర్క్‌షాప్ అందించింది.

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ కార్మిక, కర్మాగారాలు, బాయిలర్స్ ఐఎంఎస్ శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఎంఎస్ఎంఈ అభివృద్ధి సంస్థ చైర్మన్ టి. శివ శంక పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని రామచంద్రపురంలో నిర్వహించిన ఈ వర్క్‌షాప్, స్వయం ఉపాధి మరియు వ్యవస్థాపకత కోసం స్థానిక సమాజాల సామర్థ్యాలను బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకుంది. ఫ్లిప్‌కార్ట్ మార్కెట్‌ప్లేస్ ఆఫర్‌లపై సమాచారాన్ని అందించడంపై ప్రధానంగా దృష్టి సారించి తీర్చిదిద్దిన ఈ వర్క్‌షాప్ లో చేతివృత్తులవారు, నేత కార్మికులు మరియు కళాకారుల సంఘాలకు వారి వ్యాపారాలను పెంచుకోవడానికి జాతీయ మార్కెట్ అవకాశాలను అందించడం లక్ష్యంగా పెట్టుకుంది. రామచంద్రపురం నుండి గ్రామీణ మహిళా వ్యవస్థాపకులు, సూక్ష్మ సంస్థలు మరియు మహిళల నేతృత్వంలోని స్వయం సహాయక బృందాలు (ఎస్ హెచ్ జి లు) హాజరైన వర్క్‌షాప్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో భాగస్వామ్యంతో ఫ్లిప్‌కార్ట్ నేతృత్వంలోని ఓరియంటేషన్ వర్క్‌షాప్‌లో పాల్గొన్నాయి.ఈ భాగస్వామ్యంపై ఫ్లిప్‌కార్ట్ గ్రూప్ చీఫ్ కార్పొరేట్ అఫైర్స్ ఆఫీసర్ రజనీష్ కుమార్ మాట్లాడుతూ ,"ఫ్లిప్‌కార్ట్ భారతదేశం అంతటా 1.8 మిలియన్లకు పైగా ప్రజల జీవనోపాధిని ప్రభావితం చేసింది, స్థానిక చేతివృత్తులవారు మరియు గ్రామీణ మహిళా వ్యవస్థాపకులను మా సమర్థ్ కార్యక్రమం ద్వారా ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్ తో కొత్త వృద్ధి అవకాశాలను అందించడం ద్వారా వారికి మద్దతు ఇవ్వడంలో కీలక పాత్ర పోషిస్తోంది అన్నారు.

## బాలికలకు కిషోరీ వికాసంపై అవగాహనా కార్యక్రమం



**బొబ్బిలి:, జూలై 10: మేజర్ న్యూస్:** బొబ్బిలి పట్టణం లోని 16,18 వ వార్డు కుమ్మరి వీధి లో మంగళవారం స్త్రీ శిశు సంక్షేమసిబ్బంది, వైద్య ఆరోగ్య సిబ్బంది,సచివాలయసిబ్బంది సంయుక్తంగా కిషోర్ వికాసం కార్యక్రమం నిర్వహించారు.బాలికల కి కిషోరీ వికాసం పై అవగాహనా కల్పించినట్లు ఐ. సి. డి. ఎస్. సిబ్బంది తెలిపారు. కిషోరీ వికాసం కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మే 2 తేదీ నుండి జూన్ 10 తేదీ వరకు యుక్త వయస్సు బాలికల కి 12 అంశాలు పై బాలికలకి ఎదురయ్యే సమస్యలు పై అవగాహనా మరియు శిక్షణ కార్యక్రమం చేపడుతున్నట్లు సూపర్వైజర్ రాజు తెలిపారు. బాలికల వ్యక్తిగత పరిశుభ్రత, బాల్య వివాహాలతో కలిగే అనర్ధాలు పై అవగాహనా, సైబర్ మోసాలు, ఆన్లైన్ భద్రత, సమస్యలు, వృత్తి నైపుణ్యం, ఆత్మ రక్షణ, లింగ అసమానతలు, కౌమార దశలో ఐరన్ లోపం వల్ల రక్త హీనత ఎలా వస్తుంది, బాలలు హక్కులు, పోక్సో చట్టం, ఋతు క్రమ పరిశుభ్రతలు పై అవగాహనా కల్పించినట్లు తెలిపారు. అలాగే ఆడపిల్లల్ని ఎదగనిద్దాం, ఆడపిల్లల్ని చదవనిద్దాం అని పిలుపునిచ్చారు. అనంతరం రక్త హీనత, టీనేజ్ ప్రగ్నన్సీ లు, బాల్య వివాహాలు అరికట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కేంద్రాల సిబ్బంది, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర అధ్యక్షుణ్ణి పరామర్శించిన దేశం జిల్లా రథ సారధి



**కొత్తూరు, జూన్ 10, మేజర్‌న్యూస్:** తెలుగుదేశం దేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తండ్రి మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం అనారోగ్యం తో ఇటీవల మృతి చెందడం తో విశాఖపట్నం లో ఆయన స్వగృహం లో కలసి తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కలమట వెంకటరమణ సోమవారం పరామర్శించారు. సింహాచలం చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుణ్ణి ప్రార్ధించారు. ఎమ్మెల్యే గా పనిచేసిన సమయంలో పేద ప్రజల సమస్యలు పరిష్కారానికి విశేష కృషి చేశారని కలమట అన్నారు.

## మహిళా పక్షపాతి చంద్రబాబు..



**నరసన్నపేట, జూన్ 10, మేజర్‌న్యూస్:** నరసన్నపేట మండల మహిళ అధ్యక్షరాలు ఆధ్వర్యంలో మండల మహిళ సమాఖ్య సమావేశంలో సభ్యులు ఆహ్వానం మేరకు పాల్గొన్న నియోజకవర్గ సమన్వయ కర్త బగ్గు అర్చన. ఈ సందర్భంగా ఘన స్వాగతం ఫలికిన మహిళ మండలి సభ్యులు. ముందుగా మండల కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొని మహిళా మండల సభ్యులు మహిళా నాయకులతో కలసి మొక్కలు నాటారు . అనంతరం మహిళా సమైక్య సమావేశంలో బగ్గు అర్చన మాట్లాడుతూ మహిళలు అభ్యున్నతికి,అభివృద్ధికి, ఆర్థికంగా ఎదుగుదాలకు కూటమి ప్రభుత్వం, ముఖ్య మంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు చేపడుతున్న కార్యక్రమాలు వివరించారు. మహిళల ఆర్థిక ప్రగతికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని, మహిళా సంఘాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని అన్నారు. ప్రతి మహిళ సభ్యులు డ్వాక్రా సంఘాలు ద్వారా వచ్చిన లబ్దిని వినియోగించుకొని ఆర్థికంగా ఎదగాలని ఆమె సూచించారు. ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు మహిళ పక్షపతి అని మహిళలు అభివృద్ధికి గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో డ్వాక్రా సంఘాలు, స్వయం శక్తీ సంఘాలు, మహిళలకు ఆస్థిలో సమానహక్కు, దీపం పథకం ద్వారా ఉచిత గ్యాస్ మరియు ఇప్పుడు మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు కూడా ఇవ్వడం జరుగుతుందని ప్రతి ఒక్కరు ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు పొంది, అవగాహనా కల్పించే విధంగా ముందుకు నడవాలి అని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా అధ్యక్షరాలు పూచ్చల కల్పన ,మార్కెట్ కమిటీ చైర్మన్ పాగోటి ఉమామహేశ్వరీ , మాజీ అధ్యక్షులు బలగ భారతి ,సభ్యులు, వార్డ్ సభ్యులు బత్కాల సంతోసి గుణుపూరు రామలక్ష్మి, మహిళ సమాఖ్య సంఘ సభ్యరాలు, ఏపీఎం అప్పల రామయ్య, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## శ్రీవారి సేవలో అరకు ఎంపీ గుమ్మ తనూజరాణి దంపతులు



**విశాఖపట్నం, జూన్ 10, మేజర్‌న్యూస్:** తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామి వారిని అరుకు పార్లమెంట్ సభ్యురాలు గుమ్మ తనూజరాణి దంపతులు మంగళవారం దర్శించుకున్నారు. వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో ఎంపీ డాక్టర్ తనూజరాణి, ఆమె భర్త వైసిపి నేత చెట్టి వినయ్ స్వామివారి సేవలో పాల్గొన్నారు. టీటీడీ అధికారులు వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయంలోకి వెళ్లిన అరుకు ఎంపీ, దంపతులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

## మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

**– తెలుగు మహిళా అధ్యక్షురాలు గొండు.స్వాతిశంకర్**



**శ్రీకాకుళం, జూన్ 10, మేజర్‌న్యూస్:** అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జర్నలిస్టు వి.వి.ఆర్. కృష్ణంరాజు, సాక్షి ప్రతినిధి కొమ్మినేని శ్రీనివాసరావుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు గొండు.స్వాతిశంకర్ అన్నారు. వైసిపి అరాచకాలకు అడ్డువెయ్యాలని స్థానిక సూర్యమహల్ కూడలి నుండి ఏడురోడ్ల కూడలి వరకు నిరసన తెలుపుతూ ధర్నా నిర్వహించారు. ఇందులో భాగముగా తెలుగు మహిళా అధ్యక్షురాలు గొండు.స్వాతిశంకర్ మాట్లాడుతూ మహిళలపై అనుచిత వాక్యలు సరికాదని, యావత్ ప్రపంచమే దీన్ని ఖండిస్తోందన్నారు. మహిళలకు రక్షణ కరువైందని, కూటమి ప్రభుత్వం రాష్ట్రానికి చేస్తున్న అభివృద్ధిని చూడలేక, ఇలాంటి నీచమైన చర్యలు తగదన్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో ఎక్కడ అభివృద్ధి చెందిందో చెప్పాలని, అందుకు రాష్ట్ర ప్రజలు తమ ఓట్లతో సమాధానం చెప్పి కూటమి ప్రభుత్వానికి దారులు వేసిన వారికి సమాధానం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ తెలుగు మహిళా అధ్యక్షురాల బృందం, టీడీపీ అభిమానులు, కార్యకర్తలు, స్థానికులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా గ్రామదేవతల సిరిమానోత్సవం



**శ్రీకాకుళం, జూన్ 10, మేజర్‌న్యూస్:** అమ్మదయతో రాష్ట్రం శుభీక్షమని, ప్రజలందరూ బాగుండాలని, శాసనసభ్యులు గొండు.శంకర్ అన్నారు. స్థానిక కొత్తపేట పరిసర ప్రాంతాల ఆరాధ్య గ్రామదేవత సిరిమానోత్సవాలను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించి మాట్లాడుతూ అమ్మ దయతో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి, సంక్షేమ పథకాలను అమలుపరుస్తుందని, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా.చంద్ర బాబు నాయుడు, మంత్రి లోకేష్ సిరిమానోత్సవాలకు అన్ని సౌకర్యాలు కల్పించేలా సిద్ధం చెయ్యాలని ప్రత్యేక శ్రద్ధ వహించారని, అంగరంగ వైభవంగా సిరిమానోత్సవం జరగటం ఆనందంగా ఉందన్నారు. స్థానిక కొత్తపేట నుండి జిల్లా పరిషత్ కార్యాలయ ప్రాంతాల వరకు కాలువాల వ్యవస్థ, శానిటైజింగ్, విద్యుత్ స్థంబాలు, విద్యుత్ అంతరాయాలు, ప్రమాద అవకాశాలపై క్షుణ్ణంగా పరిశీలించామని, భక్తులకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సంబంధిత అధికారులతో జాగ్రాత్తవహించామన్నారు. అమ్మదయ ఉంటె, అన్నీ ఉన్నట్లేనని, అమ్మని దర్శించుకొని, తనివితీరా సిరిమానోత్సవాలను ఆస్వాదించాలన్నారు. పోలమ్మతల్లి దేవాలయానికి వెళ్లి దర్శనం చేసుకొని, సిరిమానోత్సవాలకు భక్తుల సౌకర్యాలపై ఆరాతీసి తీసుకోవాల్సిన బాధ్యతలను, వివరించారు. త్రాగు నీటి సౌకర్యం, ప్రథమచికిత్స, అంబులెన్సు సర్వీస్, మజ్జిక పంపిణీ, ట్రాఫిక్ నిబంధనలు, కోవిడ్ నిబంధనలు పరిశీలించి తగు సూచనలను అందిస్తూ ప్రజలతో మమేకమయ్యారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షిస్తూ ఆనందంతో మునిగితేలారు. ఎమ్యెల్యేగా కాకుండా, సామాన్యునిగా అందరితో కలసి నృత్యాల ఆనందహేలతో అందరినీ ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, డివిజన్ ఇంచార్జి, కొత్తపేట పరిసర అధికారులు, గ్రామస్థులు, టీడీపీ అధికారులు, మున్సిపల్ సిబ్బంది, విద్యుత్ సిబ్బంది, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రపంచ రక్త దాతల దినోత్సవం




**శ్రీకాకుళం, జూన్ 10, మేజర్‌న్యూస్:** భారత్ ప్రభుత్వ మరియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ, వైద్య ఆరోగ్యశాఖ సూచన మేరకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ శ జిల్లా శాఖ బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో ఎచ్చెర్ల మండలం, ఎచ్చెర్ల నందు శ్రీ వెంకటేశ్వర గ్రూప్ ఆఫ్ కాలేజీస్ ఆవరణములో ప్రపంచ రక్తదాతల దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థులకు రక్తదానం పై అవగాహన కల్పించడం జరిగినది. ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ నాగోజి మాట్లాడుతూ రక్తదాత ప్రాణ దాత, స్వచ్ఛంద రక్తదాతలు వల్లనే అనారోగ్యానికే గురైన వారు కోల్కొని పునర్జన్మ పొంది జీవిస్తున్నారు. కాలేజీ పరిపాలన అధికారి బి. తిరుపతిరావు మాట్లాడుతూ రక్తదాతలను గౌరవించుకోవడం మన సాంప్రదాయం అన్నారు. వెంకటేశ్వర జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పి. చిట్టిబాబు మాట్లాడుతూ తలసీమియా మరియు సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిగ్రస్తులు, దాతలు వలనే జీవించగలుగుతున్నారు, రక్తదాత లేకపోతే ఇబ్బంది పడే వాళ్ళం. రెడ్ క్రాస్ ప్రతినిధులు కే సత్యనారాయణ, పి చైతన్య కుమార్ , ఎన్ ఉమాశంకర్ రక్తదాన ఆవశ్యకత గురించి వివరించారు, జిల్లా నందు రక్త దానం అవసరము, ప్రస్తుత స్థితి మున్నగు అంశాలను విద్యార్థులకు తెలియజేయడమైనది. పిమ్మట అవగాహన ర్యాలీ చేపట్టడం అయినది. అవగాహన కార్యక్రమాలు తేదీ10 నుండి 14వ వరకు వివిధ ప్రాంతాలలో అవగాహన కల్పించి రక్తదానానికి దాతలను ప్రేరేపించి రక్తము యొక్క కొరతను అధిగమించడానికి దోహదపడుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

## మీడియా ఆస్తుల ధ్వంసం హేతునీయమైన చర్య

**–వైకాపా జిల్లా అధికార ప్రతినిధి కోట గోవింద రావు**



**ఆమదాలవలస, జూన్ 10, మేజర్‌న్యూస్:** మీడియా ఆస్తులను ధ్వంసం చేయడం అధికార దౌర్జన్యానికి పరాకాష్టగా కూటమి ప్రభుత్వం అరాచకాలు కొనసాగుతున్నాయని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కోట గోవిందరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు అక్రమ అరెస్టు, రాష్ట్రంలో సాక్షి కార్యాలయాలపై టిడిపి నేతలు చేస్తున్న కుట్ర పూరిత దాడులను ఖండిస్తూ ఆయన టిడిపి నాయకులపై మండిపడ్డారు.విశ్లేషకుడు కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్టు దుర్మార్గపు చర్య అని తీవ్రంగా ఖండించారు. నిజాలు రాసే కళాలను ,వాస్తవాలు చెప్పే గొంతుని అణచివేసే దిశగా కూటమి పాలన సాగిస్తుందన్నారు .ప్రజాస్వమ్యానికి ప్రతీకగా నిలిచే పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగిస్తున్నారని మండిపడ్డారు. అమరావతి పై ఇటీవల సాక్షి టీవీలో జరిగిన చర్చలో కొన్ని వాఖ్య లపై నిరసనల పేరుతో టిడిపి నేతలు దౌర్జన్యానికి దిగడం దారుణమన్నారు. ప్రభుత్వ తప్పిదాలను, అరాచకాలను ప్రజల ముందుకు సాక్షి టీవీ తీసుకువస్తుందనే నెపంతో ఇటువంటి చర్యలకు పాల్పడం అమానుషం అన్నారు. ఒక చర్చా కార్యక్రమాన్ని కారణంగా చూపించి ఆస్తుల ధ్వంసానికి ,అక్రమ అరెస్టులు చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ప్రజల నుండి చూపు మళ్లించేందుకు కూటమి ప్రభుత్వం ఇటువంటి దాడులు చేస్తుందన్నారు. అధికారం చేపట్టి ఏడాది అయినా ఒక్క హామీని అమలు చేయకపోవడంతో ప్రజల నుండి వస్తున్న వ్యతిరేకతను కప్పిపుచ్చుకునేందుకు డైవర్షన్ పాలటిక్స్ చేస్తున్నారన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగం ప్రజలకు కల్పించిన వాక్ స్వాతంత్ర్యాన్ని హరించేలా కూటమి ప్రవర్తిస్తుందన్నారు. అక్రమ కేసులు ,అరాచకాలు, దౌర్జన్యాలతో ఆంధ్ర రాష్ట్రాన్ని కూటమి అరాచకానికి కేరాఫ్ గా మారుస్తుందన్నారు. ప్రభుత్వం తన తీరు మార్చుకోవాలని, దాడులకు తెగబడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ను కలసిన లోతుగెడ్డ



**కొత్తూరు, జూన్ 10, మేజర్‌న్యూస్:** రాష్ట్ర మానవ వనరులు శాఖ మంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కు పార్వతీపురం లో మండల పరిషత్ నేత యల్ తులసీ వర ప్రసాదరావు మర్యాద పూర్వకంగా కలిశారు. మన్యం జిల్లాలో షైనింగ్ స్టార్స్ అవార్డులు ప్రధానోత్సవ కార్యక్ర మానికి వచ్చిన సందర్భంగా లోతుగెడ్డ పుష్పగుచ్చం ఇచ్చి కలిశారు. మండ లంలో గల ప్రధాన సమస్యలు ఆయన దృష్టికి తీసుకొని వెళ్లినట్లు తెలిపారు.

## బాల్య వివాహాల పట్ల కిశోర బాలికలు, తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలి



**చింతపల్లి, జూన్ 10, మేజర్‌న్యూస్:** బాల్య వివాహాల వలన కలుగు అనర్థాలపై కిశోర బాలికలు, బాలికల తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలని ఎంపీపీ కోరాబు అనూష దేవి అన్నా రు. కిశోర వికాసం వేసవి సెల వుల క్యాంపెయిన్ కార్యక్రమం లో భాగంగా గత నెల రెండవ తేదీ నుంచి ఈ నెల 10 వరకు నిర్వహించిన మండల స్థాయి కార్యక్రమం స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని గిరి గ్రామా లలో 40 రోజులు పాటు నిర్వ హించారు. ముగింపు కార్య క్రమంలో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాల యంలో కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాలు అన్నింటికి అనర్థదాయకమన్నారు. కిషోర బాలికలు బాల్యవివాహాల వలన కలిగే అనర్థాలపై అవ గాహన పెంచుకొని, విద్యార్థి దశలో చక్కగా చదువు కోవా లన్నారు. యుక్త వయ సులో మంచి పోషకాహారం తీసు కోవాలన్నారు. ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ రామకృష్ణలు మాట్లాడుతూ ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కిశోర వికాసం కార్యక్రమం బాల్యవివాహాల నివారణకు గిరి గ్రామాలలో సత్ఫలితాలను ఇస్తుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం ద్వారా కిషోర్ బాలికలేగాక, బాలికల తల్లి దండ్రులకు కూడా అవగాహన కల్పించడం శుభ పరిణామం అన్నారు. సిడిపిఓ రమణ మాట్లాడుతూ సచివాలయ స్థాయిలో బాల్యవివాహాల నిరోధానికి అంగన్వాడీ లతో పాటు మహిళా సంరక్షణ అధికారుల పాత్ర కీలకంగా మారడంతో పలుచోట్ల ఆశించి న స్థాయిలో బాల్యవివాహాల ను కట్టడి చేయడం జరిగింద న్నారు. ఐసిడిఎస్ నిర్వహి స్తున్న కార్యక్రమాలకు స్థానిక మండల పరిషత్, రెవెన్యూ, విద్య, వైద్య తదితర శాఖల సహకారం ఉండటం వలన కార్యక్రమాలను నిరాటంకంగా నిర్వహించుకోవడానికి వీలు కలిగిందని ఆమె అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కిషోర్ బాలికలకు బహుమ తులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ ఎ సి డి పి ఓ రామలక్ష్మి, సూపర్వైజ ర్లు విజయ కుమారి, అప్పల నరస, గౌహరున్నీషా, గౌరీ, అంగన్వాడీ కార్యకర్తలు, వాసవ్య మహిళా మండలి సభ్యులు, అధిక సంఖ్యలో కిశోర బాలికలు, బాలికల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## అటవీ రేంజ్ అధికారి శ్రీనివాసరావు బదిలీ



**అరకులోయ, జూన్ 10, మేజర్‌న్యూస్:** అటవీశాఖ అరకులోయ రేంజ్ అధికారి పి.శ్రీనివాసరావుకు బదిలీ అయింది. ఈ రేంజ్ లో గత కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్న ఆయనను బదిలీ చేస్తూ అటవీశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అటవీశాఖ అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన రేంజి అధికారి పి. శ్రీనివాసరావును ఆశాఖ ఉన్నతాధికారులు విజయనగరం సామాజిక అడవుల సంరక్షణ,నిర్వహణ విభాగానికి బదిలీ చేశారు. అటవీశాఖకు గణనీయమైన ఆదాయాన్ని సమకూర్చే దిశగా రేంజ్ అధికారి పనిచేశారు. ఎకో టూరిజం కింద అటవీ ప్రాంతాన్ని పర్యాటక సందర్శిత ప్రాంతంగా తీర్చిదిద్దడంలో పి. శ్రీనివాసరావు కీలకంగా వ్యవహరించారు. ఉత్తమ అటవీశాఖ రేంజి అధికారిగా పలు పర్యాయాలు ఎంపికైన శ్రీనివాసరావు మంత్రులు, అటవీశాఖ,ప్రభుత్వ ఉన్నతాధికారుల చేతుల మీదుగా ప్రశంస పత్రాలు, అవార్డులందుకున్నారు. బదిలీ అయిన రేంజి అధికారి స్థానంలో ఇంతవరకు ఎవరిని నియమించలేదు.

## ఓటరు నమోదు, సవరణలను సకాలంలో పూర్తి చేయాలి



**చీపురుపల్లి జూన్ 10 మేజర్ న్యూస్:** ఓటర్ల నమోదు, సవరణలను సకాలంలో ఎన్నికల సిబ్బంది పూర్తి చెయ్యాలని ఆర్డీవో బి ఆశయ్య సూచించారు. కలెక్టరు, జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు రాజకీయ పార్టీల సమీక్షా సమావేశం నెం.15 చీపురుపల్లి అసెంబ్లీ నియోజకవర్గం సంబంధించి ఓటరు నమోదు అధికారి, రెవిన్యూ డివిజినల్ అధికారి కార్యాలయంలో నియోజకవర్గస్థాయిలో సమావేశం మంగళవారం నిర్వహించారు. సదరు సమావేశం నందు ఓటరు నమోదు ప్రక్రియ గూర్చి మార్పులు, చేర్పులు తదితర అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో బిజెపి ప్రతినిధి ఎస్.వి. ఎల్.ఎన్. రాజు, వైసీపీ ప్రతినిధి పీతల మురళి, టిడిపి ప్రతినిధి ఎల్ లక్ష్మణరావు, ఎల్ అప్పలనారాయణ, ఆర్ షణ్ముఖ రావు, జనసేన ప్రతినిధి విసినిగిరి శ్రీనివాసరావు, కె కృష్ణ హాజరయ్యారు. సమావేశంలో తహశీల్దారు ఎన్ రాజా రావు, రెవెన్యూ డివిజినల్ అధికారి కార్యాలయం పరిపాలనాధికారి ఆర్.ఈశ్వరమ్మ, ఎన్నికల తహశీల్దారు ఎం.హర్ష వర్ధిని, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆదివాసీ ట్రస్ట్ పై అపోహలు వద్దు.. న్యాయం చేస్తాం



**చింతపల్లి, జూన్ 10, మేజర్‌న్యూస్:** ఆదివాసీ ట్రస్టు పై అపోహలు వద్దని, ట్రస్టు లో ఉన్న సభ్యులు అందరికీ న్యాయం చేస్తానని, ఆ ట్రస్ట్ చైర్మన్ కే బాలం పడాల్ అన్నారు. అంతర్ల గ్రామంలోని ట్రస్ట్ ప్రధాన కా ర్యా ల య ం లో సోమవారం రాత్రి పాత్రికేయు ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసి ట్రస్ట్ ఆధ్వర్యంలో అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చేప ట్టడం జరిగిందని/జరుగు తోందన్నారు. ఈ ట్రస్ట్ ఆధ్వ ర్యంలో విద్య, వైద్యంతో పాటు గ్రామాల అభివృద్ధికి రైతుల కు గిట్టుబాటు ధరలు కల్పించేం దుకు కృషి చేస్తోందన్నారు ఇందులో భాగంగా రైతులు పండించిన పంటలకు గిట్టు బాటు ధర కల్పించడంతో పాటు రైతులకు మేలు చేసే కార్యక్రమాలు చేపట్టింద న్నా రు. నిరుపేద గిరిజనుల దీర్ఘ కాలిక వ్యాధు లకు వైద్యం నిమిత్తం కొన్ని వందల మందికి ట్రస్ట్ ఆధ్వర్యం లో అవసర మైన శస్త్ర చికిత్స లు నిర్వ హించిందన్నారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొంటూ అను నిత్యం ప్రజల సంక్షే మమే పర మావధిగా ట్రస్ట్ పనిచేస్తుంద న్నారు. అదే విధంగా వివిధ గ్రామాలలో త్రాగునీరు వంటి సంక్షేమ కార్యక్రమాలు కూడా నిర్వహించిం దన్నారు. నేడు ట్రస్ట్ లో కొంత మంది దుష్ట శక్తులు చేరి సభ్యు లను గందరగోళానికి గురి చేస్తు న్నారని ఇటువంటి అపోహ లను ఎవరూ నమ్మి అధైర్య పడవద్దని సభ్యులం దరికీ న్యాయం చేస్తానన్నారు. సభ్యులు చెల్లించిన డబ్బులు తిరిగి ప్రజలకే చెల్లిస్తామని, ప్రతి సభ్యునికి న్యాయం చేస్తా మని చైర్మన్ బాలంపడాల్ అన్నారు. ఆదివాసి ట్రస్ట్ పై తప్పుడు ప్రచారాలు చేసి ట్రస్టు సభ్యుల మనోభావాలు దెబ్బ తీసేలా కార్యక్రమాలు చేస్తున్న ట్రస్ట్ సభ్యులైన బాలయ్య చిన్న బ్బాయి, అశోక్ తోపాటు సు మారు రెండు లక్షల పైచిలు కు సభ్యులు ఉన్న ట్రస్ట్ ను ప్రముఖ ఛానల్ ద్వారా ప్రజల కు తప్పుడు సంకేతాలు పంపి న ఛానల్ పై కేసు పెట్టనున్న ట్లు అన్నారు. ఒక న్యూస్ ఛానల్ లో వచ్చిన కథనాలు పూర్తి అవాస్తవమని, దీన్ని ఖండిస్తున్నానన్నారు. ట్రస్ట్ సభ్యులైన బాలయ్య , చిన్న బ్బాయిల ఖాతాలో జమ చేసిన ట్రస్ట్ నగదు కోటి 38 లక్షల 50వేల రూపాయలను వారి నుంచి తిరిగి ట్రస్ట్ కు ఇప్పించాలని కోరుతూ జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ లతో పాటు వివిధ సంఘాల నాయకులను కోరుతున్నామన్నారు. ట్రస్ట్ అభివృద్ధి కోసం వివిధ రూపాలలో పెట్టుబడి పెట్టిన ప్రజలకు డబ్బులు తిరిగి చెల్లించే కార్యక్రమం చేయ నున్నట్లు తెలిపారు. ఎన్ని కష్టాలు వచ్చినా, ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా, ఎన్ని కేసులు నమోదు చేసినా ప్రజల పక్షాన నిలబడి ప్రజలకు సేవ చేస్తూనే ఉంటానని అన్నారు. ట్రస్ట్ లో ఉన్న సభ్యులు ఎవరు అధైర్య పడవలసిన పనిలేదని, మీకు నేనున్నానని భరోసా ఇవ్వడం లో భాగంగా ఇటీవల పాడేరు లో నిర్వహించిన విలేకరుల సమావేశంలోనూ, సోమవారం రాత్రి చింతపల్లి లోనూ నిర్వ హించిన విలేకరుల సమావేశం ద్వారా ప్రజలకు/ సభ్యులకు తెలియజేస్తున్నానన్నారు. త్వరలోనే ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్ని గ్రామాల్లోనూ పర్యటి స్తానన్నారు. జీవితాంతం ప్రజలకు సేవ చేసే కార్యక్రమా లలోనే ఉంటామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

## వృద్ధురాలు దారుణ హత్య

### - పుస్తెలతాడు ఆపహరించిన గుర్తుతెలియని వ్యక్తులు



**కోటబొమ్మాళి, జూన్ 10, మేజర్ న్యూస్:** మండలంలోగల హరిశ్చం ద్రపురం పంచాయతీ పెద్ద హరిశ్చంద్రపురం గ్రామంలో దుంపల దాలమ్మ (68)ను మంగళవారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు అమె ఇంట్లో దారుణంగా హత్యచేశారు. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం మృతురాలు దాలమ్మ మంగళవారం తెల్లవారు జామున సుమారు 3 నుండి 4 గంటల సమయములో నిద్ర లేచి వాకిట ముగ్గు వేసుకుని టీ చేసుకుంటుండగా గుర్తు తెలియని వ్యక్తులు వీధి వైపు నుంచి ఇంట్లోకీ ప్రవేశించి ఇనప రాడ్‌తో తలపైన వెనుక నుండి కొట్టినట్లు, తలకు వెనుక భాగమున తగిలిన 2 దెబ్బలు బట్టి ఆనవాళ్లు కనిపిస్తున్నాయని, మెడలో పుస్తెలతాడు ఇదివరలో వేసుకొని ఉండేటట్లు గ్రామస్తులు సమాచారం బట్టి మెడ ఖాళీగా ఉండటం వల్ల అది తీసుకొని వెళ్ళిపోయి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతురాలు భర్త కృష్ణమూర్తి ఆరోగ్యం బాగోలేక విశాఖపట్నంలో తన కుమారుడు దుంపల రామరావు ఇంటి వద్ద ఉంటూ చికిత్స పొందుతున్నారు. దీంతో గత కొద్ది రోజులుగా ఆమె ఇంటివద్ద ఒంటరిగా ఉంటుందని గ్రామస్థులు తెలిపారు. పోలీసుల సమాచారం మేరకు శ్రీకాకుళం నుంచి వచ్చిన క్ల్యూటీం, అడిషన్ ఎస్పీ కె. శ్రీనివాస్, టెక్కలి సిఐ శ్రీనివాసరావు, ఎస్ఐ వి. సత్యన్నారా యణలు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతురాలుకు భర్తతో పాటు వివాహం అయిన ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు నాగమ్మ, వజ్రంలు ఉన్నారు. ఈ మేరకు మృతదేహాన్ని పోస్టుమార్థం కోసం స్థానిక ప్రభుత్వ అసుపత్రికి తరలించి, మృతురాలు కుమారుడు రామారావు ఇచ్చిన పిర్యాదు మేరకు స్థానిక ఎస్సై వి. సత్యన్నారాయణ కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నారు. దాలమ్మ హత్యతో గ్రామం ఒక్కసారిగా ఉలిక్కి పడిరది. బంధువులు, గ్రామస్థుల రోదనలు అర్తనాధాలు మిన్నంటాయి.

## మహిళలపై అనుచిత వ్యాఖ్యలు తగవు




**పలాస, జూన్ 10, మేజర్‌న్యూస్:** మహిళలపై అనుచిత వ్యాఖ్యలు తగవు అని, అమరావతి మహిళల ఆత్మ గౌరవానికి కించపరిచేలా మాట్లాడిన కొమ్మినేని శ్రీనివాసరావు,కృష్ణరాజులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని,సాక్షి పత్రిక, ఛానల్ ను బ్యాన్ చేయాలని కోరుతూ పలాస తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు. కాశీబుగ్గ మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేసిన అనంతరం మూడురోడ్ల జంక్షన్ వద్ద మానవహారం ఏర్పాటు చేసి, సాక్షి దినపత్రికలను దగ్ధం చేసారు. సాక్షి ఛానెల్ లో నిర్వహించి డిబేట్ లో అమరావతి రైతులను కించపరుస్తు చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. ఈ మేరకు పలాస టీడీపీ కార్యాలయం వద్దకు భారీగా చేరుకున్న పలాస నియోజకవర్గ టీడీపీ నేతలు తొలుత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమన్వయ కర్త యార్లగడ్డ వెంకన్నచౌదిరి, ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పోరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పీరికట్ల విఠల్ రావు మాట్లాడుతు అమరావతి రాజధానిగా ప్రకటించిన నుంచి సాక్షి పత్రిక, ఛానెల్ విషం చిమ్ముతునే ఉన్నాయని మండిపడ్డారు. వైకాపా నేత జగన్ మానస పుత్రిక ఆది నుంచే మూడు రాజధానుల పేరుతో ప్రజల మనోభావాలు దెబ్బతీసారని, ప్రస్తుతం అధికారం పోయిన తరువాత కూడా అమరావతి వద్దనే తప్పుడు మార్గాలు ఎంచు కుంటున్నారని దుయ్యబట్టారు. అందులో భాగంగా అక్కడ మహిళా రైతులను వ్యభిచారులుగా ఆపాదిస్తు కించపరచడం తో మొత్తం తెలుగు మహిళలనే అవమానించినట్లుగా తాము భావిస్తున్నామన్నారు. దీనిపై వ్యాఖ్యలు చేసిన వారికి దండన విధించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేసారు. మరోమారు ఏ ఒక్కరూ కూడా మహిళలను కించపరుస్తే శిక్షలు ఏ విధంగా ఉంటాయో అటువంటి శిక్షలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా మహిళలు ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేసారు. కార్యక్రమంలో బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి లొడగల కామేశ్వరరావుయాదవ్, గాలి కృష్ణారావు,టంకాల రవిశంకర్ గుప్తా,బడ్డ నాగరాజు,గురిటి సూర్యనారాయణ, సప్ప నవీన్,దువ్వాడ శ్రీకాంత్,ఎం.నరేంద్ర, మఎ.రామకృష్ణ,కొత్త సత్యం,సూరాడ మోహనరావు,రట్టి లింగరాజు తదితరులు పాల్గొన్నారు.